ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 26.12.2024 | సంపుటి : 11 సంచిక : 168 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



హనియాను చంపిన ఇజ్రాయెల్

## తగిన మూల్యం చెల్లించుకుంటుంది

ఇరాన్

**టెహ్రాన్(జనంసాక్షి):**హమాస్ నేత ఇస్మాయెల్ హనియాను తామే చంపామని ఇజ్రాయెల్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రకటనపై ఇరాన్ తాజాగా స్పందించింది. హనియాను చంపడం ఓ హేయమైన ఉగ్రవాద చర్యగా పేర్కొంది. ఈమేరకు ఐరాసలోని ఇరాన్

మిగతా 2లో..



భాజపా నేతలు డబ్బు సంపాదించడంలో

## బిజీ అయ్యారు

అఖిలేశ్ యాదవ్

**లక్నో(జనంసాక్షి):**సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ భాజపాపై విమర్శలు గుప్పించారు. భాజపా నేతలు డబ్బు సంపాదించడంలో, ఎన్నికల ప్రణాళికల్లో బిజీగా ఉండి..మహా కుంభమేళాకు

మిగతా 2లో..

# మెదక్ చర్చికి.. వందేళ్ల ఘనత

## సీఎంగా వస్తానన్నాను.. కృపవల్ల అలానే వచ్చాను

- చర్చి క్రిస్మస్ వేడుకల్లో సీఎం రేవంత్
- చర్చికి దేశస్థాయిలో గుర్తింపు ఉందని వెల్లడి
- కాంగ్రెస్‌ది రైతు ప్రభుత్వం
- పేదలకు అనుకూలంగా నిర్ణయాలు
- వనదుర్గామాత ఆలయంలోనూ ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు

> వందేళ్లు పూర్తిచేసుకున్న మెదక్ చర్చికి దేశస్థాయి లో గుర్తింపు ఉంది. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్పుడు ఇక్కడికి వచ్చా.. సీఎం హోదాలో మళ్లీ వస్తానని అప్పట్లో మాటిచ్చా. ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉంది.స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు విజ్ఞప్తి మేరకు చర్చి అభివృద్ధికి నిధులు కేటాయించాం
> – సీఎం రేవంత్



**మెదక్ బ్యూరో,డిసెంబర్25(జనంసాక్షి):** వందేళ్లు పూర్తిచేసుకున్న మెదక్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు విజ్ఞప్తి మేరకు మెదక్ చర్చి అభివృద్ధికి నిధులు కేటా యించామని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్పుడు ఇక్కడికి వచ్చానని.. సీఎం హోదాలో మళ్లీ వస్తానని అప్పట్లో మాటిచ్చానని రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందని చెప్పా రు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయనున్న ఇం దిరమ్మ ఇళ్లలో దళిత, గిరిజన క్రైస్త్రవులకు అత్య ధికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.10లక్షలకు పెంచామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశామని సీఎం వివరించారు. మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఏసు భక్తులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. వందేళ్లు పూర్తి చేసుకున్న మెదక్ చర్చి గొప్ప దేవాల యంగా గుర్తింపు పొందిందని తెలిపారు. చారిత్రక చర్చి అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. అలాగే మెదక్ చర్చితో తనకున్న అనుబంధాన్ని

మిగతా 2లో..

# 2030 నాటికి 20వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి

జాతీయస్థాయి లక్ష్యాన్ని అందుకోడానికి కొత్త క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విధానం

వేగంగా అభివృద్ధి చెందుతోన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలుస్తుంది: డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్(జనంసాక్షి):** హరిత ఇంధనానికి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి, జాతీయ స్థాయిలో పెట్టుకున్న లక్ష్యాన్ని అందుకోడానికి తెలంగాణ ప్రభుత్వం ఒక కొత్త క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విధానాన్ని ప్రతిపాదించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2030 నాటికి స్వచ్ఛమైన, స్థిరమైన 20 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలుస్తుందన్నారు.రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణ గరిష్ఠ విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుందన్నారు. 2023-24లో 15,623 మెగావాట్లు, 2027-28లో 20,968 మెగావాట్లు, 2034-35లో 31,809 మెగావాట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు. తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ - 2024పై వచ్చే నెల 3న హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో వాటాదారుల సమావేశం నిర్వహిస్తున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి తెలిపారు.



ఫార్ములా ఈ-రేసు కేసులో కీలక పరిణామం

పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ వాంగ్మూలం నమోదు

# అడుగుపడింది



**హైదరాబాద్(జనంసాక్షి):** ఫార్ములా ఈ-రేసు కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఫిర్యాదుదారుడు, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు నమోదు చేశారు.దీని ఆధారంగా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్, పురపాలకశాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌కు నోటీసులిచ్చే అవకాశం ఉంది. ఈమేరకు ఏసీబీ సిద్ధమవుతోంది. ఫార్ములా ఈ-రేసు నిర్వహణ కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీసంస్థకు సొమ్ము చెల్లించారంటూ దానకిశోర్ ఏసీబీకి ఈ ఏడాది అక్టోబరు 18న ఫిర్యాదు చేశారు. ప్రభుత్వానికి రూ.54.88 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మిగతా 2లో..

# కజకిస్థాన్‌లో కుప్పకూలిన ప్రయాణికుల విమానం

## ఘోర ప్రమాదంలో 30 మందికిపైగా మృతి..

పలువురికి గాయాలు.. పక్షి ఢీకొనడం వల్లే ఘటన!



**అస్తానా(జనంసాక్షి):**కజకిస్థాన్ లో ఘోర ప్రమాదం జరిగింది. అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ ప్రయాణికుల విమానం అక్టౌ సమీపంలో కుప్పకూలిపోయింది ఈ ఘటనలో పలువురు మృతి చెందినట్లు సమాచారం. ప్రమాద సమయంలో విమానంలో 67 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బందితో కలిపి మొత్తం 72 మంది ఉన్నారు. వీరిలో 30 మందికిపైగా మృతి చెందినట్లు సమాచారం.. మరో 28 మంది గాయాలతో బయటపడినట్లు కజకిస్థాన్ ఆరోగ్య శాఖ మంత్రి వెల్లడించారు. అజర్‌బైజాన్‌లోని బాకు నుంచి బయల్దేరిన ప్రయాణికుల విమానం రష్యా రిపబ్లిక్ చెచెన్యా రాజధాని గ్రోజ్నీ వైపు వెళుతుండగా ప్రమాదానికి గురైంది. గ్రోజ్నీలోని దట్టమైన మంచు కారణంగా దానిని దారి మళ్లించారు. ఈ క్రమంలోనే అక్టౌ ఎయిర్‌పోర్ట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు ప్రయత్నిస్తూ ప్రమాదవశాత్తూ కూలిపోయింది. దాంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదానికి ముందు ఎయిర్‌పోర్ట్‌పైన విమానం పలుమార్లు గిరగిరా తిరిగి, నేల కూలిందని స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ దృశ్యాలు నెట్టింట్లో

మిగతా 3లో..

## ఆప్‌తో పొత్తు మేం చేసిన తప్పు

కాంగ్రెస్ నేత కీలక వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కాంగ్రెస్ నేత, ఏఐసీసీ కోశాధికారి అజయ్ మాకెన్ ఆమ్‌ఆద్మీ పార్టీతో పొత్తుపై కీలక వ్యాఖ్యలు చేశారు. 2013 ఎన్నికల్లో 40 రోజుల పాటు ఆప్‌నకు మద్దతివ్వడం కాంగ్రెస్ చేసిన తప్పని అన్నారు. దీని వల్ల దిల్లీలో కాంగ్రెస్ బలహీనపడిందని వ్యాఖ్యానించారు. తాము చేసిన పొరపాటును ఇప్పటికైనా సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు.దేశ రాజధానిలో పెరుగుతున్న వాయు కాలుష్యం, శాంతి భద్రతలు, పౌర సౌకర్యాల కల్పన మొదలైన సమస్యలను నివారించడంలో ఆప్, భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మాకెన్ మండిపడ్డారు. ఆప్ ప్రభుత్వం దిల్లీ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమయ్యిందని ఆరోపించారు. పదేళ్ల క్రితం

మిగతా 2లో..

# త్వరలో అతిషిని కూడా అరెస్టు చేసే అవకాశం

ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ సంచలన వ్యాఖ్యలు

కావాలనే బీజేపీ కుట్రలు చేస్తోంది : ఢిల్లీ సీఎం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. త్వరలో ఢిల్లీ సీఎం అతిశీని అరెస్ట్ చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేజ్రీ ట్వీట్ పెట్టారు. త్వరలో జరగబోయే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆప్ ప్రభుత్వం రెండు రోజుల క్రితం మహిళా సమ్మాన్ యోజన, సంజీవన యోజన పథకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పథకాలు ప్రకటిండచం కొందరికి నచ్చలేదని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఇందులో భాగంగానే సీఎం అతిశీని తప్పుడు కేసులో అరెస్ట్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని ఆరోపించారు. అంతకంటే ముందు పలువురు ఆప్ నేతల ఇళ్లలో సోదాలు జరగొచ్చని పేర్కొన్నారు.

**కావాలనే బీజేపీ కుట్రలు చేస్తుంది : అతిషి**

కావాలనే బీజేపీ కుట్రలు చేస్తుందని, పత్రికల్లో వచ్చిన పబ్లిక్ నోటీసులు తప్పుడువని, అదంతా బీజేపీ కుట్ర అని ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి అన్నారు. ఆప్ ప్రభుత్వాన్ని బ్లేమ్ చేయడం కోసం బీజేపీ నేతలు కొంతమంది అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆ పబ్లిక్ నోటీస్‌లు వచ్చేలా చేశారని ఆమె ఆరోపించారు. మహిళా సమ్మాన్ యోజన, వృద్ధులకు ఉచిత వైద్యం అందించే సంజీవని యోజన పథకాలను నోటిఫై చేయలేదని ఇవాళ ఢిల్లీ ప్రభుత్వం పబ్లిక్ నోటీస్ రిలీజ్ చేసింది. ఆ నోటీస్ ఢిల్లీలోని

మిగతా 2లో..

అక్రమ కేసులు పెట్టి

## జైలుకు పంపారు

నరేందర్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):**కావాలనే సీఎం రేవంత్‌రెడ్డి తనపై అక్రమంగా కేసు పెట్టి జైలుకు పంపించారని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి విమర్శించారు. లగచర్ల దాడి ఘటనలో తనపై అక్రమ కేసులు పెట్టి జైలుకు

మిగతా 2లో..





నువ్వు వదిలినా..

## నేను వదలను

జోబైడెన్ శిక్షతగ్గించిన వారికి నేను మళ్లీ మరణ శిక్ష పడేలా చూస్తా: ట్రంప్


**న్యూయార్క్(జనంసాక్షి):**మరికొన్ని రోజుల్లో అధ్యక్ష బాధ్యతల నుంచి వైదొలగనున్న జోబైడెన్ ఫెడరల్ మరణశిక్షను ఎదుర్కొంటున్న 40 మంది ఖైదీల్లో 37 మందికి శిక్ష తగ్గించిన విషయం తెలిసిందే. ఈ చర్యను కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఖండించారు. ఈమేరకు ఆయన ట్రూత్ సోషల్ వేదికగా పోస్ట్ చేశారు.'జో బైడెన్ దేశంలోని 37 మంది హంతకులకు మరణశిక్షను తగ్గించారు. నేను అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన వెంటనే రేపిస్టులు, హంతకులకు మరణశిక్ష అమలుచేయాలని న్యాయశాఖను ఆదేశిస్తా. ఈ చర్య అమెరికన్ ప్రజలను రక్షిస్తుంది. దేశంలో మళ్లీ

మిగతా 2లో..

# భాజపా పాలనలో మధ్యప్రదేశ్‌కు కొత్తదిశ

మేధావులూ.. కాంగ్రెస్ పాలనతో మా పాలనను పోల్చిచూడండి

కేన్-బేట్వా నదీ అనుసంధానం ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శంకుస్థాపన



**ఖజురహో(జనంసాక్షి):**స్వాతంత్ర్యం వచ్చాక భాజపా ప్రభుత్వాలు చేసిన అభివృద్ధిని ఇతర పార్టీల పాలనతో పోల్చి చూడాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. కెన్-బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు ఆయన నేడు ఖజురహోలో శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా రెండు నదుల జలాలను ఆయన ప్రాజెక్టు నమూనాలో పోశారు. అనంతరం రిమోట్ బటన్ సాయంతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. "భాజపా ప్రభుత్వానికి రాష్ట్రంలో ఏడాది పూర్తయింది. ఈ కాలంలో ఇక్కడ అభివృద్ధికి కొత్త దిశ లభించింది. ఇక్కడ రూ.వేల కోట్ల విలువైన కార్యక్రమాలు మొదలయ్యాయి. నేడు కెన్-బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు శంకుస్థాపన జరిగింది. దేశాభివృద్ధిలో అటల్ బిహారీ వాజ్‌పేయీ కీలక పాత్ర పోషించారు. సుశాసన్ దినోత్సవం మా ప్రభుత్వానికి ఒక్క రోజు కార్యక్రమం కాదు.. మా గుర్తింపు అది. దేశ ప్రజలు మూడోసారి కేంద్రంలో ఎన్డీయే సర్కారును ఎన్నుకొన్నారు. ఇక మధ్యప్రదేశ్‌లో వరుసగా మా పార్టీని ఎన్నుకోవడంలో సుపరిపాలన పాత్ర చాలా కీలకం. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశంలోని మేధావులు కొన్ని ప్రమాణాలను తీసుకొని.. కాంగ్రెస్,

మిగతా 2లో..

**వాజ్‌పేయి నాణెంను విడుదల చేసిన ప్రధాని మోదీ**

ఘన నివాళులర్పించిన రాష్ట్రపతి, ప్రధాని, ప్రముఖులు

వార్త 2లో



అల్లు అర్జున్‌పై కేసుపై

## చాలా అనుమానాలు

కేంద్ర మంత్రి బండి

**హైదరాబాద్(జనంసాక్షి):**కాంగ్రెస్ నేతలకు అంబేద్కర్ గురించి మాట్లాడే అర్హత లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు."ఎన్టీఆర్ మార్గ్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి తాళాలు వేశారు. ఆయన చరిత్ర తెలిపేలా ఉన్న గదుల్లోకి వెళ్లనివ్వడం లేదు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి ఒక్కసారి కూడా అక్కడికి వెళ్లలేదు. భాజపా

మిగతా 2లో..

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి

## నోటీసులు

వార్త 2లో

# పండుగవేళా ఆగనిదాడులు

## ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా



**కీవ్(జనంసాక్షి):**క్రిస్మస్ వేళ ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడింది. ఖర్కీవ్ నగరంపై క్షిపణులతో భారీగా దాడులు చేసింది. ఈ విషయాన్ని ఆ నగర మేయర్ ఇగోర్ టెరెకోవ్ వెల్లడించారు. "ఖర్కీవ్‌పై భారీగా క్షిపణి దాడులు జరుగుతున్నాయి. పేలుడు శబ్దాలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇంకా నగరం వైపు బాలిస్టిక్ క్షిపణులు వస్తూనే ఉన్నాయి" అని ఇగోర్ తెలిపారు. నష్టాన్ని అంచనా వేస్తున్నామన్నారు. మరోవైపు తాము ఉక్రెయిన్ నుంచి వచ్చిన 59 డ్రోన్లను కూల్చివేశామని రష్యా రక్షణశాఖ తెలిపింది. కొన్ని నెలలుగా తూర్పు ఉక్రెయిన్ లోకి పుతిన్ సేనలు చొచ్చుకొనివెళ్తున్నాయి. అమెరికా కొత్త అధ్యక్షుడు అధికారం చేపట్టేలోగా సాధ్యమైనంత ఎక్కువ ప్రాంతాన్ని తన గుప్పిట్లో పెట్టుకోవాలని రష్యా యోచిస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఉక్రెయిన్‌కు చెందిన 190 ప్రాంతాలను ఆక్రమించినట్లు మాస్కో ప్రకటించుకుంది. అదే సమయంలో మానవ వనరులు, ఆయుధాల కొరతను ఎదుర్కొంటున్న జెలెన్‌స్కీ

మిగతా 2లో..

# అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడులు..



## 46 మంది మృతి

**కాబూల్(జనంసాక్షి):**అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ చేసిన వైమానిక దాడుల్లో మృతుల సంఖ్య 46కు చేరినట్లు తాలిబన్ ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారని తెలిపింది. ఈ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది.తూర్పు పక్తికా ప్రావిన్స్‌లోని బార్మల్ జిల్లాలో నాలుగు గ్రామాలే లక్ష్యంగా వైమానిక దాడులు జరిగాయి. ఇందులో 46 మంది చనిపోగా మరో

మిగతా 2లో..



# శివయ్య అంతా నీదే దయా..

**ఉప్పల శ్రీనివాస్ గుప్త**

**హైదరాబాద్(జనంసాక్షి):**రంగారెడ్డి జిల్లా లోని మోయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామంలో గల శివాలయం ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర అధ్యక్షుడు టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివుని అనుగ్రహం అందరి మీద వుండాలి అని ప్రజలందరూ పాడిపంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయల అభివృద్ధికి కృషి చేస్తుంది అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మేడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ప్రవీణ్, రాజు, యాదయ్య, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన**

# బాధిత కుటుంబానికి రూ.2కోట్ల సాయం

### ఆస్పత్రిలో బాలుడు శ్రీతేజ్‌కు పరామర్శ

### చెక్కును దిల్‌రాజ్‌కు అందించిన అరవింద్

**హైదరాబాద్,డిసెంబర్25(జనంసాక్షి):**సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో బాధిత కుటుంబానికి రూ.2కోట్ల సాయం అందజేయనున్నట్లు నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించిన అనంతరం ఆయన ఈ మేరకు తన నిర్ణయాన్ని ప్రకటించారు. నటుడు అల్లు అర్జున్ తరఫున రూ.కోటి.. పుష్ప2 నిర్మాతలు, దర్శకుడు సుకుమార్ చెరో రూ.50లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సంబంధిత చెక్కులను ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుకు అల్లు అరవింద్ అందజేశారు. దిల్ రాజు, పుష్ప 2 నిర్మాత రవిశంకర్‌తో కలిసి అల్లు అరవింద్ కిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. శ్రీతేజ్‌ను ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాలుడు తండ్రి భాస్కర్‌తో మాట్లాడారు. అనంతరం అల్లు అరవింద్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. 'శ్రీతేజ్ ప్రస్తుతం కోలుకుంటున్నాడని, వెంటిలేషన్ తీసేశారని,. బాలుడు త్వరలోనే మనందరి మధ్య తిరుగుతాడని ఆశిస్తున్నానని అన్నారు. న్యాయపరమైన అంశాల కారణంగా బాధిత కుటుంబ సభ్యులను కలవలేకపోతున్నా. అన్ని రకాల అనుమతులు తీసుకుని శ్రీతేజ్‌ను 10 రోజుల క్రితం పరామర్శించా. ఆ సమయంలో వెంటిలేషన్‌పై ఉన్నాడని అల్లు అరవింద్ తెలిపారు. 'నిన్నటికి, ఈరోజుకి బాలుడి ఆరోగ్యం కాస్త మెరుగు పడింది. అతడి హెల్త్ కండిషన్ బాగుందని వైద్యులు తెలిపారు. బాలుడి కుటుంబానికి అల్లు అర్జున్, 'పుష్ప 2' నిర్మాతలు, దర్శకుడు ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ అడిగాం. సినీ ప్రముఖులతో ముఖ్యమంత్రిని కలిసి చర్చిస్తాం. హీరోలు, దర్శకులు, నిర్మాతలం కలిసి వెళ్తాం. గురువారం ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందని దిల్ రాజు తెలిపారు.ఎఫ్‌డీసీ ఛైర్మన్ అయినందుకు సీఎంను కలుస్తున్నారా? ప్రభుత్వం, సినీ పరిశ్రమ మధ్య చోటుచేసుకున్న పరిణామాల గురించి వెళ్తున్నారా? అని దిల్ రాజును మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. తాను చిత్ర పరిశ్రమ వ్యక్తినని, ఇండస్ట్రీ-ప్రభుత్వం మధ్య వారధిగా ఉండాలని సీఎం బాధ్యత ఇచ్చారని, అదే చేస్తున్నానన్నారు. అల్లు అర్జున్‌ను కలిశారా అని అడగ్గా ఇంకా లేదని, త్వరలోనే కలుస్తానని చెప్పారు.

# క్రిస్మస్‌తో శాంతి, సౌభ్రాతృత్వం, సహనం: హరీశ్

**సిద్దిపేట, డిసెంబర్ 25 (జనంసాక్షి):**

ఏసుక్రీస్తు ప్రబోధించిన ప్రేమ, కరుణ, శాంతి ఇతరుల పట్ల చూపించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. సిద్దిపేటలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏసు క్రీస్తు జన్మించిన డిసెంబర్ మాసం వచ్చిందంటే క్రైస్తవులందరికీ సంతోషంగా ఉంటుందని అన్నారు. ఈ క్రిస్మస్ మనందరికీ శాంతిని, సౌభ్రాతృత్వాన్ని, సహనాన్ని, క్షమాగుణాన్ని నేర్పుతుందని పేర్కొన్నారు. ఎదుటివారి పట్ల జాలి, దయ, క్షమాగుణం కలిగి ఉండాలని ఏసుక్రీస్తు ప్రబోధించారని హరీశ్‌రావు అన్నారు. తోటివారిని ప్రేమించండి.. తోటి వారికి ఉపకారం చేయండి.. పది మందికి సహాయం చేసినపుడే నీ జన్మ ధన్యమవుతుందని ప్రభువు చెప్పారని తెలిపారు. తనను శిలువ వేసిన వారిని, తనను నానా మాటలు అన్నవారిని కూడా క్షమించండి అన్న గొప్ప దయామయుడు ఏసు క్రీస్తు అని కొనియాడారు. అందుకే ఏసుక్రీస్తు గొప్పతనాన్ని ప్రపంచమంతా గుర్తించిందని అన్నారు. దేశంలో క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా జరిపిన ఒకే ఒక ముఖ్యమంత్రి కేసీఆర్ అని హరీశ్‌రావు కొనియాడారు. క్రిస్మస్ తెల్లవారి బాక్సింగ్ డే రోజు కూడా కేసీఆర్ సెలవుగా ప్రకటించారని గుర్తుచేశారు. బతుకమ్మ పండుగకు హిందువులు, రంజాన్ పండుగకు ముస్లింలు, క్రిస్మస్ పండుగకు క్రైస్తవులు కొత్త బట్టలతో ఉండాలని కేసీఆర్ పదేళ్లపాటు తోఫాను అందించారని తెలిపారు. కానీ, దురదృష్టవశాత్తు ఇప్పుడున్న ప్రభుత్వం ఆ తోఫాలను కొనసాగించకుండా ఆపేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా మీ అందరి జీవితాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరియాలని, మీ కోరికలు, కలలన్నీ నిజం కావాలని ఆకాంక్షిస్తున్నానని హరీశ్‌రావు అన్నారు. మీ భవిష్యత్తు బంగారుమయం కావాలని, ఉజ్వలంగా ఉండాలని ఆ ఏసు ప్రభువును మనసారా ప్రార్థిస్తున్నానని తెలిపారు.





# మెదక్ చర్చికి వందేళ్ల ఘన చరిత్ర

ఈ సందర్భంగా రేవంత్ గుర్తుచేశారు.శతాబ్ది ఉత్సవాలు, భక్తులతో క్రిస్మస్ జరుపుకోవాలనే ఇక్కడకు వచ్చానని తెలిపారు. తమది పేదల ప్రభుత్వమని.. పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పా రు. ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంలో దళితులు, గిరిజనులకు మేలు జరుగుతోందన్నారు. మెదక్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుం దని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. క్రిస్మస్ వేడుకల్లో సీఎం రేవంత్‌తో పాటు మంత్రులు పొంగు లేటి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ పాల్గొన్నారు.కాగా.. మెదక్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గామాత అమ్మవా రిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ రఘునందన్ రావు తదితరులు వన దుర్గాదేవిని దర్శించుకున్నారు. ఉదయం బేగంపేట విమానా శ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మెదక్ చేరుకున్న సీఎం రేవంత్.. అక్కడ ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మెదక్ చర్చికి చేరుకున్నారు. అక్కడ చర్చి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆపై అక్కడ నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.కాగా సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే మెదక్‌కు వచ్చే దారులన్నీ పోలీసులు మూసివేసి అత్యుత్సాహం ప్రదర్శించారు. దీంతో 40 నిమిషాల పాటు ప్రయాణికులు, వాహనదారులు నరకయాతన అనుభవించారు. ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోవడంతో పోలీసుల తీరుపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాఫిక్‌ను ఎందుకు ఆపారంటూ కొందరు ప్రయాణికులు, వాహనదారులు పోలీసులను ప్రశ్నించగా.. ముఖ్యమంత్రి వచ్చాడు.. మాకు పై నుండి ఆదేశాలు ఉన్నాయి. మీ వాహనాలకు అనుమతి లేదంటూ పోలీసులు నిలిపివేశారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ పోయే వరకు మేము వాహనాలను, నార్మల్ ప్రజలను అనుమతి ఇవ్వం అంటూ పోలీసులు తేల్చిచెప్పారు. పోలీసుల చర్యలతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇదీ కాంగ్రెస్ పాలన అంటూ పెదవి విరిచారు. ఇక మెదక్ చర్చి వద్ద కూడా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి వచ్చాడని చర్చి గేట్లు మూసివేశారు. దీంతో గేట్ల బయట వేలాది మంది క్రిస్టియన్లు గంటల తరబడి నిలబడిపోయారు. ఓ మహిళ పోలీసులపై తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చింది. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదని, సీఎం రేవంత్ రెడ్డి వల్ల సాధారణ ప్రజలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని ఆమె మండిపడ్డారు.

## అడుగుపడింది

భారాస హయాంలో పురపాలకశాఖ మంత్రిగా వ్యవహరించిన కేటీఆర్‌ను ప్రధాన నిందితుడి (ఏ1)గా పేర్కొంటూ తెలంగాణ ఏసీబీ ఇటీవల కేసు నమోదు చేసింది. పురపాలకశాఖ అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ (ఏ2), హెచ్‌ఎండీఏ అప్పటి చీఫ్ ఇంజినీర్ బీఎల్‌ఎన్‌రెడ్డి(ఏ3)లనూ ఎఫ్‌ఐఆర్‌లో చేర్చింది.

## హనియాను చంపిన ఇజ్రాయెల్ తగిన మూల్యం చెల్లించుకుంటుంది

అంబాసిడర్ అమిర్ సయీద్ ఇరవాని వ్యాఖ్యానించారు. ఈ క్రూరమైన నేరాన్ని ఇజ్రాయెల్ ప్రభుత్వం బహిరంగంగా అంగీకరించింది. హనియాను చంపి ఇజ్రాయెల్ ఘోరమైన నేరానికి పాల్పడినందున దానికి ప్రతిగా తాము క్షిపణి దాడులు చేశాము. ఇది హేయమైన ఉగ్రవాద చర్య కిందికి వస్తుందన్నారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ఆ దేశ నూతన అధ్యక్షుడి ప్రమాణస్వీకారంలో పాల్గొన్న హనియా.. అదే నగరంలో హత్యకు గురైన విషయం తెలిసిందే. హనియాను తామే అంతమొందించామని తాజాగా ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ ధ్రువీకరించారు. టెల్‌అవీవ్‌పై దాడులు చేస్తున్న హూతీలకు హెచ్చరికలు జారీ చేసేటప్పుడు ఈ విషయాన్ని ఆయన బయటపెట్టారు. సిరియాను తిరుగుబాటుదారులు ఆక్రమించడంతో అధ్యక్షుడు బషర్-అల్-అసద్ దేశాన్ని వీడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం దేశంలో రాజకీయ సంక్షోభం నెలకొంది. ఈక్రమంలో సిరియా నూతన విదేశాంగ శాఖ మంత్రి అసద్ హసన్ అల్ షిబాని ఇరాన్ (ఎతీజీని)కు హెచ్చరికలు జారీ చేశారు. సిరియా ప్రజల ఇష్టాన్ని, దేశ సార్వభౌమాధికారాన్ని, భద్రతను టెహ్రాన్ గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా తమ దేశంలో ఎలాంటి గందరగోళం సృష్టించవద్దంటూ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.ఇటీవల సిరియాలో నెలకొన్న పరిస్థితులపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్పందిస్తూ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. అసద్ ప్రభుత్వాన్ని కూల్చేసి.. భవిష్యత్తులో ఏర్పడే కొత్త పాలనను అక్కడి యువత కచ్చితంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలోనే సిరియా కొత్త ప్రభుత్వం హెచ్చరికలు చేసింది.

## త్వరలో అతిషిని కూడా అరెస్టు చేసే అవకాశం

అన్ని ప్రధాన పత్రికల్లో అచ్చయ్యింది. దాంతో ఎన్నికల్లో ఓట్ల కోసం హామీలు ఇచ్చిన కేజ్రీవాల్.. ఇప్పుడు వాటిని తుంగలో తొక్కుతున్నారని, మహిళా సమ్మాన్ యోజన పథకాన్ని నోటిపై చేయలేదని ఆప్ సర్కారు పబ్లిక్ నోటీస్ ఇవ్వడం ద్వారా ప్రజలకు ఇచ్చిన మాట తప్పిందని బీజేపీ నేతలు విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై ఢిల్లీ సీఎం అతిషి స్పందించారు. బుధవారం వార్తా పత్రికల్లో అచ్చయిన పబ్లిక్ నోటీస్‌లు తప్పుడువి. బీజేపీ నేతల ఒత్తిడి మేరకు ప్రభుత్వంలోని కొందరు అధికారులు ఆ నోటీస్‌లు ఇచ్చారు. ఇదంతా బీజేపీ కుట్ర. ఈ తప్పుడు నోటీస్ ఇచ్చిన అధికారులపై పాలనా యంత్రాంగం, పోలీసులు తగిన చర్యలు తీసుకుంటారు. మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన పథకాలు ఇప్పటికే ప్రజా బాహుళ్యంలోకి వెళ్లాయి. వాటిని కచ్చితంగా అమల్లోకి తీసుకొస్తాం' అని సీఎం అతిషి హామీ ఇచ్చారు.

## భాజపా నేతలు డబ్బు సంపాదించడంలో బిజీ అయ్యారు

జరుగుతున్న ఏర్పాట్లలో పాల్గొనలేకపోతున్నారని అఖిలేష్ విమర్శించారు. కుంభమేళాకు సమయం సమీపిస్తున్నా భక్తుల భద్రతకు సరైన సౌకర్యాలు కల్పించడంలో అలసత్వం వహిస్తున్నారని పేర్కొన్నారు. వారికి కుంభమేళాను నిర్వహించడం రాకపోతే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సహాయం చేయడానికి తమ పార్టీ సిద్ధంగా ఉందని అన్నారు. మహా కుంభమేళాకు చేయాల్సిన ఏర్పాట్లలో అధికారుల సమన్వయలోపం వల్ల భద్రతాపరమైన ఏర్పాట్లు ఆలస్యమవుతున్నాయని ఆయన ఆరోపించారు. స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యాలు, ఇతర అవసరాల కల్పనను యోగి ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదన్నారు. అధికారులు వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కోరారు. ఏర్పాట్లలో ఆలస్యం జరగకుండా ఉండేందుకు తమ నేతలు ప్రభుత్వానికి సహకరిస్తారన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని తాము కోరుకుంటున్నామన్నారు.

## అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారు

పంపించారని మండిపడ్డారు. 37 రోజులు జైల్లో పెట్టి రేవంత్ రెడ్డి పైశాచిక ఆనందం పొందారని అన్నారు. లగచర్ల ఘటనలో కేటీఆర్‌ను కూడా ఇరికించే ప్రయత్నం చేశారని పట్నం నరేందర్ రెడ్డి మండిపడ్డారు. ఓట్లు వేసి గెలిపించిన రైతులకు బేడీలు వేసిన ఘనత రేవంత్ రెడ్డిదే అని ధ్వజమెత్తారు. ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టిపెట్టాలని రేవంత్ రెడ్డికి సూచించారు. రైతుబంధుపై పెద్ద పెద్ద మాటలు చెప్పి మాట తప్పారని రేవంత్ రెడ్డిని పట్నం నరేందర్ రెడ్డి విమర్శించారు. అల్లు అర్జున్ అంశంపై గంటసేపు అసెంబ్లీలో రేవంత్ రెడ్డి మాట్లాడారని పేర్కొన్నారు.


# ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి నోటీసులు

**హైదరాబాద్(జనంసాక్షి):**హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి బంజారాహిల్స్ పోలీసులు నోటిసులు ఇచ్చారు. గురువారం ఉదయం 10 గంటలకు విచారణకు రావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. బంజారాహిల్స్ సీఐ విధులకు ఆటంకం కలిగించారనే కేసులో విచారణకు హాజరుకావాలని ఈ నోటీసులిచ్చారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై ఈ నెల 4వ తేదీన బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు 20మంది



అనుచరులపై సైతం కేసు నమోదైంది. విధులను అడ్డగించడంతో పాటు బెదిరింపులకు దిగారని ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే, సీఎం రేవంత్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ శివధర్‌రెడ్డి కలిసి తన ఫోన్‌ని ట్యాప్ చేస్తున్నారని.. వీరిద్దరిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదు చేసేందుకు ఈ నెల 4వ తేదీన పాడి కౌశిక్ రెడ్డి పీఎస్‌కి వెళ్లారు. బంజారాహిల్స్ ఏసీపీకి ఉదయం ఫోన్ చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు రమ్మన్నారని.. తాను స్టేషన్‌కు వెళ్లేకన్నా ముందే ఏసీపీ వెళ్లిపోయారని.. సీఐ సైతం వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తే తనతో పార్టీ కార్యకర్తలు ప్రశ్నించానని పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. తాను ఎమ్మెల్యే అనే గౌరవం లేకుండా సీఐ ప్రవర్తించారని.. డీజీపీ కన్నా ఎక్కువ ప్రోటోకాల్ ఎమ్మెల్యేకు ఉంటుందని .. పదవులు లేని సీఎం సోదరులకు పోలీసులు వంగి వంగి దండాలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.





# భాజపా పాలనలో మధ్యప్రదేశ్‌కు కొత్తదిశ

లెఫ్ట్, కుటుంబ, సంకీర్ణ పార్టీల పాలనలో ఏం పనులు జరిగాయి..? భాజపా ఉన్న చోట్ల అభివృద్ధి ఎలా జరిగిందో విశ్లేషించాలి. మా పార్టీ ప్రజల కోసం కట్టుబడి ఉంది. ప్రభుత్వ ఫలాలు ప్రజలకు ఎంత వరకు చేరాయి అన్నదే ప్రామాణికం. కాంగ్రెస్ సర్కారు కేవలం అభివృద్ధి ప్రకటనల హడావుడికే పరిమితమయ్యేది. ఆ పథకాల ఫలాలు ప్రజలకు చేరేవి కావు. ఏళ్ల క్రితం శంకుస్థాపనలు అయిన వాటి పని కూడా ఒక్క అంగుళం ముందుకు జరగకపోవడాన్ని మేము గమనించాము. మా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని తప్పించాము.దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జల్‌శక్తిపై ఎవరు పనిచేశారో తెలుసా.. వాస్తవాలను ఇన్నాళ్లూ దాచిపెట్టారు. భారత జల్‌శక్తి, డ్యామ్‌ల వెనుక ఘనత బాబా సాహెబ్ అంబేడ్కర్‌కు చెందుతుంది" అని అన్నారు. అంతకు ముందు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ పేరిట తపాల బిళ్ల, రూ.100 నాణెంను ప్రధాని మోదీ విడుదల చేశారు. నదుల అనుసంధానంలో మొదటిదైన కెన్-బెత్వా పథకం వల్ల ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు, ప్రత్యేకించి వెనకబడిన బుందేల్‌ఖండ్ ప్రాంతానికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. 2009లోనే అప్పటి కేంద్రప్రభుత్వం దీన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. మొత్తం ఒకేసారి కాకుండా దశలుగా విభజించి పనులు చేపట్టాలని నిర్ణయించింది. మొదటి దశకు 2017 జూన్‌లో పెట్టుబడి అనుమతి లభించింది.

## వాజ్‌పేయి నాణెంను విడుదల చేసిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దివంగత ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయీ 100వ జయంతి ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక నాణేన్ని విడుదల చేశారు. వాజ్‌పేయీ వందవ జయంతి సందర్భంగా రూ.100 స్మారక నాణేన్ని రిలీజ్ చేశారు. అంతేకాకుండా స్టాంప్‌ను కూడా మోదీ విడుదల చేశారు. మరోవైపు వాజ్‌పేయి 100వ జయంతి సందర్భంగా ఇవాళ ఢిల్లీలోని సదైవ్ అటల్ స్మారకం వద్ద నేతలు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌కడ్, స్పీకర్ ఓం బిర్లా , ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా, హెచ్‌డీ కుమార స్వామి ఇతర కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఏపీ సీఎం చంద్రబాబు సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, బీజేపీ నేతలు వాజ్‌పేయికి నివాళి అర్పించారు.

# బీజేపీకి పిచ్చిపట్టింది

**- ఆపార్టీ నేతల బుర్రలు పనిచేయడం లేదు**

**- రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ తీవ్ర విమర్శలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీపై ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీకి పిచ్చిపట్టిందని, ఆ పార్టీ నేతల బుర్రలు పనిచేయడం లేదని ఫైరయ్యారు. 'మహిళా సమ్మాన్ యోజన ' పథకం అమలులో లేదని, ఇకముందు కూడా అమలు చేయబోవడం లేదని ఢిల్లీకి చెందిన మహిళాశిశు సంక్షేమ శాఖ మంగళవారం ఒక పబ్లిక్ నోటీస్‌ను విడుదల చేసింది. దీనిపై బీజేపీ విమర్శలు గుప్పిస్తుండటంతో సంజయ్ సింగ్ స్పందించారు. బీజేపీ ఒక అబద్ధాలకోరు పార్టీ అని, ఆ పార్టీ పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఆప్ నేత మండిపడ్డారు. బీజేపీ నేతల ఒత్తిడికి తలొగ్గి, ప్రభుత్వాన్ని బదనాం చేసేలా పబ్లిక్ నోటీస్ విడుదల చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఢిల్లీ ప్రజలు బీజేపీ నేతల తప్పుడు ప్రచారాలను నమ్మబోరని చెప్పారు. కేజ్రీవాల్ సీఎంగా ఉన్నప్పుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని, బీజేపీ మాత్రం కేంద్రంలో ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని విమర్శించారు. 'బీజేపీకి పిచ్చిపట్టింది. బీజేపీ నేతల మెదళ్లు పనిచేయడంలేదు. బీజేపీ నేతల ఒత్తడికి తలొగ్గి తప్పుడు పబ్లిక్ నోటీస్ రిలీజ్ చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటాం. కేజ్రీవాల్ ఢిల్లీ సీఎంగా.. ఉచిత విద్యుత్, ఉచిత తాగునీరు, ఉచిత విద్య, ఉచిత వైద్యం అందుబాటులోకి తెచ్చారు. కేజ్రీవాల్ ఇచ్చిన హామీ మేరకు మహిళా సమ్మాన్ యోజన పథకం కూడా అమల్లోకి వస్తుంది. ఈ పథకం కేవలం హామీ కాదు. ఒక గ్యారంటీ' అని చెప్పారు. 'భారతీయ ఝూటా పార్టీ (బీజేపీని ఉద్దేశించి) ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చింది. విదేశీ బ్యాంకుల్లో ఉన్న బ్లాక్ మనీని బయటికి తీసుకొస్తామని చెప్పింది. రెండు కోట్ల ఉద్యోగ నియామకాలు చేపడుతామని ప్రచారం చేసింది. ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమచేస్తామని తెలిపింది. కానీ వాటిలో ఏ ఒక్క హామీని కూడా బీజేపీ నెరవేర్చలేదు. దేశాన్ని నాశనం చేశారు. పైగా వాళ్లు అబద్ధాలు ప్రచారం చేస్తారు. వాళ్ల అబద్ధాలను జనం నమ్మే పరిస్థితిలో లేరు' అని సంజయ్ సింగ్ అన్నారు.

## అల్లు అర్జున్‌పై కేసుపై చాలా అనుమానాలు

ఒత్తిడి మేరకు గత భారాస ప్రభుత్వం ఆ విగ్రహ నిర్మాణం పూర్తి చేసింది. అంబేడ్కర్‌కు సంబంధించిన పంచ తీర్థాలను రాహుల్ గాంధీ దర్శనం చేస్కోవాలి. అల్లు అర్జున్ ఎపిసోడ్ వెనక చాలా అనుమానాలు వస్తున్నాయి. సినీ పరిశ్రమ ఆంధ్రాకు పోవాలని కాంగ్రెస్ నాయకులు కోరుకుంటున్నారు. ఇండస్ట్రీ ఆంధ్రాకు తరలివెళ్తే తెలంగాణకే నష్టం. మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుకుండా వారి అధిష్ఠానం అదుపులో పెట్టాలి" అని బండి సంజయ్ అన్నారు.

## పండుగవేళా ఆగనిదాడులు

సేనల దూకుడు తగ్గింది. ఇదిలాఉంటే.. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించేందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఇందుకోసం ఎవరితోనైనా చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని.. ఎలాంటి ముందస్తు షరతులు పెట్టబోమని చెప్పారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మాత్రం మాట్లాడే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. దాదాపు మూడేళ్లుగా జరుగుతోన్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తాను ముగింపు పలుకుతానని అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్ పలుమార్లు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆయన అధికారాన్ని చేపట్టిన తర్వాత యుద్ధం ఆగుతుందా, శాంతి ప్రక్రియకు ఎలాంటి ప్లాన్ అమలుచేయనున్నారో తెలియాల్సి ఉంది.

## అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడులు..

ఆరుగురు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉందని తాలిబన్ అధికార ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ పేర్కొన్నారు. ఈ దాడులను అనాగరిక చర్యగా తాలిబన్ రక్షణశాఖ పేర్కొంది. వీటికి పాల్పడిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించింది. ఈ దాడుల్లో వజీరిస్థానీ శరణార్థులే ఎక్కువగా మరణించినట్లు సమాచారం. అఫ్గాన్‌ను తాలిబన్‌లు ఆక్రమించుకున్న తర్వాత సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల తమ దేశంలో జరిగిన పలు ఉగ్రదాడులకు తాలిబన్లే కారణమని పాకిస్థాన్ ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలను తాలిబన్ వర్గాలు ఖండిస్తున్నాయి. మార్చి నెలలోనూ అఫ్గాన్‌పై వైమానిక దాడులు చేసిన పాక్.. తాజాగా మరోసారి ఈ దాడులకు పాల్పడింది. అయితే, వీటిపై పాక్ నుంచి మాత్రం ఎటువంటి ప్రకటన రాలేదు.

## ఆప్‌తో పొత్తు మేం చేసిన తప్పు

అరవింద్ కేజ్రీవాల్ జన్‌లోక్‌పాల్ అనే ఏ నినాదంతో ఎన్నికల్లో గెలిచి, అధికారంలోకి వచ్చారో ఆ అవినీతి నిరోధక అంబుడ్స్‌మన్‌ను అమలు చేయలేకపోయారని మండిపడ్డారు.ఢిల్లీని లండన్‌లా అభివృద్ధి చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసి.. దేశ రాజధానిని కాలుష్యంలో నెంబర్ వన్ చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఢిల్లీ ప్రజలను ఆయన మోసం చేస్తూనే ఉన్నారని అన్నారు. ఢిల్లీలో జన్ లోక్‌పాల్‌ను ఏర్పాటు చేయడానికి లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి ఇవ్వట్లేదని తప్పించుకుంటున్న ఆప్ తాను అధికారంలో ఉన్న పంజాబ్‌లో జన్‌లోక్‌పాల్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. అక్కడ పూర్తి స్థాయి ప్రభుత్వం ఉన్నప్పుడు అమలు చేయడానికి ఏమి సమస్య అని దుయ్యబట్టారు.

## నువ్వు వదిలినా.. నేను వదలను

శాంతిభద్రతలు పునరుద్ధరిస్తా ' అని పేర్కొన్నారు.మరణశిక్షలకు సంబంధించి అమెరికాలో ఆయా రాష్ట్రాల్లో వేర్వేరు నిబంధనలు ఉన్నాయి. కొన్ని రాష్ట్రాలు మాత్రమే వీటిని అమలుచేస్తున్నాయి. తోటి ఖైదీలను హతమార్చిన వారు, బ్యాంకు దోపిడీల సమయంలో హత్యలకు పాల్పడిన వారికి వీటిని అమలుచేస్తోంది. ఇలా 1988 నుంచి 2021 వరకు మొత్తంగా 79 మందికి ఈ శిక్ష పడినప్పటికీ.. అత్యంత అరుదుగా వీటి అమలు కొనసాగుతోంది. మొత్తంగా ఇప్పటివరకు 16 మందికి మాత్రమే శిక్ష అమలుచేశారు.2003 నుంచి ట్రంప్ మొదటిసారి అధికారంలోకి వచ్చేవరకు ఫెడరల్ ఖైదీలకు మరణశిక్ష అమలుచేయలేదు. కానీ, ఆయన అధికారం చేపట్టిన తొలి ఆరు నెలల్లోనే 13 మందికి శిక్ష అమలుచేయడం గమనార్హం. చివరిగా జనవరి 16, 2021న శిక్ష అమలయ్యింది. ప్రస్తుతం 40 మంది ఈ జాబితాలో కొనసాగుతుండగా.. వీరిలో 37 మందికి తాజాగా జోబైడెన్ క్షమాభిక్ష కల్పించారు. బోస్టన్ మారథాన్ బాంబుదాడి కేసులో ఉన్న దోషితో సహా ముగ్గురికి ఉపశమనం లభించలేదు.ఇదిలాఉంటే, అమెరికాలోని 50 రాష్ట్రాల్లో 23 రాష్ట్రాలు మరణశిక్షను పూర్తిగా రద్దు చేయగా.. ఆరు రాష్ట్రాలు వీటిని తాత్కాలికంగా నిలిపివేశాయి. మొత్తంగా 2024లోనే దేశవ్యాప్తంగా 25 మరణశిక్షలు అమలుచేసినట్లు నివేదికలు చెబుతున్నాయి.


## నిత్య పెళ్లి కూతురు అరెస్టు చేసిన పోలీసులు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** ఒంటరి పురుషులను ఆకర్షించి పెళ్లి చేసుకున్న తరువాత వారిని దోచుకొని పరారవుతున్న ఓ యువతిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పూనమ్, సంజనా గుప్తా, విమలేశ్ వర్మ, ధర్మేంద్ర ప్రజాపతి నలుగురూ ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరిలో పూనమ్ పెళ్లి కూతరులా, సంజనా ఆమెకు తల్లిలా వ్యవహరిస్తుంది. విమలేశ్, ధర్మేంద్ర ఒంటరి పురుషులు ఎక్కడ ఉన్నారా.. అని టార్గెట్స్ కోసం వెతుకుతారు. టార్గెట్ దొరకగానే అమ్మాయిని చూపిస్తామని, అందుకు రూ. 1.5 లక్షలు ఫీజుగా చెల్లించాలని అంటారు. అవతలి పార్టీ అందుకు ఒప్పుకోగానే పూనమ్, సంజనాల దగ్గరికి తీసుకెళ్తారు. వారు మాట్లాడుకున్న తర్వాత ఇద్దరికి పెళ్లి జరిపిస్తారు. అనంతరం పూనమ్ పెళ్లి కొడుకుతో అతని ఇంటికి వెళ్తుంది. అక్కడ అవకాశం చిక్కేదాక అతనితో కాపురం చేస్తుంది. అవకాశం చిక్కగానే ఆ ఇంట్లోని నగదు, నగలు తీసుకుని పరారవుతుంది. ఇదే క్రమంలో తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని బాందా జిల్లాకు చెందిన శంకర్ ఉపధ్యాయ్ అనే వ్యక్తిని ఈ ముఠా టార్గెట్ చేసింది. విమలేష్, ధర్మేంద్ర అతనితో మాట్లాడి పూనమ్, సంజనాలతో మాట్లాడించారు. అయితే శంకర్ ఉపాధ్యాయ్‌కి వారు తీరుపై అనుమానం కలిగింది. దాంతో రూ. 1.5 లక్షలకు ముట్టజెప్పేందుకు నిరాకరించాడు. దాంతో పూనమ్ ముఠా అతడిని బెదిరించింది. తప్పుడు కేసు పెట్టి జైల్లో వేయిస్తామని హెచ్చరించింది. దాంతో తనకు ఆలోచించుకోవడానికి సమయం కావాలని చెప్పి అతడు అక్కడి నుంచి బయటపడ్డాడు. తర్వాత పోలీసులను ఆశ్రయించాడు. బాందా పోలీసులు ఆ ముఠాను అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి నెట్టారు.

## ఐఫోన్ 15.. రూ.26999కే.. ఫ్లిప్‌కార్డు బంపర్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** ఐఫోన్.. ఈ పేరు గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. గ్లోబల్ టెక్ దిగ్గజం ఆపిల్ సంస్థకు చెందిన ఐఫోన్లను కొనుగోలు చేయాలని ప్రతి ఒక్కరూ కలలు కంటుంటారు. అయితే, ఆ కలలు అందరికీ నెరవేరవు. అందుకు కారణం సాధారణ ఫోన్లతో పోలిస్తే ఐఫోన్ ధరలు చాలా ఎక్కువగా ఉండడమే. దీంతో కొందరు బెస్ట్ డిస్కొంట్స్ కోసం ఎదురుచూసి వాటిని సొంతం చేసుకుంటుంటారు. అలాంటి వారికి ఓ గుడ్ న్యూస్. గతేడాది మార్కెట్‌లోకి వచ్చిన ఐఫోన్ 15 (128)పై ప్రముఖ ఈ కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ ఊహించని డీల్‌ను ప్రకటించింది. రూ.69,990 విలువైన ఈ ఫోన్‌ను రూ.27వేలకే అందిస్తోంది. సాధారణంగా 15 128 ధర రూ.69,990. ఈ ప్రీమియం డివైజ్ ఇప్పుడు పలు డిస్కొంట్లు, ఎక్స్ఛేంజ్ ఆఫర్‌లను కలుపుకుని కేవలం రూ. 26,999కే ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉంది. ఎక్స్ఛేంజ్‌లో గరిష్ఠంగా రూ.31,500 వరకు ఆదా చేసుకునే అవకాశాన్ని ఫ్లిప్‌కార్ట్ కల్పించింది. అందుకోసం మనం ఐఫోన్ 14ను ఎక్స్ఛేంజ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా చేస్తే ఈ స్మార్ట్‌ఫోన్‌ను రూ. 26,999కే మీ సొంతం చేసుకోవచ్చు. ఎక్స్ఛేంజ్ ఆఫర్ మినహాయింపుతో అయితే గరిష్ఠంగా 16 శాతం తగ్గింపుతో రూ.58,499కు ఫోన్ లభిస్తోంది. అంతేకాదండోయ్.. దీనిపై ఫ్లిప్‌కార్ట్ 'మినిట్స్' డెలివరీ సేవను కూడా అందిస్తోంది. ఎంపిక చేసిన ప్రదేశాల్లో కేవలం 14 నిమిషాల్లోనే ఈ ఫోన్‌ను డెలివరీ చేయనున్నట్లు వెల్లడించింది. అయితే ఇందుకోసం అదనపు ఛార్జీలు వర్తిస్తాయి. ఈ ఆఫర్ డిసెంబర్ 20 నుంచి 25 వరకు మాత్రమే అందుబాటులో ఉంది. నేటితో ఈ ఆఫర్ ముగియనుంది. ఐఫోన్ 15 గతేడాది (2023) సెప్టెంబర్‌లో విడుదలైన విషయం తెలిసిందే. బ్లాక్, బ్లూ, గ్రీన్, పింక్, ఎల్లో రంగుల్లో లభిస్తుంది ఫోన్. ఐఓఎస్ 17 వర్షన్‌పై పని చేస్తున్న ఐ-ఫోన్ 15 ఫోన్.. ఆపిల్ ఏ16 బయోనిక్ చిప్ కలిగి ఉంటుంది. 6.1 అంగుళాల సూపర్ రెటీనా ఎక్స్‌డీఆర్ ఓలెడ్ స్క్రీన్, డైనమిక్ ఐలాండ్ వంటి ఫీచర్లు ఉంటాయి.



## సింగరేణి ఓసి -3లో విద్యుత్ వైరు చోరీ



**భూపాలపల్లి, డిసెంబర్ 25 (జనం సాక్షి) :** కేటికె ఓసి -3లో మంగళవారం రాత్రి విద్యుత్ వైరు చోరీకి గురైంది. సుమారు 100 మీటర్ల విద్యుత్ తీగ దొంగిలించినట్లు తెలుస్తోంది. భూపాలపల్లి సింగరేణి ఏరియాలోని ఓసి -3 నందు గల విద్యుత్ వైరు దొంగిలించారని, కొంతవైరు దగ్గరలో గల వ్యవసాయ భూమి లో పడవేసి పారిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. చోరికి గల కారణాలను గుర్తించే పనిలో సింగరేణి యాజమాన్యం ఉంది. సింగరేణిలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయని, ఇది భద్రతా లోపమా, లేక ఇంటి దొంగల పనా అనే కోణంలో అంతర్గతంగా విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ విషయమై గని మేనేజర్ భిక్షమయ్యను వివరణ కోరగా ఓసి 3 లో విద్యుత్ వైరు చోరీకి గురైన విషయం నిజమేనని, చోరి జరుగుతున్న విషయాన్ని గమనించి ఎస్ ఎం పి సి వారు పట్టుకోవడానికి ప్రయత్నించగా దగ్గరలో ఉన్న వ్యవసాయ భూమి లో వదిలేసి పారిపోయారని, విద్యుత్ వైరు కేవలం 20మీటర్ల వరకు మాత్రమే అపహరణకు గురైందని, ఈ విషయంపై ఎవరికి ఎలాంటి ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

## కజకిస్థాన్‌లో కుప్పకూలిన ప్రయాణికుల విమానం

- ఘోర ప్రమాదంలో 30 మందికిపైగా మృతి..
- పలువురికి గాయాలు.. పక్షిఢీకొనడం వల్లే ఘటన!

వెలుగులోకి వచ్చాయి.జర్ బ్కైజన్ ఎయిర్‌లైన్స్ కు చెందిన ఫ్లైట్ ఏ2%-%8243లో కీలకమైన వ్యవస్థలు విఫలం కావడంతోనే ప్రమాదం జరిగిందని నిపుణులు అనుమానిస్తున్నారు. ఈ విమానం బాకు నుంచి రష్యాలోని చెచెన్ ప్రాంతానికి చెందిన గ్రోజ్నికి ప్రయాణిస్తుండగా కజకిస్థాన్‌లోని అక్టౌలో కూలిపోయిన విషయం తెలిసిందే. ఇది వేగంగా కిందికి దూసుకొచ్చి నేలను ఢీకొని ముక్కలుగా విరిగిపోయింది. కొన్ని భాగాలు పూర్తిగా దగ్ధమైనట్లు ప్రమాదానికి సంబంధించిన వీడియోల్లో స్పష్టంగా ఉంది. విమానంలోని కీలకమైన కంట్రోల్స్, బ్యాకప్ సిస్టమ్స్ విఫలమైనట్లు గుర్తించి ల్యాండిరగ్‌కు ప్రయత్నిస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు ఇంటర్‌ఫాక్స్ న్యూస్ ఏజెన్సీ వెల్లడిరచింది. తొలుత ఈ విమానం ఓ పక్షిని ఢీకొనడంతో పైలట్లు అత్యవసరంగా ల్యాండిరగ్‌కు ప్రయత్నించినట్లు రష్యా ఏవియేషన్ వాచ్‌డాగ్‌ను ఉటంకిస్తూ రాయిటార్స్ పేర్కొంది. మరోవైపు అజర్‌బైజన్ ఎయిర్‌లైన్స్ ఈ ఘటనపై స్పందిస్తూ.. అక్టౌకు మూడు కిలోవిరీటర్ల దూరంలో ఎమర్జెన్సీ ల్యాండిరగ్ చేసిందని పేర్కొంది. అదనపు వివరాలు అందగానే అందిస్తామని పేర్కొంది. వాస్తవానికి గ్రోజ్నికి వెళ్లే మార్గంలో దట్టమైన పొగమంచు కమ్ముకొని ఉండటంతో దీనిని అక్టౌకు మళ్లించినట్లు వార్తలొచ్చాయి. ఈ విమానం నుంచి తమకు అత్యవసర ల్యాండిరగ్ కోసం అభ్యర్థన వచ్చిందని అధికార వర్గాలు చెబుతున్నాయి.



## నిధులు మంజూరు చేయాలంటూ సీఎంకు ఎంపీ మెమోరాండం

**మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 25 (జనంసాక్షి):** మెదక్ పార్లమెంటు పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలంటూ మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు సీఎం రేవంత్ రెడ్డికి బుధవారం మెమోరాండం అందజేశారు. మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం పాపన్నపేట మండలంలోని ఏడుపాయల దుర్గా భవాని అమ్మవారి ఆలయానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈ కింది పనులకు నిధుల గురించి మెమోరాండం అందజేశారు. మెదక్ పట్టణంలో మంజూరైన మెడికల్ కాలేజీ నిర్మాణానికి 20 ఎకరాల భూమి, రూ. 250 కోట్ల నిధుల మంజూరు చేయాలని కోరారు. దుబ్బాక నియోజకవర్గంలోని హబ్సిపూర్ చౌరస్తా నుండి దుబ్బాక అంబేద్కర్ చౌరస్తా వరకు 4వేలైన్ రోడ్ నిర్మాణానికి రూ. 20 కోట్ల నిధుల మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే శిలాజినగర్ నుండి ఏనుగుర్తి వరకు బొప్పాపూర్ మీదుగా వెళ్ళే రహదారి నిర్మాణానికి రూ. 40 కోట్ల నిధుల మంజూరు చేయాలని కోరారు.

## ఏసుక్రీస్తు మార్గంలో పయనించాలి

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



**సూర్యాపేట, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** ఏసుక్రీస్తు చూపిన మార్గంలో అందరూ పయనించి ప్రేమ, కరుణ ఇతరుల పట్ల చూపించాలని, అందరి ప్రార్థనలు ఫలించి ప్రశాంతంగా జీవించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నిర్మల మాతా చర్చ్, సిల్వి సిలోయం చర్చ్, గ్రేస్ చర్చ్, మన్నా చర్చ్, సెయింట్ బాప్టిస్ట్ చర్చిలలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని మతాల ప్రధాన పండగలను అధికారికంగా నిర్వహిస్తూ వాటి ప్రాధాన్యత పెంచిన ఘనత కేసీఆర్‌దే అని స్పష్టం చేశారు. గత పదేండ్లుగా ఆయా మతాల ప్రధాన పండుగలను అధికారికంగా నిర్వహించుకుంటూ మరింత ఐక్యతను పెంచుకున్నామన్నారు. క్రిస్మస్, రంజాన్, దసరా పండుగలకు ప్రత్యేక విందులు, దుస్తులు, సామాగ్రిని పంచుతూ గంగా, జమున, తహజీబ్‌లకు నిలయంగా తెలంగాణ సమాజాన్ని తయారు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అన్ని మతాల ఆశీర్వాదాలు ప్రజలందరిపై ఉండి తెలంగాణ సమాజం మరింత అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమల్ల అన్నపూర్ణ, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట్ నారాయణ గౌడ్, నాయకులు నంద్యాల దయాకర్ రెడ్డి, ఉప్పల ఆనంద్, మారుపెద్ది శ్రీనివాస్ గౌడ్, నెమ్మది బిక్షం, జీడీ భిక్షం, తూడి నరసింహారావు, పూర్ణ శశికాంత్, తాహెర్ పాషా, బత్తుల జానీ, గండూరి కృపాకర్‌లతో పాటు ఆయా చర్చిల పాస్టర్లు, ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## భారతీయ సాంస్కృతిక రుక్మిణీ రామాయణంలో అమెరికా విద్యార్థులు


**ఖానాపూర్ రూరల్, డిసెంబర్ 25 (జనం సాక్షి) :** భారతీయ సంస్కృతిక నృత్యాలు రుక్మిణి రామాయణంలో అమెరికాకు చెందిన ఓక్లా హెూమ రాష్ట్ర విద్యార్థులు ఈ భారతీయ సాంస్కృతిక కార్యక్రమాల్లో బుధవారం పాల్గొన్నారు. ఆదర్శ్ నగర్ లో గల బిర్లా సైన్స్ సెంటర్ ఆడిటోరియంలో నిర్వహించిన సాయి నృత్య డాన్స్ అకాడమీ సారథ్యంలో నిర్వహించిన భారతీయ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఇటు భారతదేశ విద్యార్థులు అమెరికా విద్యార్థులు కలిసి చేపట్టిన ఈ సాంస్కృతిక కార్యక్రమాలు అంబరాన్ని అంటాయి ఈ కార్యక్రమానికి ఆర్గనైజర్ గా ఖానాపూర్ వాసి ప్రముఖ మానసిక వేత్త పన్నెల జనార్ధన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పర్యటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, డాక్టర్ పాడి శర్మ, మధు యాష్కి గౌడ్ పాల్గొన్నారు.

## హాట్ కేకుల్లా శ్రీవారి ఉత్తరద్వార దర్శనం టిక్కెట్లు

- వెంటనే కొనుగోలు చేసిన భక్తులు

**తిరుమల,డిసెంబర్25(జనంసాక్షి) :** శ్రీవారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున తిరుమలకు తరలివస్తు ఉంటారు. శ్రీవారి ఆలయంలో ఏడాదికి పది రోజులపాటు మాత్రమే భక్తులను అనుమతించే వైకుంఠ ద్వార దర్శనం కోసం ప్రతి హిందూ భక్తుడు పరితపిస్తూ ఉంటారు. దీనితో వైకుంఠ ద్వార దర్శనానికి డిమాండ్ ఎప్పటికప్పుడు పెరిగిపోతూ వస్తూ ఉంది. ఈ ఏడాది కూడా టికెట్లు కలిగిన భక్తులను మాత్రమే వైకుంఠ ద్వార దర్శనానికి అనుమతించాలని నిర్ణయించింది టీటీడీ. గత ఏడాది తరహాలోనే వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి టికెట్లను ముందస్తుగానే కేటాయించేలా ఏర్పాటు చేస్తుంది టీటీడీ.. ఆన్‌లైన్ సంబంధించిన టికెట్లను 23 ,24వ తేదీలలో విడుదల చేయగా ఆఫ్‌లైన్‌కు సంబంధించిన టికెట్లను జనవరి ఎనిమిదో తేదీ రాత్రి నుంచి విడుదల చేసేలా ఏర్పాట్లు చేస్తుంది టీటీడీ. 23వ తేదీ ఉదయం 11 గంటలకు శ్రీవాణి దర్శన టికెట్లను రోజుకు 18 వందల చొప్పున 10 రోజులకు సంబంధించి 18 వేల టికెట్లను విడుదల చేయగా.. పదివేల 500 విలువచేసే శ్రీవాణి టికెట్లను భక్తులు గంటన్నర సమయంలోనే కొనుగోలు చేసేశారు. ఇక, 300 రూపాయల ప్రత్యేక ప్రవేశ దర్శనానికి సంబంధించి పది రోజులకు సంబంధించి 1,40,000 టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయగా కేవలం 18 నిమిషాల వ్యవధిలోనే భక్తులు వాటిని కొనుగోలు చేసేశారు. లక్షా 40 వేల టికెట్ల కోసం టీటీడీ వెబ్ సైట్ కి 14 లక్షల హిట్లు వచ్చాయంటేనే అర్థం చేసుకోవచ్చు.. స్వామివారి దర్శన టికెట్లకు ఉన్న డిమాండ్. కోటా ముగిసిన భక్తులు టిక్కెట్లు కోసం ప్రయత్నిస్తూనే వున్నారు. ఇక, సర్వదర్శనం భక్తులకు సంబంధించి ప్రతినిత్యం 40,000 చొప్పున 10 రోజులకు సంబంధించి నాలుగు లక్షల టికెట్లను ఆఫ్ లైన్ విధానంలో జారీ చేసేలా టీటీడీ ఏర్పాటు చేస్తుంది.

## మెదక్ చర్చిలో శతాబ్ది ఉత్సవాలు



**హైదరాబాద్, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** మెదక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు అంగరంగవైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇంచార్జి బిషప్ రైట్ రెవరెండ్ రూబెన్ మార్క్ దైవ వాక్యాన్ని అందించారు. వందేండ్ల మహా దేవాలయంలో ప్రతిష్ట మహెూత్సవం జరుపుకుంటున్నందుకు అందరం ధన్యులమని తెలిపారు. దివ్యమైన ఈ మహా దేవాలయంలో 1924 డిసెంబర్ 25న క్రిస్మస్ వేడుకలు జరిగాయని చెప్పారు. తాజాగా వందేండ్ల వేడుకలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో అందరం భాగస్వామ్యులు అయినందుకు ధన్యులమని అన్నారు. ఆసియా ఖండంలోని అతి పెద్దదైన రెండో చారిత్రాత్మక దేవాలయంలో క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని ఇంచార్జి బిషప్ రైట్ రెవరెండ్ రూబెన్ మార్క్ తెలిపారు. మన జీవితంలో ఇది ఒక ఒక మైలు రాయి అని పేర్కొన్నారు. జ్ఞానులు ఏసుక్రీస్తు అనుసరించిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. లోక రక్షకుడిగా నన్ను రక్షించడానికి ఏసు వచ్చాడు.. సమస్త మానవాళికి ఏసుప్రభువు ఆశీస్సులు ఉండాలని అన్నారు. 'బెత్లెహెంలో దావీదు వంశంలో ఏసు జన్మించాడు. ఏసును కలిగిన బిడ్డలు నిస్వార్థంగా ఆలోచించాలి. స్వార్థ లోకంలో ప్రతిది నాది అనే ఆలోచనతో ఉంటున్నారు. ప్రతి ఒక్కరు స్వార్థమైన ప్రార్థనలు చేయాలి. స్వార్థం మరియమ్మలో లేదు. ప్రతి ఒక్కరూ నిస్వార్థంగా ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరిస్తూ బతకాలి.' అని సూచించారు.

## వ్యూస్ కోసం పిచ్చి పనులు

- విద్యుత్ స్తంభంపై యువతి రీల్స్... నెట్టింట వైరల్



**న్యూఢిల్లీ, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** ప్రస్తుత సోషల్ మీడియా యుగంలో వ్యూస్ కోసం యువతీయువకులు ఎలాంటి సాహసాలు చేయడానికైనా వెనుకాడడం లేదు. కొందరు యువతులైతే.. యువకుతలతో పోటీ పడి మరీ డేంజరస్ స్టంట్స్ చేయడం చూస్తున్నాం. ఇలాంటి షాకింగ్ ఘటనలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో నిత్యం వైరల్ అవుతూనే ఉంటాయి. తాజాగా, ఇలాంటి వీడియో ఒకటి నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఓ యువతి విద్యుత్ స్తంభంపై చేసిన నిర్వాకం చూసి అంతా అవాక్కవుతున్నారు. ఈ వీడియో చూసిన వారంతా.. "వామ్మో.. పిచ్చి పీక్స్‌కు వెళ్లిందే".. అంటూ కామెంట్లు చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఓ వీడియో తెగ వైరల్ అవుతోంది. ఎలాగైనా సోషల్ మీడియాలో ఫేమస్ అవ్వాలనే ఉద్దేశంతో ఓ యువతి చివరకు షాకింగ్ నిర్ణయం తీసుకుంది. విద్యుత్ స్తంభాలను ఎక్కేందుకు సిద్ధమైంది. అనుకున్నదే తడవుగా స్తంభాలను చకచకా ఎక్కేసింది. అంతటితో ఆగకుండా వాటిపై నిలబడి విద్యుత్ వైర్లను పట్టుకుని అటూ, ఇటూ కదులుతూ డాన్స్ కూడా చేసింది. ఇలా చాలా సేపు ఆ యువతి అక్కడే నిలబడి డాన్స్ చేస్తూ కెమెరాకు ఫోజులు ఇచ్చింది. వ్యూస్ కోసం ఈమె చేసిన ప్రమాదకర విన్యాసం చూసి అంతా అవాక్కవుతున్నారు. అయితే ఆ స్తంభానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఎలాంటి ప్రమాదమూ జరగలేదు. కానీ ఇలాంటి వీడియోలు చూసి మిగతా వారు కూడా ఇలా ప్రయత్నిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు వివిధ రకాలుగా స్పందిస్తున్నారు. "పిచ్చి పీక్స్‌కు వెళ్లడమంటే ఇదే".. అంటూ కొందరు, "ఇలాంటి వారికి శిక్షలు వేస్తే.. మరొకరు ఇలాంటి ప్రమాదకర విన్యాసాలు చేయరు".. అంటూ మరికొందరు, వివిధ రకాల ఎమోజీలతో ఇంకొందరు కామెంట్లు చేస్తున్నారు. ఈ వీడియో ప్రస్తుతం 30 వేలకు పైగా లైక్‌లు, 2.8 మిలియన్‌కు పైగా వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

## బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

**అమరావతి, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** పశ్చిమ మధ్య – నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం.. రానున్న 24 గంటల్లో ఇది క్రమంగా బలహీన పడుతోందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీంతో రాగల 24 గంటల్లో ఉత్తర కోస్తాలోని పలు చోట్లు వర్షాలు పడే అవకాశముందని తెలిపింది. అలాగే దక్షిణ కోస్తాలో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. రాగల 24 గంటల్లో ఒకటి రెండు చోట్లు భారీ వర్షాలుకురిస్తాయని తెలిపింది. ఈ సమయంలో సముద్రం తీరం వెంబడి గాలుల తీవ్రత అధికంగా ఉంటుందని సూచించింది. చేపల వేటకు సముద్రంలోకి వెళ్ల వద్దని మత్స్యకారులను ఈ సందర్భంగా వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఇక విశాఖపట్నం, కాకినాడ , నిజాంపట్నం, మచిలీపట్నం పోర్టుల్లో మూడో నెంబరు ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందని స్పష్టం చేసింది. మరోవైపు అల్ప పీడనం కారణంగా.. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వర్షం కురుస్తోంది. అలాగే ఆకాశం మేఘావృతమైంది.

## బౌన్సర్లను పెట్టిందే రేవంత్‌రెడ్డి

**ఎంపీ రఘునందన్‌రావు**

**మెదక్, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** బౌన్సర్ల దుకాణం పెట్టిందే రేవంత్ రెడ్డి అని రఘునందన్ రావు పేర్కొన్నారు. ప్రయివేటు బౌన్సర్లను తీసుకువచ్చి నూకిపిచ్చే సంస్కృతి రాష్ట్రానికి తీసుకొచ్చిందే రేవంత్ రెడ్డి. పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు చుట్టూ బౌన్సర్లని పెట్టుకొని జనాలను పక్కకు నూకే కార్యక్రమం మొదలు పెట్టిందే రేవంత్ రెడ్డి. అల్లు అర్జున్ పంచాయితీలో బౌన్సర్లలను ఎందుకు తీసుకొస్తున్నారు? అని రఘునందన్ రావు ప్రశ్నించారు. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌కు చిత్తశుద్ధి ఉంటే బౌన్సర్ల వ్యవస్థను మొత్తం రద్దు చేయమని చెప్పండి అని ఎంపీ రఘునందన్ రావు సూచించారు.

# చట్టసభల్లో ఏం జరుగుతున్నది..?






*అది పార్లమెంట్ కావచ్చు, రాజ్యసభ కావచ్చు, అసెంబ్లీ కావచ్చు, మనం ఓట్లు వేసి గెలిపించిన ప్రజాప్రతినిధులు ఏం మాట్లాడుతున్నారు. ఎప్పుడైనా మనం గమనించే ప్రయత్నం చేశామా? క్రాస్ చెక్ చేశామా?అధికారం కంటే ముందు, అధికారం తర్వాత వారి ప్రవర్తన, వారు ఇచ్చిన హామీలు, అమలు కు సంబంధించిన విషయాల మీద మాట్లాడుకోవాలి. నిఘా పెట్టాలి. ప్రశ్నించాలి. చట్ట సభల్లో ఏం జరుగుతున్నది? మన ప్రజా ప్రతినిధులు, చట్ట సభల్లో ఏం చేస్తున్నారు.*

### అసలు ప్రజాప్రతినిధులు ఏం చేయాలి

అసలు ఏం చేయాలి?మన ప్రజా ప్రతినిధులు పదే పదే చట్ట సభల్లో నోరు జారుతున్నారు. ప్రజా సమస్యలు చర్చించి, నిర్ణయాలు తీసుకోవాల్సిన చట్ట సభల్లో, నువ్వు దొంగా అంటే, నువ్వు యూస్ లెస్ ఫెలో వి అంటూ, ఒకరి మీద మరొకరు నోరు పారేస్కుంటూ మాట్లాడుతారు. ఫలితంగా ప్రజా సమస్యల పరిష్కారం పై చర్చ తక్కువ, వ్యక్తిగత ఆరోపణల మీద ఎక్కువ చర్చ జరుగుతున్నది. ప్రతీ రోజు ఇటు అసెంబ్లీ చర్చ, అటు పార్లమెంట్ లో చర్చ చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. అసలు అవసరమే లేని పుష్ప – 2 లాంటి స్మగ్లర్ల సినిమా లో నటించి ఒక మహిళ చావుకు కారణం అయిన ఆ సినిమా నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ మీద చర్చ కు సమయం వృధా చేస్తారు. ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం ను, సీఎం రేవంత్ రెడ్డి ని తప్పు పట్టే వాళ్ళు, ఎందుకు?ఇలా దేని కోసం?

### కౌన్ కిస్కా గాండ్ల కోసం ఆరాటం ఎందుకు?

కౌన్ కిస్కా గాండ్ల కోసం మాట్లాడుడే అనవసరం, దేశంలో అసలు నేరం తో సంబంధం లేని, లేదా చిన్న తప్పులకు బెయిల్ ఇచ్చే వారు లేక లక్ష మందికి పైగా నెలలు ఏండ్ల తరబడి జైళ్లలో ఉన్నారు. అలాంటి వారి గురించి మాట్లాడే వారు ఉండరు! సినిమా వాళ్ళ ను వారేదో సమాజ యుద్ధరకుల్లాగ వెనుకేసుకుని రావడం ఎందుకు?అటు పార్లమెంట్ లో అయితే మరీ దారుణంగా ఉంది పరిస్థితి, అదాని లాంటి కార్పొరేట్ ను రక్షించడం కోసం, ఆయన దోపిడీ, కేసులను బయట పెట్టిన వాళ్ళను అధికార పక్షం దేశ ద్రోహులు అంటుంది.

### హోమ్ మంత్రి అనుచిత వ్యాఖ్యలు

దేశానికీ హోమ్ మంత్రిగా ఉన్న వ్యక్తి మన రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ ను పట్టుకుని అనుచిత వ్యాఖ్యలు చేసి, నోరు జారి, కనీసం క్షమాపణ చెప్పడు!మన దేశం ఆత్మ అయిన రాజ్యాంగం పట్ల ఏమాత్రం గౌరవం లేని వారి పరిస్థితి మీద విపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. ఒకవైపు రైతులు ఆందోళన చేస్తుంటే వారి మీద లాటిఛార్జ్ చేస్తారు. పేపర్ లీక్ మీద నిరుద్యోగుల ఆందోళన లు జరుగుతున్నా వాటి మీద చర్చ జరుగదు. మణిపూర్ లో హింసాత్మక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రార్థన మందిరాలను వందలాదిగా దహనం చేసారు. లక్షల మంది శరణార్థులుగా మిగిలారు. ఆ విషయం మీద చర్చ ఉండదు. అక్కడికి మన పీఎం నరేంద్రమోడీ ఒక్కసారి కూడ అక్కడికి వెళ్ళ లేదు. ఒక వైపు మైనారిటీలను ఇష్టం వచ్చినట్లు చొర్రు బాటు దారులు అంటూ వ్యాఖ్యనిస్తూనే, క్రిస్మస్ సందర్భంగా చర్చ్ లకు వెళ్లి బైబిల్ ను కండ్లకు హద్దుకుని శాంతి సందేశం ఇస్తారు. ఒకవైపు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగ్వత్ సర్వ మతస్తులు ఒక్కటే సందేశం ఇస్తూ, మసీదుల కింద మందిర్ లను వెతికే పని వద్దు అంటారు. ఒకవైపు యూపి లాంటి రాష్ట్రం లోని ఒక పాటశాలలో ఏడు ఏండ్ల బాలుడు నాన్ వెజ్ ను తెచ్చి, సహజంగా తోటి విద్యార్థికి షేర్ చేస్తుంటే, అతనిని స్కూలు నుంచి తీసేయడం, ఆ చిన్నారి మీద మత మార్పిడి ఆరోపణ చేయడం ను ఏమనాలి?ఏ ఎండకు, ఆ గొడుగు పట్టే రాజకీయ నాయకులు, పార్టీలు, చట్ట సభల్లో బయట సమాజం లో అసమానతలను, కుల, మతాల విభేదాలకు కారణం అవుతున్నారు. మనుషుల మధ్య విద్వేశాలను సృష్టించడం తప్ప ఏమి చేయడం లేదు. ప్రభుత్వం లో ఉన్న వాళ్ళు, విపక్షాలు చట్ట సభల్లో ముందు రాజ్యాంగం లో ఉన్న ప్రకారం వ్యవహారించాలి. ముందు తమ నోరును కంట్రోల్ చేసుకోవాలి. చీటికి మాటికీ, మా హయాంలో, మీ హయాంలో అనే ముచ్చట్లు వీడి, ప్రజలకు ఉపయోగ పడే విషయాల మీద చర్చకు, నిర్ణయాలకు ప్రాధాన్యతనివ్వాలి. మిమ్మల్ని ఎన్నుకున్న ప్రజల కు, కనీస,వారి మనోభావాలకు విలువ ఇచ్చే విధంగా మాట్లాడుడు నేర్చుకోవాలి. ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం ఇచ్చిన హక్కులను పరిరక్షించడానికి కృషి చేయాలి.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223





# భారత ఆర్థిక వ్యవస్థకు కీలక సవాళ్ళు

భారత బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రస్తుతం ఎదురవుతున్న ప్రధాన సమస్య డిపాజిట్ల సేకరణలో వృద్ధి మందగమనంతో కొనసాగుతుంది. బ్యాంకులు ప్రజల నుండి డిపాజిట్ల రూపంలో నిధులు సేకరించి, ఆ నిధులను రుణాల రూపంలో అవసరం ఉన్నవారికి అందించి లాభాలను ఆర్జిస్తాయి. అయితే, గడిచిన కొన్ని సంవత్సరాలుగా ఈ డిపాజిట్ల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా కనపడు తుంది. ఈ అంశంపై కేంద్ర ఆర్థిక శాఖ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

డిపాజిట్ల పెరుగుదల కంటే రుణాల వృద్ధి వేగంగా ఉండటం గత 20 సంవత్సరాలలో ఇప్పటివరకు ఎన్నడూ లేనివిధంగా తీవ్రంగా ప్రభావం చూపుతోంది. తాజా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది జూలై 12 నాటికి బ్యాంకుల డిపాజిట్ల వృద్ధి 11 శాతంగా ఉండగా, రుణాల వృద్ధి 14 శాతం దాటింది. ఈ పరిస్థితి కొనసాగితే బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు అవసరమైన నిధులను సమీకరించలేకపోవచ్చు. డిపాజిట్ల మందగమనం వెనుక పలు కారణాలు ఉన్నాయి. ప్రథమంగా, బ్యాంకులు డిపాజిట్లపై తక్కువ వడ్డీ రేట్లను అందిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీ మార్కెట్లు వంటి ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాలు ప్రజలను మరింతగా ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా యువత ఈ ప్రత్యామ్నాయాల వైపు మక్కువ చూపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జనధన్ పథకం ద్వారా దేశంలో అనేక మంది బ్యాంకింగ్ వ్యవస్థకు చేరువయ్యారు. అయితే, ఈ ఖాతాల్లో లావాదేవీలు పెద్దగా జరగడం లేదు. అందులో 35 శాతం ఖాతాలు నిష్క్రియంగా ఉండటమే దీనికి నిదర్శనం. ఇలాంటి పరిస్థితుల్లో డిపాజిట్ల సంఖ్య పెరగడం కష్టమవుతోంది. ప్రభుత్వాలు ప్రతీ బడ్జెట్‌లో కూడా డిపాజిట్ దారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమయ్యాయి. బ్యాంకుల్లో డిపాజిట్ల వృద్ధి పెరగాలంటే, వడ్డీ ఆదాయంపై పన్ను మినహాయింపులను అమలు చేయడం అవసరం. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్న ఖాతాదారుల కోసం ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాల్సి ఉంది. ప్రస్తుతానికి వడ్డీరేట్ల విషయంలో బ్యాంకులకు స్వేచ్ఛ కల్పించినప్పటికీ, ఇది ప్రజలను పెద్దగా ఆకర్షించడం లేదు. అంతేకాకుండా, బ్యాంకుల్లో డిపాజిట్ల సంఖ్య తగ్గడం వల్ల రుణాల జారీకి కూడా సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. రుణాలు ఇవ్వడం కష్టతరమవడం దేశ ఆర్థికాభివృద్ధికి విఘాతం కలుగుతుంది.ప్రజల పెట్టుబడి ధోరణిలో మార్పు డిపాజిట్ల మందగమనానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. యువత ఎక్కువగా క్యాపిటల్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్ వంటి మార్గాల వైపు ఆకర్షితులవుతున్నారు. బ్యాంకుల పై ఆధారపడుతున్నవారు ప్రధానంగా సీనియర్ సిటిజన్లే. ఈ తరహా పరిస్థితుల్లో బ్యాంకులు తమ సేవలను విస్తరించడానికి వినూత్న మార్గాలను అన్వేషించాల్సి ఉంది.



ప్రభుత్వాలు, ఆర్బీఐ సంయుక్తంగా ఈ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. మొత్తానికి, డిపాజిట్ల వృద్ధికి సంబంధించిన సమస్యను ప్రభావవంతమైన విధానాలతో వెంటనే పరిష్కరించకపోతే, దీని ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా పడుతుంది. ఈవిషయంలో కేంద్ర ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ,రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా త్వరితంగా నిర్ణయాలు తీసుకొని పరిస్థిని చక్కదిద్దాలి.



డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్
9849328496

# హైదరాబాద్ సమీపంలో మరో కొత్త సిటీ

### రోజురోజుకూ పెట్టుబడిదారులకు హైదరాబాద్

**నగరంతో విడదీయరాని విధంగా బంధం బలపడుతోంది. ఈ నగరం గ్రామీణ ప్రాంతాల కస్టమర్లను సైతం ఆకర్షిస్తోంది. హైదరాబాద్ చారిత్రక నగరం భారతదేశానికే మెరిసే నెలవంక. గరీబు, నవాబు తేడా లేదు. పేదలకు కొంగుపరిచి నీడ నిచ్చింది. రాయల్‌గా ఉండాలనుకునే వారికి ఇక్కడ చోటుంది. ఇక్కడి ప్రత్యేకతలు హైదరాబాద్‌ను విశ్వనగరంగా తయారు చేస్తున్నాయి. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఒక్కొక్కటిగా అల్లుకుంటున్నాయి. ఏ కోణం నుంచి చూసినా ఈ నగరం అన్నివర్గాలకు అనువైనదిగా ఉంది. అందుకే హైదరాబాద్ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది.**

### ప్లాటు ఎందుకు కొనాలి?

మారుతున్న రోజులను ప్రతి ఒక్కరూ పసిగట్టాల్సిన అవసరం ఉంది. మూస ధోరణిలో పాత రోజులనే నెమరు వేస్తే కుదరదు. పెళ్ళి సంబంధాలప్పుడు అబ్బాయికి ఎన్ని ఎకరాల భూమి ఉందని అడిగేవారు. కాలానుగుణంగా ప్రశ్న మారింది. గమనించండి. ఇప్పుడు వ్యవసాయ భూమి కాదు, ఎన్ని ప్లాట్లు ఉన్నాయని అడుగుతున్నారు. వ్యవసాయ భూమి కన్నా ప్లాట్ల ధరలు వేగంగా పెరుగుతాయి. ప్లాటు విస్తీర్ణం చిన్నదే అయినా వ్యవసాయ భూమితో పోల్చితే ధర కొన్ని రెట్లు ఎక్కువ. అందుకే ప్లాట్ల మీద మక్కువ పెరిగింది. ఇక్కడ ఇంకో విషయం గ్రహించాలి. ప్లాటు కొని పెడితే చాలు నిద్రలో ఉన్నా సరే ధర పెరుగుతూనే ఉంటుంది. ఏమీ చేయకపోయినా ధర మాత్రం రోజు రోజుకూ పెరుగుతూ ఉండేది ప్లాటు ఒక్కటే. వ్యవసాయం మాత్రం కృషి చేయవలసిన ఉంటుంది. నేటి యువతకు వ్యవసాయంపై ఆసక్తి లేదు. ఎక్కువగా ప్రైవేటు ఉద్యోగాలపైనే ఆధారపడుతున్నారు.

### వ్యవసాయం వద్దు - ఉద్యోగమే ముద్దు

దేశంలో 6 లక్షలకుపైగా గ్రామాలున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం ప్రధాన ఆధారం. దేశ ఉన్నతికి ఈ రంగమే వెన్నెముక. వ్యవసాయ ఉత్పత్తిలో ప్రపంచవ్యాప్తంగా రెండవ స్థానం. భారతీయ శ్రామిక శక్తిలో 55 శాతం వ్యవసాయ రంగంలో ఉంది.జి.డి.పి లో వ్యవసాయం రంగం వాటా 1990–91 లో 35 శాతం కాగా ప్రస్తుతం 15 శాతానికి తగ్గిపోయింది. దీనికి కారణం యువతలో నిరాసక్తత. వ్యవసాయం అంటే అయిష్టత. యువతరం ఆలోచన అంతా ఉద్యోగాలపైనే ఉంది. ఈ కారణం చేత పట్టణీకరణ, నగరీకరణ పెరిగింది. వ్యవసాయం, స్వయం ఉపాధి కన్నా ఉద్యోగాలపై మొగ్గు ఎక్కువగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా మార్కెటింగ్ ఉన్న బడా కంపెనీలు హైదరాబాద్ కు తరలి రావడం దీనిని ముఖ్య కారణం. ఈ నేపథ్యంలో బెంగుళూరు హైవే లో హైదరాబాద్ కు సమీపంలో ఉన్న షాద్ నగర్ కు ప్రాధాన్యత పెరిగింది. ఇప్పటి వరకు హైదరాబాద్ పరిసరాల్లో గమనిస్తే జనాదరణలో షాద్ నగర్ అగ్రస్థానంలో ఉంది. మినీ ఇండియా గా మారనున్న షాద్ నగర్ లో జీవన సరళి వైవిధ్య భరితంగా ఉండబోతోంది. సమీప భవిష్యత్తులో జనావళికి ఒక కొత్త సిటీ పరిచయం కాబోతోంది. అదే షాద్ నగర్..




మేకగూడలో మైక్రోసాఫ్ట్ క్యాంపస్

హైదరాబాద్ సిగలో షాద్ నగర్ కలికి తురాయి కానున్నదని చెప్పడంలో అతిశయోక్తి లేదు. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఫార్మా హబ్‌లు, ప్రభుత్వ సెజ్‌లు, విద్యా సంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రులు, జూపార్క్, ఎమ్యూజ్‌మెంట్ పార్కుల వంటి విహార కేంద్రాలు, ఒకవైపు బాలానగర్, పోలేపల్లి పారిశ్రామిక సెజ్‌లు, మరోవైపు చందనవల్లి, సీతారాంపూర్ సెజ్‌లు వెరసి షాద్‌నగర్ న్యూ హైదరాబాద్‌గా అవతరించనుంది. ఇప్పటి హైదరాబాద్, సికింద్రాబాద్ లను కలిపి జంట నగరాలుగా పిలుస్తున్నాం. ఇకపై షాద్ నగర్ ను కలుపుకుని హైదరాబాద్ ట్రై సిటీస్‌గా మారనుంది. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బెంగుళూరు హైవేను ఆరు లేన్లుగా విస్తరిస్తున్నారు. మును ముందు 12 లేన్లుగా చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఎంఎంటిఎస్ ప్రారంభించారు. మూడవ దశలో మెట్రోరైలు షాద్‌నగర్ వరకు నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)పనులు పురోగతిలో ఉన్నాయి. ఇది పూర్తి కావడంతో షాద్‌నగర్ రూపురేఖలు ఊహించని రీతిలో మారిపోతాయి.

టిఆర్ఎస్ ప్రభుత్వం షాద్‌నగర్‌ను కాలుష్య రహిత మండలి (పొల్యూషన్ ఫ్రీ జోన్)గా ప్రకటించి, దేశానికే ఆదర్శంగా నిలబెడతామని మాట ఇచ్చింది. అందుకే అక్కడ కాలుష్య కారక పరిశ్రమలకు అనుమతులను నిషేధించారు. హైదరాబాద్ నుంచి కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను షాద్ నగర్ కు తరలించడం లేదు. శంషాబాద్ కు అంతర్జాతీయ విమానాశ్రయం రాకతో షాద్ నగర్ దశ తిరిగింది. షాద్ నగర్ మును ముందు శాటిలైట్ టౌన్ షిప్ గా అభివృద్ధికి అన్ని అవకాశాలున్నాయి. అన్ని హంగులతో సైబరాబాద్‌ను మురిపించే రీతిలో షాద్‌నగర్ అభివృద్ధి కానున్నది. ఔటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డు మధ్య జరగబోయే అభివృద్ధి, ఒకవైపు నివాసయోగ్యమైన టౌన్ షిప్ లు, మరోవైపు పారిశ్రామికవాడలతో షాద్ నగర్ పరిసర ప్రాంతాలు రియల్ ఎస్టేట్ కు ఆకర్షణీయంగా మారాయి.

### అదృష్టం కాదు - ముందు చూపు ముఖ్యం

స్థిరాస్తి కొనుగోలులో ముఖ్యంగా దీర్ఘకాలిక పెట్టుబడికి సాధారణంగా పది శాతం కస్టమర్లు మాత్రమే ముందు చూపు కలిగి ఉంటారు. భవిష్యత్తులో ఏ ప్రాంతం ఎలా అభివృద్ధి చెందుతుందో సరిగ్గా అంచనా వేస్తారు. దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించుకుంటారు. మధ్యలో రీ సేల్ ఆలోచన మదిలో పెట్టుకోరు. 10 నుంచి 20 సంవత్సరాల వరకు ఓపికతో వేచి ఉంటారు. వేగంగా అభివృద్ధి పథంలో సాగిపోతున్న హైదరాబాద్ లాంటి నగరాల గురించి చెప్పనవసరం లేదు. ఈ పది శాతం కస్టమర్లు ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాజెక్టులు కొలువుదీరే ప్రాంతంలో, సెజ్ లు రూపు దిద్దుకుంటున్న ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టి వేచి ఉంటారు. ఆ ప్రాంతాల రూపు రేఖలు మారి సుందరంగా, నమ్మశక్యం కాని విధంగా మారిపోతాయి. అప్పుడు ఆ భూముల ధరలకు రెక్కలు వస్తాయి. కొనుగోలు అవకాశం కొండెక్కుతుంది. ధర ఆకాశంలో ఉండి అందకుండా పోతుంది. అప్పుడు ముందు చూపు ఉన్న 10 శాతం కస్టమర్ల ఆనందానికి హద్దులు ఉండవు. చూద్దాం లే, చేద్దాం లే అంటూ పక్క వాళ్ళ సలహాలతో పెట్టుబడి నిర్ణయాన్ని వాయిదా వేసుకున్న 90 శాతం కస్టమర్లు పశ్చాత్తాప పడుతుంటారు. చేసేది లేక ఉచిత సలహాలిచ్చిన ఇరుగు పొరుగు పై నెపం నెట్టేస్తారు. విధిని వంచిస్తారు. మాకు అదృష్టం లేదంటూ దేవుడిపై నిందలు వేస్తారు. స్థిరాస్తిపై పెట్టుబడుల విషయమై ఈ ధోరణి పనికి రాదు. సరైన సమయంలో, అనువైన ప్రాంతాల్లో, నాణ్యమైన కంపెనీని ఎంపిక చేసుకొని ఓపెన్ ప్లాట్లు కొంటే వెనుదిరిగి చూసే అవసరం ఉండదు. తమ వారసులకు కోట్ల రూపాయల విలువైన ఆస్తిని సంపదగా ఇస్తారు. అందువల్ల కస్టమర్లు అపోహలు విడనాడి అవకాశాలను అందుకోవడం ఉత్తమం.

### అల్లదిగో.. మరో సుందర్‌నగర్..

ఇరవయ్యేళ్ల క్రితం మాట..
అప్పుడు మాదాపూర్, గచ్చిబౌలి, కూకట్ పల్లిని చూసి నవ్వారు.
ఇప్పుడు నివ్వెర పోయారు.
అప్పుడు సువర్ణావకాశం జారవిడుచుకున్నారు.
ఇప్పుడు బేజారయ్యారు.
నాడు ప్లాట్ కొనమంటే పక్క చూపులు.
నేడు సింగపూర్ సిటీ అయిందంటూ బేల చూపులు.
నమ్మిన నాప చేను పండునని అప్పుడు నమ్మిన వాళ్ళ దశ ఇప్పుడు తిరిగింది.
మరి మీనమేషాలెందుకమ్మా!
దూరదృష్టి ఉంటే కాలం కలిసొస్తుంది.
ఇప్పుడు తాజాగా మరో అదృష్టం పరీక్షించుకోమంటోంది.
ముందు చూపున్న మదుపరులకు అది నూతన ఆవిష్కరణల వేదిక.
సాంకేతిక పరిజ్ఞానపు కాంతి పుంజం.
సిరులు కురిపించే అనురాగ సీమ.
మది దోచే ఆనంద నిలయం.
హృద్యమైన మమతల కోవెల.
ఆ కలల తీరం దగ్గరలోనే ఉంది.
లక్షలాది కస్టమర్లు ఎదురు చూస్తున్న సౌభాగ్య నగరం.
అల్లదిగో.. మరో సుందర్ నగర్..

**అదే షాద్‌నగర్**







షాద్‌నగర్‌లో ఇస్రో టౌన్‌షిప్



గంగాధర్.కే
బి.బి.జి ఇన్నర్ సర్కిల్
9291622677

# సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దు..

- ఆన్‌లైన్ అప్పు...ప్రాణాలకు ముప్పు
- ఎస్పీ యోగేష్ గౌతం

**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** సైబర్ నేరగాళ్ల నుండి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికారాదని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతము అనేక రకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేయడం జరుగుతుందని అన్నారు.అధిక లాభాల కోసం ఆశపడి ఆన్లైన్లో పెట్టుబడి పెట్టకండి ఎవరో చెప్పింది విని లేదా సోషల్ మీడియాలో యాడ్స్ చూసి మోసపోకండనీ తెలిపారు. మీరు పెట్టుబడి పెట్టండి మీ బంధుమిత్రులతో పెట్టుబడి పెట్టించి అదిక లాభాలు పొందండి అంటూ ఆశ చూపించే చైన్ ఇన్వెస్ట్మెంట్ మోసపూరితమైనదని గ్రహించాలని సూచించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు మీకు క్యూఆర్ కోడ్ పంపించి దాన్ని స్కాన్ చేస్తే మీకు డబ్బులు వస్తాయని చెప్తే నమ్మకండనీ, అది సైబర్ మోసం అని గ్రహించాలన్నారు. ఆన్లైన్ లోన్స్ గురించి లోన్స్ యాప్లను మీ ఫోన్ లో డౌన్లోడ్ చేసినప్పుడు మీ ఫోన్లో ఉన్న అన్ని ఫోన్ నెంబర్లు ఫోటోలు మీ వ్యక్తిగత వివరాలు యాప్ వారు మీ అనుమతి లేకుండా తీసుకుంటారనీ, తర్వాత మీరు తీసుకున్న లోన్ తిరిగి కట్టిన ఎక్కువ డబ్బులు కట్టమని ఆ వివరాలతో వేధింపులకు గురి చేస్తారన్నారు. తస్మాత్ జాగ్రత్త అని ఆన్లైన్ లోన్ ఆప్స్ ద్వారా లోన్స్ తీసుకోరాదని సూచించారు. లోన్ ఆప్స్ వేధింపులకు మీలో మీరే బాధపడవద్దు, క్షణికావేశాలకు పోవద్దు.మీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు చెప్పండి, 1930కి లేదా డయల్ 100 కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కస్టమర్ కేర్ నెంబర్ను సంబంధిత వెబ్సైట్ నుండి మాత్రమే తీసుకోవాలని సైబర్ నేరగాళ్లు గూగుల్ నందు నకిలీ కస్టమర్ కేర్ నెంబర్ నుంచి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పండుగలకు షాపింగ్ చేసే సమయంలో ఇచ్చే లాటరీ కూపన్లలో వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దని ఎస్పీ సూచించారు. లాటరీ కూపన్‌లో నమోదు చేసే ఫోన్ నెంబరు, మెయిల్ ఐడీ వంటి వ్యక్తిగత



వివరాలు సైబర్ నేరగాళ్ల చేతికి చేరే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎవరైనా ఈ తరహా మోసాల బారినపడితే 1930కి ఫోన్ చేయాలని అన్నారు.తెలియని నెంబర్ నుంచి వాట్సాప్ లో కానీ ఇన్స్టాగ్రామ్‌లో కానీ ఫేస్‌బుక్‌లో కానీ వీడియో కాల్ చేసి ఫోటో లను న్యూడ్ ఫోటో లుగా మార్ఫింగ్ చేసి మీ బంధు వులకి ఫోన్చేస్తాము ,ఫోటోలు పంపిస్తాం ,యు ట్యూబ్ లో అప్లోడ్ చేస్తాం అంటూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. పార్ట్ టైం జాబ్ ఇస్తామని, లాటరీ వచ్చింది అనో, గిఫ్ట్ వచ్చిందనో, కేవైసి అప్డేట్ చేయాలని చెప్పి సైబర్ నేరగాళ్లు పర్సనల్ డీటెయిల్స్ తీసుకొని డబ్బు కాజేస్తు న్నారని తెలిపారు. ఆన్లైన్ సైబర్ నేరగాళ్ల మోసాల్లో పడకుండా అప్రమత్తంగా ఉండడం అవశ్యకం అని ఎస్పీ తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పోలీసులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది అని ఎస్పీ తెలిపారు.ప్రజలు మీరు జాగ్రత్తగా ఉండండి తోటి వారిని సైబర్ నేరాల బారిన పడకుండా వారికి అవగాహన కల్పించండి అని ఎస్పీ కోరారు.

## దమ్మాయిగూడ మున్సిపల్ అభివృద్ధికి చేయుతనిస్తాం



- ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్

**కీసర, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో కౌన్సిలర్ పాండల అనురాధ యాదగిరి గౌడ్ ఆద్వర్యంలో 28 లక్షల రూపాయలతో చేపట్టిన నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన,కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్‌లు ముఖ్యధితులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్, వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత,దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షులు ముప్ప రామరావు, శోభా రాణి, సంజీవ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ప్రసాద్ గౌడ్, శ్రవణ్ రెడ్డి, సోమేశ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన జీవితం యోగాతోనే..!

- ఐఐటీలో 400 మందితో యోగా తరగతులు
- యోగ గురువులు సోమలింగం, శ్రీనివాస్ రెడ్డి



**సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** యోగాతోనే ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని యోగ గురువులు సోమలింగం, శ్రీనివాస్ రెడ్డి లు పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లాలోని కంది ఐఐటి లో 33 తెలంగాణ బెటాలియన్ ఎన్ సి సి ఆధ్వర్యంలో ఈనెల 21 నుండి 30 వరకు 400 మంది ఎన్.సి.సి విద్యార్థులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎన్.సి.సి లెఫ్టినెంట్ కాల్నాల్ సోమలింగం, శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో యోగ ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. ఆరోగ్యకరమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ యోగ చేయవలసిన అవసరం ఉందన్నారు. ఎన్ సి సి విద్యార్థులకు యోగ ఆసనాలను చేసి చూపించారు. కార్యక్రమంలో ఎన్ సి సి ఏవో పీఎం రావు , ఎస్ఎం రామ్ సాబ్ , రమేష్ సీరియల్, శంకర్, పాల్గొన్నారు.

# నల్ల దుస్తులతో ఉద్యోగుల నిరసన

- 14వ రోజుకు చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** సమగ్ర శిక్ష ఉద్యోగులు రోజుకో రీతిన తమ నిరసన లు తెలుపుతున్నారు.నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్ ధర్నా సెంటర్ దగ్గర సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె బుధవారం 14వ రోజు ఉద్యోగులు అందరు నల్ల దుస్తులు ధరించి తమ నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను ఉద్దేశించి జాక్ అధ్యక్షుడు ఎల్లాగౌడ్ మాట్లా డుతూ రాష్ట్ర వ్యాప్తంగా గత 16 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల పై ప్రభు త్వం కనికరించడం లేదు అని అయిన మేము వెనుకంజ వేసే ప్రసక్తే లేదని మేము ప్రభుత్వాన్ని గొంతెమ్మ కోరికలు కోరడం లేదని అన్నారు.గత రెండు దశా బ్దాలుగా తక్కువ జీతాలతో పనిచేస్తున్నామని ఇప్ప టికైనా ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.సమగ్ర శిక్ష ఉద్యోగులను అందరిని విద్యాశాఖ లో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.ఈ ధర్నా శిబిరాన్ని పి ఓ డబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి,పి వై ఎల్ జిల్లా కార్యదర్శి ప్రతాప్,టి యు డి ఐ జిల్లా కార్యదర్శి నర్సింహా, జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీలు సంఘీభావం తెలిపారు ఈ కార్యక్రమంలో వెంకట్రా




ములు,గౌరమ్మ,విజయ, శివకుమార్, రాజు, మహిపాల్, అల్తాఫ్, మహేశ్వరి, లక్ష్మీ, రాములు, మనోహర్, రవి, కృష్ణకుమార్, శశికాంత్ రెడ్డి, పెద్దఎత్తున సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు సీఎం సహాయ నిధి వరం

- ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి



**తాండూరు, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి వరంలాంటి దని ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు.సీఎం సహాయ నిధి ద్వారా విడుదలైన చెక్కులను తాండూర్ కు చెందిన బి. వెంకటమ్మ ఇంద్రనగర్ 34 వేలు, ఖాన్ కాలనీ కీ చెందిన ఉమర్ అహ్మద్ 34-వేలు పెద్దెముల్ మండల్ గాజీపూర్ గ్రామానికి చెందిన బిచ్చిరెడ్డి 52500 వేల విలువైన చెక్కులను ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సీఎం సహాయ నిధి వరం లాంటిది అని అన్నారు ఇట్టి కార్యక్రమం లో తాండూర్ మండల నాయకులు మరియు తాండూర్ పట్టణ నాయకులు , యువ నాయకులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులను నిర్బంధించడం సరికాదు

**మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ మెదక్ పట్టణంలో శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను పోలీసుస్టేషన్ తరలించి, నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. సమగ్ర శిక్ష ఉద్యోగుల టెంట్ల ముందు నుంచే వెళ్తున్న ముఖ్యమంత్రి.. టెంట్లు పీకేయడం కాదు, వారి సమస్యకు పరిష్కారం చూపండి. 15రోజులుగా ఆందోళన చేస్తున్న వారి ఆవేదన అర్థం చేసుకోండి. అధికారంలోకి వచ్చిన వెంటనే చాయ్ తాగినంత సేపట్లో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు తీరుస్తామని, వారి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి, ఏడాది గడిచినా ఉలుకు లేదు, పలుకు లేదు. అన్ని వర్గాలను మోసం చేస్తున్న విధంగానే సమగ్ర శిక్ష ఉద్యోగులను కూడా కాంగ్రెస్ పార్టీ నమ్మించి మోసం చేసారు. ఇప్పుడు రోడ్డెక్కి నిలదీస్తే అక్రమ నిర్బందాలకు గురిచేస్తున్నారు. ఇది హేయమైన చర్య. నిర్బంధించిన సమగ్ర శిక్ష ఉద్యోగులను తక్షణం విడుదల చేయాలని, ఎన్నికల సమయంలో చెప్పినట్లుగా రెగ్యులైరైజేషన్ సహా ఇతర హామీలను నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## కేజీబీవీ పాఠశాలలకు ప్రభుత్వ ఉపాధ్యాయులను పంపడం సరికాదు

- టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామినేని వెంలాటేశ్వర్లు(ఆర్వీ), లచ్చుమల్ల వెంకన్న





**హైదరాబాద్, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** కేజీబీవీ పాఠశాలలకు ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపడాన్ని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వ్యతిరేకిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కార్యదర్శులు రామినేని వెంకటేశ్వర్లు, లచ్చుమల్ల వెంకన్నలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత 15 రోజులుగా దీక్షచేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను చర్చలకు పిలిచి వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇటీవలనే ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న వివిధ రూపాలలో పని సర్దుబాటు రూపంలో మిగులుగా గుర్తించబడిన పాఠశాల నుండి అవసరమైన పాఠశాలకు పంపించడం జరిగింది. రానున్న వార్షిక పరీక్షల దృష్ట్యా ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇతర చోట్లకు పంపిస్తే తీవ్ర నష్టం జరుగుతుంది. సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల దీక్షను విరమింప చేయటానికి ప్రభుత్వం కృషి చేయాలి. దీక్ష కొనసాగుతున్నందున ఆయా పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి తప్ప ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను పంపడం సరికాదు. ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ప్రభుత్వం చిత్తశుద్ధితో సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులతో చర్చలు జరిపి సాధ్యాసాధ్యాలని వారికి వివరించి తక్షణం సమ్మె విరమింపచేయాలని ప్రభుత్వానికి తెలియజేశారు.

## నేడు కేంద్ర మంత్రి బండి సంజయ్ పేట జిల్లాలో పర్యటన

**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** నారాయణపేట జిల్లాలో ఈనెల 26న కేంద్రహెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అధికార కార్యక్రమంలో భాగంగా నారాయణపేట జిల్లాలో పర్యటిస్తున్నట్లూ జిల్లా కలెక్టర్ సిక్తా



పట్నాయక్ తెలిపారు. నర్వ మండలం రాయికోడ్ గ్రామంలో జరిగే కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశంలో పాల్గొంటారని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# యేసు క్రీస్తు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయం





- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** యేసు క్రీస్తు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని ప్రజలంతా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తెలిపారు. బుధవారం కోట్ పల్లి, పెద్దేముల్, అంతారం తాండూరు మెథడిస్ట్, బెన్నూర్ చర్చ్ లలో క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నియోజకవర్గ క్రిస్మస్ సోదరి, సోదరులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పెద్దేముల్‌లో నూతన చర్చ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే పెద్ద పండుగని, ప్రపంచశాంతికి మనమందరం కలిసి ఉంటూ సాటి మానవుల పట్ల దయా, క్షమ ప్రేమ కలిగి ఉండే విధంగా మానవాళికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తి ఏసుప్రభు అన్నారు. ఈ క్రిస్మస్ పండుగ ప్రతి ఒక్కరి హృదయం, ప్రతి కుటుంబంలో ఆనందంతో వెల్లివిరియాలని క్రిస్మస్ సోదరులతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించే క్రైస్తవు లందరికీ ప్రేమపూర్వకంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చర్చి భావన నిర్మాణం కోసం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శోభారాణి, రాష్ట్ర మైనారిటీ సెల్ కన్వీనర్ రియాజ్, తాండూర్ ఏ బ్లాక్ అధ్యక్షులు లోంక నర్సింలు పశు గణాభివృద్ధి మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కిరణ్, జిల్లా నాయకులు ఎల్లారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీణ్ కుమార్ గుప్తా,మాజీ సర్పంచ్ ఎర్ర బాలప్ప, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుజ్జమ్మ, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, డివై నర్సింలు, ఆనంద్ చారి, జితేందర్ రెడ్డి, పెంటప్ప, రాజ రత్నం, రవీందర్, గోపాల్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.


## ఒడిశా గవర్నర్‌గా నియమితులైన డా.కంభంపాటికి శుభాభినందనలు

**విజయవాడ, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయానుభవం గడించిన, ప్రజాసంబంధాల చరిత్ర కలిగిన డాక్టర్ కంభంపాటి హరిబాబు దక్షిణాది రాష్ట్రాల్లో కీలకమైన ఒడిశా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులు కావడం పట్ల సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనకు అభినందనలు తెలిపారు. భారతీయ జనతా పార్టీ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షునిగా, విశాఖపట్నం శాసనసభ్యునిగా, పార్లమెంట్ సభ్యునిగా నిస్వార్థ సేవలు అందించిన హరిబాబు, 2021 నవంబర్ 6న మిజోరం రాష్ట్ర గవర్నర్ గా నియమితులయ్యారు. ఆయన స్వస్థలమైన ప్రకాశం జిల్లా తిమ్మసముద్రంలోని శ్రీ గోరంట్ల వెంకన్న సంస్కృత కళాశాలలో తాను ఐదేళ్లపాటు భాషా ప్రవీణ చదివి, ప్రస్తుతం కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం గౌరవాధ్యక్షునిగా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. కొంతకాలం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా పనిచేసిన డాక్టర్ హరిబాబుతో 1978 నుంచి తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయంటూ నిమ్మరాజు ఆయనకు శుభాభినందనలు తెలిపారు.



## ప్రేమ, దయ, శాంతి మార్గాలను చూపిన యేసు

- క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** విశ్వ మానవాళికి తన ప్రేమతత్వంతో ప్రజల జీవితాలలో వెలుగులు పంచిన కరుణామయుడు ఏసుక్రీస్తు అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.బుదవారం రంగారెడ్డి జిల్లా కొత్తూరు మున్సిపాలిటీ లోని ఫాతిమాపూర్ చర్చిలో ఫాదర్ సైమాన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రేమ, దయ,శాంతి,స్వేచ్ఛ మార్గాలను చూపుతూ తన బోధనల ద్వారా మానవాళికి తెలియజేసిన దేవుడు ఏసుక్రీస్తు అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోంగల్ల హరినాథ్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దయానంద్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ కోశాధికారి చింత సాయి తేజశ్వర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్రోళ్ల జగన్, గూడూరు సిద్దు గౌడ్,బాల్ శివ రెడ్డి,బాల్ రెడ్డి,విశాల్,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భూముల కబ్జాపై బాధితుల ఆవేదన

- మాకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్న బాధితులు
- ప్రభుత్వ భూములను సైతం అమ్మేస్తున్నాడని ఆరోపణ



**తలకొండపల్లి, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** తలకొండపల్లి మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన తౌడోజు రమేష్,తౌడోజు రాఘవాచారి,లకు చెందిన భూమిని అదే గ్రామానికి చెందిన తమకు దాయాదులైన మాజీ సర్పంచ్ శ్రీనివాసాచారి అనే వ్యక్తి,మాకు తాతల కాలం నుండి వారసత్వంగా వస్తున్న సొంత భూమిని అతని స్వాధీనంలోకి తీసుకొని ఇతరులకు అమ్మి మమ్ములను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని విలేకరుల సమావేశంలో చెప్పుకొని బాధితులు వాపోయారు.మాకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్,సీఎం ఛాంబర్ లోని రెవెన్యూ అధికారులకు,సీసీఎల్ఏ ల్యాండ్ రికార్డు అధికారులకు,స్థానిక ఆర్డీవో,ఎమ్మార్వో,పోలీస్ ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు లు చేసిన న్యాయం జరగడంలేదని బాధితులు లబోదిబోమంటున్నారు. రాంపూర్ గ్రామ శివారులోని 295, 317, 321, 323, 328, 330, 365, 367, 371, 376 సర్వే నెంబర్లలో సుమారు 16 ఎకరాల భూమిలో ముగ్గురికి సమాన భాగాలు చేసుకున్నప్పటికీ మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మా యొక్క భూముల్లో కడీలు పాతి ఇతరులకు అమ్మి వేస్తూ మమ్ములను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వారు ఆరోపిస్తున్నారు.అదేవిధంగా 320,325,370 సర్వే నెంబర్ లోని ఔసలోని బొంద అనే పోరంబోకు ప్రభుత్వ భూమిని సైతం తన కుటుంబ సభ్యుల పేరు మీద పట్టా చేసుకున్నాడని ఆరోపిస్తున్నారు.శ్రీనివాస చారి అనే వ్యక్తి నుండి మా భూమిని మాకు పొజిషన్ ఇప్పించి తమకు న్యాయం చేయాలని కోరుతూ కందుకూరు ఆర్డీవో కార్యాలయంలోని ప్రజా దర్బార్లో కూడా ఫిర్యాదు చేసినట్లు సూచించారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

# ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శనీయం

- అందరి ప్రార్థనలు ఫలించి ప్రశాంతంగా జీవించాలి
- అన్ని మతాలకు ప్రాధాన్యత పెంచిన ఘనత కేసీఆర్‌దే
- పండుగలను అధికారికంగా నిర్వహించుకుంటూ ఐక్యతను పెంచుకున్నాం
- మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శనీయమని, అందరి ప్రార్థనలు ఫలించి ప్రశాంతంగా జీవించాలని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు.బుధవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నిర్మల మాతా చర్చ్, సిల్వి సిలోయం చర్చ్, గ్రేస్ చర్చ్, మన్నా చర్చ్, సెయింట్ బాప్టిస్ట్ చర్చ్ లలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతాల ప్రధాన పండగలను అధికారికంగా నిర్వహిస్తూ వాటి ప్రాధాన్యత పెంచిన ఘనత కేసిఆర్ దే అన్నారు. గత పదేండ్లుగా ఆయా మతాల ప్రధాన పండుగలను అధికారికంగా నిర్వహించుకుంటూ మరింత ఐక్యతను పెంచుకున్నామన్నారు. క్రిస్మస్, రంజాన్, దసరా పండుగలకు ప్రత్యేక విందులు, దుస్తులు, సామాగ్రిని పంచుతూ గంగా, జమున, తహేజీబ్ లకు నిలయంగా తెలంగాణ సమాజాన్ని తయారు చేసిన ఘనత కేసిఆర్‌కే దక్కుతుందన్నారు. అన్ని మతాల ఆశీర్వాదాలు ప్రజలందరిపై ఉండి తెలంగాణ సమాజం మరింత అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జడ్పి మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట్ నారాయణ గౌడ్, నాయకులు నంద్యాల దయాకర్ రెడ్డి, ఉప్పల ఆనంద్, మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, నెమ్మాది బిక్షం, జీడి బిక్షం, తూడి నరసింహారావు, పూర్ణ శశికాంత్, తాహెర్ పాషా, బత్తుల జానీ, గండూరి కృపాకర్,ఆయా చర్చిల పాస్టర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## "ఉచ్చల జలధితరంగ" పుస్తకం ఆవిష్కరణ

**హైదరాబాద్, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** కేంద్ర సాహిత్య అకాడెమీ యువ పురస్కార గ్రహీత సంపాదకత్వంలో వచ్చిన కవిత్వ సంకలనం "ఉచ్చల జలధితరంగ" ఆవిష్కరణ బుధవారం సాయంత్రం బుక్ ఫెయిర్లో తోపుడు బండి సాధిక్ వేదికపై జరిగింది. కవి, సీనియర్ జర్నలిస్టు ప్రసేన్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కవి, విమర్శకుడు,రాష్ట్ర అధ్యక్షులు వీసికే – డా.జిలకర శ్రీనివాస్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బషీర్ బాగ్ పీజీ లా కాలేజ్ ప్రిన్సిపాల్ డా.గుమ్మడి అనురాధకు తొలిప్రతి అందించారు. కార్యక్రమంలో ఆవిష్కర్త జిలకర శ్రీనివాస్ మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్లో దళితునిపై దాడిచేసి, మొహంపై మూత్రం చేయడాన్ని నిరసిస్తు తెలుగులో 49 మంది కవులు రాసిన కవితల సంకలనం ఇదని తెలిపారు. ఇలాంటి దాడులు దేశంలో నానాటికి పెరుగుతున్నాయని ఆవేదన చెందారు. అలాగే చాలావరకు అట్టడుగు వర్గాలను భూస్వాములు, దొరలు బానిసత్వంలోకి నెట్టేశారని, భానిసత్వాన్ని సంస్కృతిగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని అన్నారు. ఇలాంటి దాడులు జరగకుండా సామాజిక బాధ్యతగా కవులు స్పందించాలని కోరారు. అనంతరం బుక్ ఫెయిర్ అధ్యక్షులు కవి యాకూబ్ మాట్లాడారు. యాకూబ్ కవిత్వం ద్వారా స్పందన వెంటనే ఉంటుంది. ఏదైనా ఘటన జరిగినప్పుడు సామాజిక బాధ్యతగా స్పందించాలంటే ఇతర ప్రక్రియల్లో కాస్త ఆలస్యం జరుగొచ్చు కానీ, కవిత్వం ద్వారానే తక్షణ స్పందన ఉంటుందని తెలిపారు. ఆ ఆవేదన, ఆందోళన, కోపం, నిరసనలు కవిత్వం ద్వారా వ్యక్తపరుచొచ్చని చెప్పారు. అనంతరం సంకలన సంపాదకురాలు మెర్సీ మాట్లాడారు. ఏక్ భారత్ సంస్కృతి, ఒకే దేశం అన్న చోట దళితులన్న వ్యత్యాసం ఎందుకు..? ఈ దాడులు ఎందుకు అని ప్రశ్నించారు. సామాజిక వర్గాలపై దాడులు జరుగ కుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్ (కవి, విమర్శకుడు, సీనియర్ పాత్రికేయులు) వైస్ప్రెసిడెంట్ బాల్ రెడ్డి పాల్గొన్నారు.

## క్రిస్టియన్ సమాజ అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- క్రిస్మస్ వేడుకల్లో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి




**హైదరాబాద్, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టీటీయుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డితో కలిసి క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని తార్నాక, లాలపెట్లో లోగోస్ గాస్పల్ చర్చ్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రిస్టియన్ సోదరులు, సోదరీమణులందరికీ "మేరీ క్రిస్మస్" శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ, క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, సహనానికి ప్రతీకగా నిలుస్తుందని, మనుషుల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే ఈ వేడుకలను అందరూ ఉత్సాహంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రభుత్వం క్రిస్టియన్ సమాజానికి అనేక ఉపయోగకరమైన కార్యక్రమాలను చేపట్టిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రిస్టియన్ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడం, పండుగల సందర్భంగా ప్రత్యేక నిధులు విడుదల చేయడం, పేద క్రిస్టియన్ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం వంటి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలులో ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ క్రిస్టియన్ సమాజ అభ్యున్నతికి కట్టుబడి ఉందని డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, క్రిస్టియన్ సంఘం ప్రతినిధులు, విశ్వాసులు పాల్గొన్నారు.

# క్రిస్టమస్ వేడుకల్లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే




**నాచారం, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోని రాజీవ్ నగర్ క్రైస్ట్ గోస్పల్ మినిస్ట్రీస్ చర్చ్‌లో క్రిస్టమస్ వేడుకల్లో పాల్గొని క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంతవరకు మన జీవితాల్లో వెలుగులు నింపి, నిత్యం మనల్ని ముందుకు నడుపుతూ కృప చూపిన యేసయ్య, ఇక ముందు కూడా మనందరిని కరుణించి ఎలాంటి ఆపద రాకుండా, అందరని సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని కోరారు. అనంతరం పాస్టర్ బిషప్ దేవదానం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, ఉల్లెం బాలరాజు, నవీన్ గౌడ్, నిసార్ అహ్మద్ గోరి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి పనిమనిషి దంపతులు అరెస్ట్

**రాజేంద్రనగర్, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** రాజేంద్ర నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి బీహార్ దంపతుల చోరీ కేసును రాజేంద్రనగర్ పోలీసులు ఛేదించారు. బుధవారం రాజేంద్రనగర్ డిఐ నవీన్ కుమార్ ప్రకారం బండ్లగూడ కార్పొరేషన్ లోని మ్యాపిల్ టౌన్షిప్ లో సోమవారం రాత్రి ఇంటి యజమాని కొండల్ రెడ్డి నివాసంలో బీహార్‌కు చెందిన ఇంటి పనిమనిషి దంపతులైన నమిన్ కుమార్ యాదవ్ అతని భార్య భారతిని సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు తో పోలీసులు నిందితుల జంట ను అరెస్టు చేశారు వారి నుంచి చోరీకి గురైన బంగారు నగలు, నికర నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిలో నియమించుకుంటున్న పని మనుషులకు ఆధార్ గుర్తింపు కార్డులు, ఫోటో చిరునామాలు సరిగ్గా ఉన్నాయని నిర్ధారించుకొని పనిలోనికి తీసుకోవాలని, మునుపటి ఉద్యోగ చరిత్రను తనిఖీ చేసుకోవాలన్నారు. ఇంట్లోనే విలువైన వస్తువులను భద్రంగా, అందుబాటులో లేకుండా చూసుకోవాలని వారి పై ఏమైనా అనుమానాలు ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

## బీరప్ప ఆలయ నిర్మాణానికి కృషి

- మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి



**తాండూరు, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బీరప్ప ఆలయ నిర్మాణానికి ధనవంతు కృషి చేస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డిని మరిగేదపూర్వకంగా కురుమ సంఘం సభ్యులు కలిశారు.ఈ సందర్భంగా బీరప్ప స్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా ఆలయం పైన స్లాబ్ వేయడానికి కావలసిన మొత్తం స్టీలు అందజేయాలని కురువ సంఘ సభ్యులందరూ కోరారు. దీంతో సానుకూలంగా స్పందిస్తూ స్లాబ్ కు కావలసిన స్టీల్ మొత్తం అందజేస్తామని సంఘ సభ్యులకు సానుకూలంగా స్పందించారు. పట్లోళ్ల బాల్ రెడ్డికి వారి కుటుంబ సభ్యులు అందరికీ బీరప్ప స్వామి అనుగ్రహం ఆశీస్సులు నిండుగా ఉండాలని కోరారు.

## మనస్మృతి పత్రాలు దహనం చేసిన ప్రజా సంఘాల నాయకులు



**కొడంగల్, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** కోడంగల్ పట్టణ కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో కుల నిర్మూలన పోరాట సమితి అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో మనుస్మృతి దహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమములో కేఎన్పిఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రన్న ,కొడంగల్ తాలూకా అంబేద్కర్ సంఘాల అధ్యక్షులు యు రమేష్ బాబు, డివిఎంసి నెంబర్ కే. దస్తప్ప, కెఎంపిఎస్ నాయకులు అంజయ్య ,బలరాం ,అంజి ,మహేష్ ,పకిరప్ప, శ్రీనివాస్, అంబేద్కర్ సంఘాల నాయకులు అన్నారం సాయిలు, పి వెంకటయ్య, డి .యేసు, రఘు ,మైలారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసు క్రీస్తు బోధనలు ఆచరణీయం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా మహబూబ్ నగర్ పట్టణం, క్రిష్టియన్ పల్లి బెత్లెహేమ్ యంబి చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసు క్రీస్తు చూపిన మార్గంలో మనం పయనించాలని క్రీస్తు బోధనలు భావితరాలకు అందించాలని ఆయన చెప్పారు. ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ఆయన క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రెవఆర్ వరప్రసాద్, బ్రదర్ ప్రేమ్ కుమార్, శాంసన్, రాజు, బ్రదర్ అబ్రహం, శరత్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, టి పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి. మహేందర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## సొంత డబ్బులతో సీసీ కెమెరాల ఏర్పాటు



**హయత్‌నగర్, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని జడ్జెస్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వారి సొంత డబ్బులతో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జడ్జెస్ కాలనీవాసులు తమ సొంత డబ్బులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమం అని కొనియాడారు. ప్రతి ఒక్క కాలనీలలో సీ.సీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. సీసీ కెమెరాల వలన మనకు ఎంతో భద్రతగా కనిపించని మూడో కంటి లాగా పనిచేసి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కొన్ని కాలనీలకు నా సొంతంగా ఇంతకు ముందు ఉన్న మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంపి నిధుల నుండి వివిధ కాలనీలో సీ.సీ కెమెరాలు ఏర్పాటు చేయించాను. ప్రస్తుతం ఉన్న మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కి కూడా కొన్ని కాలనీల సీ.సీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరాను. నిధుల మంజూరు రాగానే ఏర్పాటు చేయిస్తానని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం శ్రీనివాస్, కాలనీ సంక్షేమ సభ్యులు, బిజెపి నాయకులు, కార్యకర్తల పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ వద్దు.. గ్రామ పంచాయతీలే ముద్దు..



**మొయినాబాద్, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న మున్సిపాలిటీల ఏర్పాటులో గ్రామాల స్థాయిలో అభిప్రాయాలు సేకరించి ఏర్పాటు చేయాలని మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు సర్దార్నగర్ మార్కెట్ కమిటి మాజీ డైరెక్టర్ కుమ్మరి రాము పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామ పంచాయతీ ముందు గల అంబేద్కర్ విగ్రహం ముందు ఎన్కెపల్లి, జీవనూడ గ్రామస్తులతో కలిసి మున్సిపాలిటీ వద్దు గ్రామ పంచాయతీ ముద్దు అనే పేరుతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు గాలికి వదిలి 111 జీవో ఉన్న మొయినాబాద్ మండలంలో మున్సిపాలిటీ ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసం అని ఆయన విమర్శించారు. మొయినాబాద్ మండలంలోని అన్ని గ్రామాలు 111 జీవోలో ఉన్నప్పటికి మున్సిపాలిటీ చేయడం ప్రజల అభిప్రాయం ఎక్కడపోయిందని ఆయన దుయ్యబట్టారు. ప్రజల అభిప్రాయం లేకుండానే ఏకాభిప్రాయంగా సూచించడం ఇది సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో కుమ్మరి రాము, పెంద్యాల శ్రీనివాస్, ముదిగొండ సురేష్, ప్రభాకర్, కావలి రమేష్, మల్లేష్, రవీందర్, చంద్రబోస్ గౌడ్, సుభాష్ గౌడ్, సురేష్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, పెంద్యాల దానయ్య, ప్రవీణ్ కుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జక్కిడి శివచరణ్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జక్కిడి శివ చరణ్ రెడ్డి నియమించిన ఏఐసీసీ అధిష్టానం. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు అల్ ఇండియా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ . డిసెంబర్ 24న ఢిల్లీలో జక్కిడి శివ చరణ్ రెడ్డికి నియామక పత్రాన్ని అందచేసిన ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ ఉదయ్ భాను చిబ్.ఇటీవల జరిగిన ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ స్టేట్ ప్రెసిడెంట్‌గా జక్కిడి శివ చరణ్ రెడ్డి గెలుపొందిన సంగతి తెలిసిందే... యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో 2,16,115 ఓట్లతో జక్కిడి శివ చరణ్ రెడ్డి గెలుపొందారు. ఈ సందర్భంగా జక్కిడి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ నేషనల్ యూనియన్ ఆఫ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తో నా పదవీకాలం మొత్తం, సామాజిక న్యాయం మరియు సమాజ సంక్షేమం పట్ల నా నిబద్ధతలో నేను స్థిరంగా ఉన్నాను. ఎల్బి నగర్ జోనల్ ఇంచార్జ్‌గా పని చేయడం నుండి రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ వరకు, నా రాజకీయ ప్రయాణం అట్టడుగు స్థాయి నిశ్చితార్థం మరియు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పాటుపడింది. తెలంగాణ ఇంజినీరింగ్ కళాశాలల జెఎసి చైర్మన్‌గా నేను ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ మరియు ఇన్నోవేటివ్ గ్రోత్‌లో ఛాంపియన్‌గా కొనసాగుతున్నాను.జక్కిడి ఛారిటబుల్ ట్రస్ట్ స్థాపన, నా నాయకత్వంలో, విద్య, ఆరోగ్య సంరక్షణ మరియు సమాజ అభివృద్ధి ద్వారా సామాజిక సవాళ్లను పరిష్కరించడంలో మా అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంది. మా కమ్యూనిటీలో తక్కువ ప్రాధాన్యత ఉన్నవారిని మరియు సానుకూల మార్పును ప్రోత్సహించడమే మా లక్ష్యం అని అన్నారు.

# అబద్ధాల్లో కాంగ్రెస్ కు 'ఆస్కార్' అవార్డు ఇవ్వొచ్చు

**అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్న పార్టీ బీజేపీ**

**కేంద్ర హెూంశాఖ మంత్రి బండి సంజయ్ కుమార్**

**హైదరాబాద్, డిసెంబర్ 25 (జనం సాక్షి)**



రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ ను అడుగడుగునా అవమానించిన పార్టీ కాంగ్రెస్... నేడు ఆయనపై మొసలి కన్నీరు కార్చడం విడ్డూరమని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. అబద్ధాలను ప్రచారం చేయడంలో కాంగ్రెస్ గోబెల్స్ ను మించి పోయిందని, అబద్ధాల్లో ఆస్కార్ అవార్డు ఇవ్వాల్సి వస్తే.. అది కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. నేడు అంబేద్కర్ గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ హయాంలో భారతరత్న అవార్డు అంబేద్కర్ కు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలన్నారు. "పార్టీ 1954 నుండి 1988 వరకు నెహ్రూ, ఇందిరా, కామరాజ్ సహా 21 మందికి భారతరత్న అవార్డును ప్రకటించారు. కానీ రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ కు మాత్రం ఇవ్వలేదు. ఆయన ఎందులో తక్కువ. ఆయన చేసిన తప్పేంది?"అని ప్రశ్నించారు. వాజ్ పేయి జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ తదితరులతో కలిసి మాజీ ప్రధాని వాజ్ పేయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారితో కలిసి బీజేవైఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం లో పాల్గొన్నారు.

# "మన సినిమా ఫస్ట్ రీల్" పుస్తకావిష్కరణ



**హైదరాబాద్, డిసెంబర్ 25 (జనంసాక్షి)**

రెంటాల జయదేవ రాసిన "మన సినిమా ఫస్ట్ రీల్" పుస్తక పరిచయ గోష్టి హైదరాబాద్ బుక్ ఫెయిర్ వేదికగా జరిగింది. ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు.
త్రివిక్రమ్ మాట్లాడుతూ "సినిమాలకి విజయవాహిని ఎలాగో, పుస్తకాలకి ఎమెస్కో అలాగా. రెంటాల జయదేవతో "అతడు" సినిమా చేస్తున్నప్పుడు చెన్నైలో పరిచయం. తెలుగు సినిమా మొదటి రోజుల గురించి రాసిన పరిశోధనాత్మక పుస్తకం ఇది. ఇది ఒక నవలలాంటి పుస్తకం. సినిమాలంటే బాగా పిచ్చి ఉన్న వ్యక్తి రెంటాల జయదేవ. ఆయన మరిన్ని పుస్తకాలు రాయాలి" అని అన్నారు. కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ "తెలుగు సినిమా చరిత్ర చదవాలంటే ఈ పుస్తకం చదవాలి. అయితే ఇందులో తమిళ్, మలయాళం, కన్నడ సినీ పరిశ్రమలు సమాంతరంగా ఎలా అభివృద్ధి చెందాయి వివరంగా రాసారు" అన్నారు.
మామిడి హరికృష్ణ మాట్లాడుతూ "రచయిత రెంటాల జయదేవ ఈ పుస్తకాన్ని అథారిటీవ్ గా, అథెంటిక్ గా, అక్యూరేట్ గా రాసారు" అన్నారు. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, " చాలా లోతుగా పరిశోధించి వాస్తవాలను వెలికి తీసాడు రెంటాల. "సిరివెన్నెల సీతారామశాస్త్రికి గద్యరూపం త్రివిక్రమ్" అన్నారు ఎమెస్కో విజయ్ కుమార్. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సెక్రటరీ వాసు, మామిడి హరికృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణ కౌండిన్య, కొమ్మినేని వెంకటేశ్వరరావు, కె. దశరథ్, పులగం చిన్నారాయణ, క్రిష్టారెడ్డి, శాంబశివ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**బుక్ ఫెయిర్ను సందర్శించిన దర్శకులు త్రివిక్రమ్**

ప్రముఖ దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్ బుధవారం సాయంత్రం బుక్ ఫెయిర్ను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన పలు స్టాళ్లకు వెళ్లారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ స్టాళ్ను సందర్శించి, పుస్తకాలను పరిశీలించారు. ఆయన వెంట సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బుక్ ఫెయిర్ అధ్యక్ష, కార్యదర్శులు యాకూబ్, ఆర్ వాసు, వైస్ ప్రెసిడెంట్ బాల్ రెడ్డి ఉన్నారు.

# చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలపై అధ్యయనం

**ఎమ్మెస్ఎంఈ పాలసీ స్టడీ కమిటీ మెంబర్ గా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి**

**మఖ్తల్, డిసెంబర్ 25 (జనంసాక్షి)**

ఎమ్మెస్ఎంఈ పాలసీ 2024 - స్టడీ కమిటీ సభ్యునిగా మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి ఎంపికయ్యారు. బీసీలు(వెనకబడిన వర్గాలు) సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు స్థాపించేందుకు కృషి చేయడంతో పాటు బీసీలకు పారిశ్రామికవే త్తలుగా అవకాశాలు కల్పించి, వారిని అభివృద్ధి పథంలో నడిపించడంలో భాగంగా ఎమ్మెస్ఎంఈ పాలసీ 2024 స్టడీ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసింది. ఇందులో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో పాటు ఇతర సభ్యులుగా రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకరయ్య, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ తో పాటు బీసీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్, బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రిటైర్డ్ ఐఏఎస్ లు చిరంజీవులు, ప్రభాకర్, దినకర బాబు ఇతర సభ్యులు చుక్కా కొండయ్య, అలోక్ కుమార్, మల్లయ్య బాబు లతో కలిపి మొత్తం 15 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. ప్రధానంగా బీసీలు పరిశ్రమలను స్థాపించడంలో వెనుకబడటంతో ఒక కమిటీ వేసి బీసీలు ఎక్కువ సంఖ్యలో చిన్న సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమలు స్థాపించేలా వారికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందజేస్తూ తగిన సౌకర్యాలు కల్పించి వారిని



పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దటమే కమిటీ ఏర్పాటులో ముఖ్య ఉద్దేశమని, ఈ కమిటీ ఈ అంశాలు అన్నింటి పైనా అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలిపారు. బీసీలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, అందులో భాగంగానే తనను కమిటీలో సభ్యునిగా ప్రకటించిన సీఎం రేవంత్ తో పాటు మంత్రులకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ధన్యవాదాలు తెలిపారు.

# ఆదర్శ క్లబ్ నూతన భవనాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.



**తంగళ్ళపల్లి డిసెంబర్ 25 (జనం సాక్షి).**

తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ఆదర్శ క్లబ్ నూతన భవనాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందుని ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని ఆదర్శ క్లబ్ సభ్యులకు సూచించారు. సమిష్టి కృషితో ముందుకు సాగినప్పుడే అనుకున్న గమ్యానికి చేరుతామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నాయకులు, నాయకత్వం చేయలేదని వారి స్వలాభం కోసం దళారి తనం చేశారని అన్నారు. చట్టాలను తమ చుట్టాలుగా మార్చుకొని ప్రభుత్వ భూములను ఆక్రమించారని ఎక్కువగా తంగళ్ళపల్లి మండలంలోని జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన పథకాలు చేపట్టేందుకు భూములు లేక ఇంటిగ్రేటెడ్ స్కూల్ రాకుండా పోయిందని అన్నారు. మండలంలో ప్రభుత్వ భూమిని అందినంత దోచుకున్నారని, పేదల భూములను వాళ్ళ ఖాతాల్లోకి వేసుకున్నారని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో గంజాయి అక్రమ భూదందాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయి అన్నారు. గతంలో భూ పంపిణీ చేసింది కాంగ్రెస్ పార్టీ అని, అదే రకంగా మళ్ళీ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల ప్రక్షాన పనిచేస్తుందని, ఆయన ఆదేశాలతో భూముల సర్వేకు శ్రీకారం చుట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్, ఏం సి వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మోర లక్ష్మీరాజం, మోర రాజు, శ్రీకాంత్ గౌడ్, రాజేశ్వరరావు, బైరి రమేష్, లింగం రాణి, పెద్దూరి తిరుపతి, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, చెక్కుల జాడేది..?

**అధికారుల అలసత్వం వల్ల ఆగిన చెక్కులు**

**ట్రెజరీ నుండి డబ్బులు మంజూరయిన..పంపిణీ ఏది?**

**పేదలకు అందని ద్రాక్ష లాగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు**

**రెవిన్యూ డివిజన్ స్థాయిలో ఆగిన చెక్కులు**

**మర్రిగూడ, డిసెంబర్ 25,( జనం సాక్షి)**



కళ్యాణ లక్ష్మి చెక్కుల జాడేది... పేదలకు అందని ద్రాక్ష లాగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మునుగోడు నియోజకవర్గవ్యాప్తంగా కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులు దాదాపు 600 నుండి 1000 వరకు లబ్ధిదారులు ఉన్నట్లు అంచనా, కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ఒక లబ్ధిదారునికి ఒక లక్ష 116 రూపాయలు ట్రెజరీ నుండి డబ్బులు లబ్ధిదారులకు మంజూరైన అయినా చెక్కులు ముద్రించి పంపిణీ చేయని అధికారులు, ఒక్క మర్రిగూడ మండలంలోని దాదాపు 150 మంది వరకు లబ్ధిదారులు ఉన్నట్లు అంచనా, ఇందులో 130 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం నుండి డబ్బులు మంజూరయ్యాయి, అధికారులు చెక్కులు ముదిరించి లబ్ధిదారులకు పంపిణీ చేయవలసి ఉంటుంది, కానీ అధికారులు చెక్కులు ముదిరించి పంపిణీ చేయకుండా ఆపడం వెనుక గలకారణం ఏమిటో తెలియదు, పేద ప్రజలకు వివాహానికి అధిక ఇబ్బందుల నుంచి కొంతవరకు ఉపశమనం కలిగించడానికి గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తుంది, అయితే కొత్తగా ఎన్నికల హామీలు కాంగ్రెస్ ప్రకటించిన లక్ష రూపాయల నగదు తో పాటు తులం బంగారం జాడ మాత్రం కనబడడం లేదు, పాత పద్ధతిలో అయినా సమయానికి నిరుపేదలకు అందవలసిన ఆర్థిక సహాయాన్ని అందించి పేద ప్రజలను ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు,



**కొన్ని సాంకేతిక కారణాల వల్ల... : శ్రీదేవి, చండూర్ ఆర్డీవో**

కళ్యాణ లక్ష్మి పథకం బిల్లులు చేసి పంపినాము. బీసీ లబ్ధిదారుల బిల్లులు మంజూరైనాయి. కానీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బిల్లులు వేరే డిడిఓ అకౌంట్లో తప్పుగా జమైనాయి. పై అధికారులకు ఈ విషయాన్ని రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినాము. ఆ డబ్బులు తిరిగి వచ్చిన వెంటనే కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు మంజూరు చేస్తాము.

# వెట్టి చాకిరి చేస్తున్న కార్మికులకు ముక్తి కల్పించండి

**మున్సిపల్ కార్యాలయంలో దిష్టిబొమ్మగా మారిన జెసిబి**

**తాండూరు డిసెంబర్ 25 (జనం సాక్షి) :**



మున్సిపల్ లో నెలకొన్న సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని 20 వార్డు కౌన్సిలర్ సంగీత అజయ్ సింగ్ ఠాకూర్ పేర్కొన్నారు.మున్సిపల్ చైర్పర్సన్ తాటికొండ స్వప్న నివాసంలో వెట్టి చాకిరి చేస్తున్న మున్సిపల్ కార్మికులకు విముక్తి కల్పించాలని 20వార్డు కౌన్సిలర్ సంగీత అజయ్ సింగ్ ఠాగూర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డుల సమస్యలు గాలికి వదిలి మున్సిపల్ చైర్ పర్సన్ నివాసంలో కార్మికులకు పని కల్పించడం ఏమిటని ప్రశ్నించారు. వార్డులను వదిలేసి వాళ్ళింట్లో పని చేయించుకుంటున్న చైర్ పర్సన్ రిజిస్టర్లు చెక్ చేసి ఏం చేయాలను కుంటున్నారు. జవాన్లకు మరియు వర్కర్లపై పెత్తనంచేస్తూ చేసుకుంటూ వాళ్లపై ఇష్టానుసారంగా వ్యవహరచడం సరికాదన్నారు. వార్డులలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. శానిటేషన్ కానీ ఇంకా ఇతర విషయాలపై చాలా సమస్యలు ఉన్నాయి. వాటిని ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు.దోమల బాధతో ప్రతి పౌరుడు ఇక్కడ ఇబ్బంది పడుతు అనారోగ్యానికి గురి అవుతున్నారు . డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, టైఫాయిడ్ లాంటి విష జ్వరాలు వచ్చి చావు బతుకుల మధ్యలో ప్రజలు అతలాకుతులమవుతున్నారు. వార్డులో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మాయమైన జేసిబి తిరిగి మునిసిపాలిటీకి వచ్చింది. జెసిబి నీ కేవలం అలంకారప్రాయంగా మున్సిపాలిలో నిలపడమేమిటని అన్నారు. ఆరే దీపానికి వెలుగు ఎక్కువ అనే రీతిలో ఆమె పనిచేస్తుందని విమర్శించారు. దౌర్జన్యాలు అక్రమాలు చేసుకుంటూ వెళ్లడమే తప్ప ప్రజల సమస్యలు పట్టించుకునే పాపను పోలేదని మండిపడ్డారు. సమస్యలను ఎలా తీర్చాలి అనే దానిపైన ధ్యాస లేదు కేవలం అధికారులపై దుర్వినియోగం చేస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడంపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలు తీర్చడానికి ఖర్చు పెడతామని దానిపైన ధ్యాస లేదు.జెసిబిని దిష్టిబొమ్మలా అలంకరణకు మునిసిపాలిటీలో పెట్టుకోవడం కాకుండా తక్షణమే వార్డులలో ఉన్న మురికి కాలువలను క్లీన్ చేయడానికి వినియోగించాలన్నారు. ఎమ్మెల్యే తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# ఉపరాష్ట్రపతితో ప్రశంసలు అందుకున్న అభ్యుదయ రైతు

**మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 25( జనం సాక్షి ):**



జిల్లాలోని కొల్చారం మండలం చిన్నాగంపూర్ గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు నరేందర్ రెడ్డి భారత ఉపరాష్ట్రపతి జగదీప్ దంకర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. కౌడిపల్లి మండలం తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్న రైతులు హాజరయ్యారు. వారి వారి అనుభవాలను తెలియపరిచారు. కొల్చారం మండలం చిన్నగన్పూర్ రైతు నరేందర్ రెడ్డి ని అభినందించిన ఉపరాష్ట్రపతి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవర్మ, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# కేంద్ర మాజీ మంత్రి మల్లికార్జున్ కు ఘన నివాళి

**హైదరాబాద్, డిసెంబర్ 25 (జనం సాక్షి)**



మాజీ కేంద్ర మంత్రి, ఏపీసీసీ అధ్యక్షుడు డాక్టర్ మల్లికార్జున్ 22వ వర్ధంతిని పురస్కరించుకొని మహబూబ్ నగర్ లోని ఆయన విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. దేశ అభివృద్ధికి చేసిన కృషిని, రక్షణ శాఖ సహాయ మంత్రిగా, రైల్వే శాఖ సహాయ మంత్రిగా చేసిన సేవలను ప్రస్తావించారు. 1969 తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి నేతగా ఆయన ప్రస్థానం, ఆ తర్వాత ఏపీసీసీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేసిన కృషి, మహబూబ్నగర్ పార్లమెంటరీ నియోజకవర్గ అభివృద్ధిలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ, పీవీ నరసింహరావు నాయకత్వంలో కేంద్ర మంత్రిగా సేవలు అందించారు. తెలంగాణ కోసం కాంగ్రెస్ ఫోరమ్ ఫర్ తెలంగాణకు నాయకత్వం వహించారు. 2002 డిసెంబర్ 24న ఆయన మృతి చెందారు. అయినా, తెలంగాణ సాధనకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. ఆయనకు నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీ వంశీచంద్ రెడ్డి, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గురునాథ్ రెడ్డి, మల్లికార్జున్ కుమారుడు మనూ మల్లికార్జున్, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఒబైదుల్లా ఖోత్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు పాడి పంటలతో సుబిక్షంగా జీవించాలి

**ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**పాలకుర్తి, డిసెంబరు 25 (జనంసాక్షి)**



పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు పాడి పంటలతో, సుఖ సం తోషాలతో సుభిక్షంగా జీవించాలని శ్రీ రమా సత్యనారాయణ వ్రతం నిర్వహించినట్లు స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి,- రాజా రామ్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ హనుమాన్ల ఝాన్సీ రెడ్డి- డాక్టర్ రాజేందర్ రెడ్డి దంపతులు పండితుల వేద మంత్రోచ్ఛరణల ముద్య సత్యనారాయణ వ్రతాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ ఈ వ్రతం చేయడం వల్ల ఈ ప్రాంత ప్రజల జీవితాలు అన్ని రంగాల్లో మెరుగ్గా ఉండాలని, వ్యవసాయం పాడిపంటలతో విరజిల్లాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని, రాజకీయ రంగంలో రాణించాలని, ఈ వ్రతాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, మార్కెట్ చైర్పర్సన్ లావుడ్యా మంజుల, వైస్ చైర్మన్ అనుముల మల్లారెడ్డి, బాస్కర్, ఎర్రబెల్లి రాఘవరావు తదితరులు ఉన్నారు. మండలంలోని వల్మీడీ గ్రామంలోని పురాతన ఉమామహేశ్వర ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం కన్నుల పండుగగా వేద బ్రాహ్మణ మంత్రోచ్ఛరణల నడుము అంగరంగ వైభవంగా నిర్వహించారు.



జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
26 డిసెంబర్ 2024

## ప్రేమకు, శాంతికి ప్రతిరూపం క్రిస్మస్



నల్లగొండ బ్యూరో, డిసెంబర్ 25 (జనంసాక్షి) : ప్రేమకు, శాంతికి ప్రతిరూపం క్రిస్మస్ అని రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.క్రిస్మస్ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు, నల్గొండ జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.బుధవారం మంత్రి నల్గొండ జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్ లో ఉన్న చర్చి, సెంటేనరీ బిషప్ చర్చిలో, అలాగే క్లాక్ టవర్ వద్ద ఉన్న చర్చిలలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు నిర్వహించుకుంటున్న క్రిస్మస్ కు ఎంతో ప్రత్యేకత ఉందని,క్షమించే గుణం ఉన్నవారు క్రైస్తవులని,వారందరూ పేదలకు ఉచిత సహాయం చేస్తారని,ప్రేమకు, శాంతికి ప్రతిరూపం క్రిస్టమస్ అని అన్నారు.ఏసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ పాటిస్తే హింసకుతావులేదని,శాంతి, ప్రేమ మాత్రమే ఉంటుందని అన్నారు. క్రిస్మస్ సందర్భంగా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు.జిల్లాలోని ప్రజలందరూ క్రిస్మస్ వేడుకలను సుఖ,సంతోషాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. జీసస్ క్రిస్ట్ ప్రపంచానికి ఒక గొప్ప సందేశం ఇచ్చారని,క్రిస్మస్ సందర్భంగా అందరికి మంచి జరగాలని ఆమె ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మంత్రి క్లాక్ టవర్ వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్ ను ప్రారంభించారు.ఈ కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,చర్చి ఫాదర్ జోసెఫ్ రెడ్డి, బిషప్ తదితరులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు నిరుత్సాహమేనా..?

- శివన్నగూడ, లక్ష్మణాపురం రిజర్వాయర్ భూ నిర్వాసితుల దీన గాధ....
- పాలకులకు పట్టని భూ నిర్వాసితుల సమస్యలు
- ఇంకా రాని భూ నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఇండ్ల స్థలాలు
- మల్లన్న సాగర్ ప్యాకేజీ శివన్నగూడ, లక్ష్మణపురం నిర్వాసితులకు దక్కేనా..?
- ఇబ్రహీంపట్నం సమీపంలో ఇండ్ల స్థలాల వాగ్దానం ఏమైంది..?

భూ నిర్వాసితుల త్యాగం ముందు.... మీరు ఇచ్చే నష్టపరిహారం ఎంత, ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం కోల్పోయి, పుట్టిన ఊరును అపురూపంగా కట్టుకున్న ఇంటిని, అన్నం పెట్టిన వ్యవసాయ భూమిని కూడా వదులుకోవాల్సి వచ్చింది. అలాంటి భూ నిర్వాసితులకు అండగా ఉండవలసిన ప్రభుత్వం వారి సమస్యలను గాలికి వదిలేసింది..



మర్రిగూడ, డిసెంబర్ 25 (జనంసాక్షి)
మర్రిగూడ మండలంలోని నర్సిరెడ్డిగూడెం, చర్లగూడెం, వెంకెపల్లి, తండాలు పూర్తిగా కూడా కనుమరుగు కానున్నాయి. శివన్నగూడ, లక్ష్మణాపురం రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు భూనష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజ్ ఇండ్ల స్థలాలు అందని ద్రాక్షలాగే మిగిలాయి. ప్రభుత్వ కార్యాలయం వెంబడి చెప్పులు అరిగే విధంగా తిరిగినా వారి సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ఇంతవరకు రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందలేదంటే పాలకుల పని ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం మానేసింది. భూ నిర్వాసితులకు ఇచ్చే ఇండ్ల స్థలాలు కూడా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో ఇళ్ల స్థలాలు ఇప్పిస్తా అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని భూ నిర్వాసితులు కోరుతున్నారు.
ప్రజా ప్రభుత్వం శివన్నగూడ, లక్ష్మణపురం రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఒక ఎకరం భూమికి నష్టపరిహారం 4 లక్షల పదిహేను 15 వేలు నష్టపరిహారం మాత్రమే ఇచ్చారు. కానీ మల్లన్న సాగర్ భూ నిర్వాసితులకు మాత్రం ఎకరానికి ఏడు లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఇచ్చింది. అదే తరహాలో శివన్నగూడ, లక్ష్మణపురం భూ నిర్వాసితులకు కూడా మల్లన్న సాగర్ తరహాలో నష్టపరిహారం ఇవ్వాలని నిర్వాసితులు కోరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మల్లన్నసాగర్ తరహా నష్టపరిహారాన్ని శివన్నగూడ, లక్ష్మణాపురం భూ నిర్వాసితులకు కూడా ఇప్పిస్తానని ఇప్పుడున్న నాయకులు హామీ ఇచ్చారు. ఇప్పుడు ప్రభుత్వం ఏర్పడింది. కాబట్టి ఆ విధమైన ఆలోచన చేయాలని ప్రజలు కోరుతున్నారు. వీలైనంత తొందరగా భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి రావాల్సిన అన్ని రకాల నష్టపరిహారాలు ఇవ్వాలని భూ నిర్వాసితులు కోరుతున్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులు కనుమరుగు...?

- వచ్చిన చెక్కులు ఆపమన్నది ఎవరు..?
- ట్రెజరీ నుండి డబ్బులు మంజూరు అయినా.... చెక్కులు పంపిణీ చేయని అధికారులు
- చెక్కులు ఆపడం వెనుక కారణమైంది....
- పేదలకు అందని ద్రాక్ష లాగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- ఎవరి స్వార్థం కోసం చెక్కులు ఆపారు.... ఇందులో ఉన్న రాజకీయ కోణం ఏంది?



మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులు దాదాపు 600 నుండి 1000 వరకు లబ్ధిదారులు ఉన్నట్లు అంచనా. కళ్యాణలక్ష్మి పథకం ద్వారా ఒక లబ్ధిదారునికి ఒక లక్ష 116 రూపాయలు ట్రెజరీ నుండి డబ్బులు లబ్ధిదారులకు మంజూరైన అయినవి. కానీ చెక్కులు ముద్రించి పంపిణీ చేయడం లేదు అధికారులు.

మర్రిగూడ, డిసెంబర్ 25 (జనంసాక్షి)
ఒక్క మర్రిగూడ మండలంలోని దాదాపు 150 మంది వరకు లబ్ధిదారులు ఉన్నట్లు అంచనా. ఇందులో 130 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం నుండి డబ్బులు మంజూరయ్యాయి. అధికారులు చెక్కులు ముదిరించి లబ్ధిదారులకు పంపిణీ చేయవలసి ఉంటుంది, కానీ అధికారులు చెక్కులు ముదిరించి పంపిణీ చేయకుండా ఆపడం వెనుక గలకారణం ఏమిటో తెలియదు, పేద ప్రజలకు వివాహానికి అధిక ఇబ్బందుల నుంచి కొంతవరకు ఉపశమనం కలిగించడానికి గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. అయితే కొత్తగా ఎన్నికల హామీలు కాంగ్రెస్ ప్రకటించిన లక్ష రూపాయల నగదుతో పాటు తులం బంగారం జాడ మాత్రం కనబడడం లేదు, పాత పద్ధతిలో అయినా సమయానికి నిరుపేదలకు అందవలసిన ఆర్థిక సహాయాన్ని అందించి పేద ప్రజలను ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎక్సైజ్‌శాఖలో బదిలీలు ఎప్పుడో...?

- ఏళ్ల తరబడి ఒకటే చోట పోస్టింగ్
- ప్రభుత్వానికి ఆదాయం సమకూరుస్తున్న తమపై చిన్న చూపు ఎలా..?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ బదిలీల అవకాశం ఇచ్చి బదిలీ చేసింది కానీ ఒక్క ఎక్సైజ్ శాఖలో ఏ కారణం చేతనో కానీ మాత్రం బదిలీలకు అవకాశం కల్పించలేదు గతంలో 2018లో నిర్వహించిన బదిలీల ప్రక్రియ 2024 ముగింపు నాటికి కూడా మళ్లీ బదిలీలు చేపట్టకపోవడంతో బదిలీలకు అవకాశం లేక కిందిస్థాయి ఎక్సైజ్ సిబ్బంది నాన ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు దాదాపుగా ఏడు సంవత్సరాలు పైగా ఒక్క దగ్గరే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో చాలామంది ఉద్యోగులు భార్యాభర్తలుగా వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నారు.




తుంగతుర్తి, డిసెంబర్ 25 (జనంసాక్షి)
ప్రభుత్వం ఒకవేళ బదిలీలకు అవకాశం కల్పిస్తే తాము కోరుకున్న ప్రాంతానికి బదిలీ కావచ్చనే ఉద్దేశంతో ఎక్సైజ్ సిబ్బంది ఆశపడుతున్న ప్రభుత్వం మాత్రం బదిలీలకు అవకాశం కల్పించకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. కానీ ఎక్సైజ్ శాఖలో సీఐ ఎస్ఐ లను బదిలీ చేసుకునే అవకాశం కల్పించి తమకు మాత్రం బదిలీ ఆకాశ కల్పించడంలో ఇబ్బందులు ఏముంటాయని ఆ శాఖలో పనిచేస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్స్ ప్రశ్నిస్తున్నారు. ఇదే అవకాశంగా తీసుకొని కొందరు అనారోగ్య కారణాలు చూపించి పై అధికారులకు డబ్బులు ఖర్చు చేసి అక్రమాలకు తెర తీస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో డిప్యూటేషన్‌పై వెళ్లిన సిబ్బంది సంవత్సరాల తరబడి అక్కడే పని చేస్తున్నారు. దీంతో తమపై పని భారం పడుతుందని ముఖ్యంగా రైడ్స్ విషయంలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన చెందుతున్నారు . ఇవన్నీ ఎక్సైజ్ ఉన్నతాధికారులకు తెలిసిన తెలియనట్లు వ్యవహరిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రతి ఎక్సైజ్ సర్కిల్ లో కొంతమంది డిప్యూటేషన్ పై వెళ్లినట్లు సమాచారం. దీంతో తమపై అదనపు భారం పడిందని వాపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో 250 పైగా కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. తాము ఏళ్ల తరబడి ఎలాంటి బదిలీలు లేకుండా ఒకే చోట పని చేస్తున్నావని దీంతో తాము ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు ఈ విషయాలన్నీ ఉన్నతాధికారులకు తెలిపిన పట్టించుకోవడంలేదని అంటున్నారు ఒకపక్క సామాజిక సమస్య అయిన గుడుంబా నాటు సారాయిని అరికట్టుతో ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తున్న తమను ఇప్పటికైనా ఉన్నతాధికారులు గుర్తించి స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఎక్సైజ్ శాఖలో బదిలీలు నిర్వహించి న్యాయం చేయవలసిందిగా ఎక్సైజ్ సిబ్బంది కోరుతున్నారు.

## మాతా శిశు సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత





- మార్చిలోగా క్రిటికల్ కేర్ యూనిట్‌ను పూర్తి చేస్తాం
- హైదరాబాద్ తర్వాత అత్యంత జనాభా గల జిల్లా నల్లగొండ
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్లగొండ బ్యూరో, డిసెంబర్ 25 (జనంసాక్షి) : నవజాత శిశు సంరక్షణలో భాగంగా ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సుమారు 30 లక్షల రూపాయల వ్యయంతో నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో అధునాతన సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్డు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం అయన ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఒక్కొక్కటి 90 వేల రూపాయల విలువ చేసే15 నైస్ నియోటెక్ వార్మర్లను,ఒక్కొక్కటి 30 వేల రూపాయల విలువ కలిగిన10 నియో ఫోటో తెరఫీ సింగిల్ సర్ఫేస్ యూనిట్లను,రెండు లక్షల 50 వేల రూపాయల విలువ కలిగిన10 ఆకాష్ సైరింగ్ పంపులను, నాలుగున్నర లక్షల రూపాయల విలువ కలిగిన 5 నెల్ కార్ పల్స్ ఆక్సో మీటర్లను,5 లక్షల రూపాయల విలువ కలిగిన. 2 ట్రాన్స్యూటేనియస్ బిలురుబినేటర్లు,100 మిట్టర్లు,100 బూటీలు,200 స్వద్దేస్ బ్లాంకెట్లు,4 బబుల్ సిపిఎపి కంప్రెసర్లు,మూడు నియోనటల్ రెస్యూటేషన్ కిట్లు,ఎన్ఐబిపి నాలుగు యూనిట్లు,13 లీటర్ల ఆటో క్లావే,4 రూమ్ టెంపరేచర్ థర్మామీటర్లు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగింది.అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత అతిపెద్ద జనాభా కలిగిన జిల్లా నల్గొండ అని అన్నారు.జిల్లా ప్రభుత్వ ప్రధానాస్పత్రికి ప్రతిరోజు 1500 మంది అవుట్ పేషెంట్లు, వెయ్యి మందికి పైగా ఇన్ పేషెంట్లు వస్తారని,ఇక్కడ ప్రతి నెల 600 డెలివరీలు అవుతాయని చెప్పారు. 12 సంవత్సరాల క్రితం తాను ఎం ఎల్ ఏ గా ఉన్న సమయంలో నవజాత శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, తిరిగి మళ్ళీ ఇప్పుడు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సుమారు 30 లక్షల రూపాయల విలువ కలిగిన అధునాతన పరికరాలు నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అప్పుడే పుట్టిన పిల్లలకు జాండీస్ రావడం,తక్కువ బరువుతో పుట్టడం, తల్లిపాలు తీసుకోలేకపోవడం, అలాగే తల్లులు పిల్లలకు వివిధ కారణాలవల్ల వెంటనే పాలు ఇవ్వలేకపోవడం వంటి వాటన్నిటిని కొత్తగా ఏర్పాటు చేసే ఈక్విప్మెంట్ ద్వారా అధిగమించవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు డెలివరీలతో పాటు,చిన్నపిల్లలకి అత్యవసర వైద్య చికిత్సలు అందించడం వల్ల 60 నుండి 70 వేల రూపాయల ఖర్చు ను మిగిలించి పేదవారికి ఉపయోగపడవచ్చు అని తెలిపారు.నూతనంగా నిర్మిస్తున్న కొత్త భవనంలో ఒక ఫ్లోర్ మొత్తం ప్రసవాల కోసం ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు.నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని పూర్తిగా ఉస్మానియా,నీలోఫర్ లాగా అవసరమైన సౌకర్యాలన్నీ ఏర్పాటు చేస్తామని,ప్రైవేట్ హాస్పిటల్లో లేనివిధంగా ఇక్కడ ఏర్పాటు చేయాలన్నదే తమ ఆలోచనని మంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా ఢిల్లీ నుండి పల్స్ ఆక్స్ మీటర్లు తెప్పిస్తున్నామని, అలాగే అదనంగా నాలుగు వెంటిలేటర్లు తెప్పిస్తున్నామని,బేబీ కేర్ యూనిట్లో 200 వెల్వెట్ టవల్స్ తెప్పిస్తున్నట్లు తెలిపారు. మార్చ్ లోగా క్రిటికల్ కేర్ యూనిట్ పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు. జిల్లాకు ఇటీవల అధునాతన 108 అంబులెన్స్ వాహనాలు వచ్చాయని,వాటిని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.వచ్చే వారం నుండి గురుకులాలను తనిఖీ చేస్తామని,విద్యార్థులకు కల్పించే సౌకర్యాలు,ఇతర వసతులను పరిశీలించనున్నట్లు మంత్రి వెల్లడించారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ వివిధ రకాల ఇన్ఫెక్షన్ల వల్ల నవజాత శిశు వులకు ఇబ్బందులు కలుగుతుందని,అందువల్ల వారి ఆరోగ్య సంరక్షణలో భాగంగా నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోనవజాత శిశు సంరక్షణ కేంద్రంలో వివిధ రకాల సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేయడం పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు.ముఖ్యంగా 20 బేబీ వార్మింగ్ మిషిన్లు,10 ఫోటో తెరఫీ యూనిట్లు,రెండు హాస్పిటల్ గ్రేడ్ బ్రెస్ట్ పంపులు,మిల్క్ ఎక్స్ప్రెషన్స్ వంటి ఏర్పాటు చేయడం వల్ల అప్పుడే పుట్టిన పిల్లలకు ఎంతో మేలు కలుగుతుంది అన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు చాలా అవసరమని, మొదటిసారిగా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఈ బ్రెస్ట్ పంపులు ఏర్పాటు చేశామని,అలాగే చిన్నపిల్లల ఐసీయూ ను 50 పడకలకు నుండి 80 కి పెంచడం జరిగిందని,అంతేకాక రోగుల సహాయకుల కోసం వెయిటింగ్ రూమ్ మంజూరు చేయడం జరిగిందని,40 స్క్వేర్ ఫీట్ లో క్రిటికల్ కేర్ యూనిట్ను నిర్మిస్తున్నామని దీనివల్ల అంటినేటల్ చెకప్ లు,టెస్టులు నిర్వహించవచ్చని కలెక్టర్ తెలిపారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్,చిన్న పిల్లల విభాగం అధిపతి డాక్టర్ వందన, ఇన్చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్ తదితరులు ఉన్నారు.

## ఊరూరా, వాడవాడల క్రిస్మస్ వేడుకలు







వేములపల్లి/మాడ్గులపల్లి, డిసెంబర్ 25 (జనంసాక్షి) : ఏసుక్రీస్తు జన్మించిన రోజు క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించే క్రిస్మస్ పర్వదిన వేడుకలను బుధవారం వేములపల్లి, మాడ్గులపల్లి మండలాల్లోని వివిధ గ్రామాలలోని పలు చర్చిలలో ఘనంగా నిర్వహించారు. వేములపల్లి మండల కేంద్రంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రిస్టియన్ సొదరసోదరీమణు లందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిన్ను నువ్వు ప్రేమించినట్టుగానే పొరుగువారిని ప్రేమించమని క్రీస్తు ప్రబోధనల్లో సమస్త అంశాలు సంక్షిప్తమై ఉన్నాయన్నారు.
అన్ని మతాల సారాంశం మానవత్వమేనని, ఆయన ఎంచుకున్న మార్గం అందరికీ దిక్సూచిగా నిలుస్తుందనిపేర్కొన్నారు. ఇతరుల పట్ల ప్రేమ, సహనం, శాంతి, సేవాభావం వంటి గొప్ప గుణాలను ఆచరించాలని క్రిస్మస్ వేడుకలో పాల్గొనడం చాలా సంతోషంగా వుందన్నారు. దళిత క్రిస్టియన్ల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతుందన్నారు. మాడ్గులపల్లి మండలం తోపుచర్ల గ్రామంలోని బాప్టిస్ట్ చర్చి, న్యూ జేరుసెలం చర్చి, గెత్సేమన్ ప్రార్థన మందిరంలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో దైవజనులు పాస్టర్లు సూర్యనాయక్, తీగల జాన్ శాస్రి, వేముల రాము-జెకర్యా క్రైస్తవులతో కలిసి మిర్యాలగూడ ఎమ్మెల్యే బిఎల్ ఆర్ అందించిన క్రిస్మస్ కేక్‌లను కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ వేడుకలు పురస్కరించుకొని చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి, మాడ్గులపల్లి తాజా మాజీ ఎంపీపీలు పుట్టల సునీత కృపయ్య, పోకల శ్రీ విద్యా రాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాలి కాంతారెడ్డి, గడ్డం వేణుగోపాల్ రెడ్డి, మాడ్గులపల్లి తాజా మాజీ జెడ్పిటిసి పుల్లెంల సైదులు చింతమల ఆనంద్ కుమార్, వల్లపుదాసు యాకోబు, ప్రతాప్, బోప్పని శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పీఎఫ్ అకౌంట్ నుంచి డబ్బులు తీస్తున్నారా?






ఉద్యోగం చేసే అందరికీ పీఎఫ్ అకౌంట్ ఉంటుందన్న విషయం తెలిసిందే. దీనిని ఈపీఎఫ్ఓ నిర్వహిస్తుంటుంది. అయితే దీనిపై కేంద్రం వార్షిక ప్రాతిపదికన వడ్డీ చెల్లిస్తుంటుంది. మరి చాలా మంది పీఎఫ్ అకౌంట్ నుంచి డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు చూస్తుంటారు. అయితే ఈ సమయంలో మీరు చేసే కొన్ని మిస్టేక్స్‌తో ఆ డబ్బులు రాకపోవచ్చు.

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్.. ఉద్యోగం చేసే దాదాపు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఈపీఎఫ్ఓ ఆధ్వర్యంలో ఇది నడుస్తుంది. ఉద్యోగుల వేతనాల్లో నుంచి 12 శాతం పీఎఫ్ అకౌంట్‌కు బదిలీ అవుతుంది. ఇదే సమయంలో యాజమాన్యం కూడా అంతే మొత్తంలో పీఎఫ్ ఖాతాలో నగదు జమ చేయాల్సి ఉంటుంది. ఇక పీఎఫ్ ఖాతాలోని నగదుపై వడ్డీ వస్తుంది. కేంద్రం ప్రస్తుతం వార్షికంగా 8.15 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. పీఎఫ్ అకౌంట్లో నుంచి డబ్బులు విత్‌డ్రా చేసుకోవచ్చు. వేర్వేరు కారణాలతో ఫలానా దానికి ఇంత శాతం అని ఉంటుంది. దీనిని నేరుగా ఈపీఎఫ్ఓ మెంబర్స్ పోర్టల్ ద్వారా అప్లై చేసుకోవచ్చు. అయితే మీరు చేసే కొన్ని చిన్న చిన్న పొరపాట్లతో మీ అప్లికేషన్ తిరస్కరణకు గురికావొచ్చు. అవేంటో చూద్దాం.

మీరు క్లెయిమ్‌లో పేర్కొన్న సమాచారం .. ఈపీఎఫ్ డేటాబేస్‌లో ఉన్న దానితో సరిపోలకపోవచ్చు. అప్పుడు ఆ క్లెయిమ్ తిరస్కరణకు గురవుతుంది. అందుకే మీరు డీటెయిల్స్ అన్నీ ఎంటర్ చేశాక.. ఒకసారి క్రాస్ చెక్ చేసుకోవడం మంచిది. ఎక్కువగా ఇది పేరు, పుట్టిన తేదీ, జాయినింగ్ తేదీ, సంస్థను వీడే తేదీ, బ్యాంక్ అకౌంట్ నంబర్, ఇ-కేవైసీ సరిగా లేకపోవడం వంటి కారణాలతో మీ క్లెయిమ్ తిరస్కరణకు గురవుతుందని చెప్పొచ్చు. ఈపీఎఫ్ విత్‌డ్రాయల్ క్లెయిమ్ రిజెక్ట్ అయ్యేందుకు కారణాలేంటి? వీటిని ఎలా కరెక్షన్ చేసుకోవాలో చూద్దాం. ఈపీఎఫ్ రికార్డుల్లో ఆధార్ కార్డులో ఉన్న మాదిరి పేరు ఉంటుంది. అది మీరు క్లెయిమ్‌లో సరిగా పేర్కొన్నారో లేదో తెలుసుకోవాలి. ఒకవేళ మీ పేరులో మిస్టేక్ ఉన్నట్లయితే మీరు జాయింట్ డిక్లరేషన్ సమర్పించాలి. డేట్ ఆఫ్ బర్త్‌లో మిస్‌మ్యాచ్ అయితే కూడా క్లెయిమ్ తిరస్కరిస్తుంది ఈపీఎఫ్ఓ. అప్పుడు ఈపీఎఫ్ఓ రికార్డుల్లో లేదా ఆధార్‌లో ఉన్న మాదిరిగా పుట్టిన తేదీని అప్‌డేట్ చేసుకోవడం మంచిది. ఈపీఎఫ్ఓ రికార్డుల్లో మీ కేవైసీ పూర్తి చేసుకోవాలి. అంటే మీ నో యువర్ కస్టమర్ ప్రాసెస్ పూర్తయితేనే క్లెయిమ్ యాక్సెప్ట్ చేస్తుంది. మీ భాగస్వామి కాకుండా వేరొకరితో కలిసి జాయింట్ బ్యాంక్ అకౌంట్ ఉన్న పక్షంలోనూ పీఎఫ్ క్లెయిమ్ తిరస్కరణకు గురికావొచ్చు. ఈపీఎఫ్ఓ .. ఇండివిడ్యువల్ బ్యాంక్ అకౌంట్ లేదా మీ జీవిత భాగస్వామితో కలిసి ఉన్న జాయింట్ బ్యాంక్ అకౌంట్లో డబ్బులేస్తుంది. బ్యాంక్ అకౌంట్ వివరాలు కూడా సరిగా ఉండాలి. వీటిల్లో బ్యాంక్ అకౌంట్ నంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, బ్యాంక్ పేరు, బ్రాంచ్ డీటెయిల్స్ సరిపోలాలి. విలీనం కారణంగా బ్యాంక్ పేరు లేదాలో ఏదైనా మారితే క్లెయిమ్ చేయకముందే ఈపీఎఫ్ఓ రికార్డుల్లో వాటిని అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఆధార్ కార్డుతో ఈపీఎఫ్ఓ లింక్ చేయని పక్షంలో కూడా క్లెయిమ్ రిజెక్ట్ అవుతుంది. అందుకే ఈ ప్రక్రియ కూడా ముందే చేసుకోవడం ఉత్తమం. సంస్థలో చేరిన తేదీ.. సంస్థ నుంచి బయటికి వచ్చిన తేదీ వంటి వివరాలు కూడా సరిగా ఎంటర్ చేయాలి. వీటిల్లో ఏదైనా పొరపాట్లు ఉంటే సదరు సంస్థను సంప్రదించి వివరాలు అప్డేట్ చేసుకోవాలి. విత్‌డ్రాయల్ ఫారం కూడా సరైనది ఎంచుకోవాలి. రాంగ్ అప్లికేషన్ ఫాంతో మీ క్లెయిమ్ తిరస్కరణకు గురవుతుంది.

# 2025లో డబ్బు పరంగా తప్పులు అస్సలు చేయొద్దు..!

కొత్త ఏడాది 2024 మరికొన్ని రోజుల్లోనే ప్రారంభం కానుంది. గత ఏడాదిలోని తప్పులను సరిదిద్దుకుని కొత్త ఏడాదిలో ఆర్థికంగా ముందుగు వెళ్లాలని చాలా మంది ప్లాన్ చేసుకుంటారు. అలా మీరు కూడా ఈ కొత్త ఏడాదిలో అస్సలు చేయకూడని 6 తప్పులు ఉన్నాయి.

2024 చివరి నెల అప్పుడే సగం రోజులు అయిపోయాయి. మరో 15 రోజుల్లో 2024 కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. చాలా మంది కొత్త ఏడాదిలో కొత్త లక్ష్యాలు పెట్టుకుంటారు. వాటిని సాధించేందుకు ప్రణాళికలు రచిస్తుంటారు. ఆర్థికంగా గత ఏడాదిలో చేసిన తప్పులను సరిచేసుకుని ముందుకు వెళ్లాలనుకుంటారు. మరి మీరు 2024లో నిర్దేశించుకున్న ఆర్థిక లక్ష్యాలు చేరుకున్నారా? లేదా? అనేది ఓసారి పరిశీలించుకోండి. ఆర్థిక పరంగా తీసుకున్న నిర్ణయాల్లో మంచి, చెడులు విశ్లేషించుకోండి. అప్పుడే కొత్త ఏడాదిలో ఆర్థిక లక్ష్యాలను అందుకునే అవకాశాలు మెరుగవుతాయి. డబ్బుల విషయంలో 2025లో కచ్చితంగా చెక్ పెట్టాల్సిన ఈ 6 కామన్ ఫైనాన్షియల్ మిస్టేక్స్ గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం.

రుణం తీసుకోవడం అనేది ఎప్పటికీ ఒక భారమే. మీరు ఏదైనా లోన్ తీసుకుని ఉంటే 2025లో దానిని తీర్చేయాలనే లక్ష్యం పెట్టుకోండి. ఆ లోన్ క్లియర్ చేయడం వల్ల నెల వారీ ఆర్థిక భారం నుంచి విముక్తి లభిస్తుంది. సకాలంలో చేసే లోన్ రీపేమెంట్లు మీ క్రెడిట్ స్కోర్‌ను మెరుగుపరుస్తాయి. అది ఒత్తిడిని తగ్గిస్తుంది.

ఇన్సూరెన్స్ విస్మరించడం మంచిది కాదు.. ఇంటి పెద్ద దురదృష్టవశాత్తు మరణిస్తే అతనిపై ఆధారపడిన కుటుంబానికి లైఫ్ ఇన్సూరెన్స్ అనేది ఆర్థిక భరోసా కల్పిస్తుంది. హెల్త్ ఇన్సూరెన్స్ వైద్య ఖర్చులను భర్తీ చేస్తుంది. అందుకే ప్రతి ఒక్కరికీ ఈ రెండూ చాలా కీలకం. ఇప్పటి వరకు ఎలాంటి ఇన్సూరెన్స్ లేకపోతే 2025లో అయినా ఈ పాలసీలు తీసుకోండి.



ట్యాక్స్ ప్లానింగ్‌లో నిర్లక్ష్యం.. ట్యాక్స్ లు చెల్లించడం ఆలస్యమైనా, గడువులోగా చెల్లించకపోయినా పెనాల్టీలు చెల్లించాల్సి వస్తుంది. ట్యాక్సుకు సంబంధించిన పనులు ముందే ప్లాన్ చేసుకుంటే అవకాశం ఉన్న ట్యాక్స్ సేవింగ్ అవకాశాలను అందుకోవచ్చు. వాయిదా వేయడం వల్ల అవసరమైన దానికంటే ఎక్కువ పన్నులు చెల్లించాల్సి రావచ్చు.

ఎమర్జెన్సీ ఫండ్.. ఒక్కోసారి ఊహించని ఖర్చులు ఎదురవుతుంటాయి. వాటిని తీర్చేందుకు ఎమర్జెన్సీ ఫండ్‌ను తప్పనిసరిగా పక్కన పెట్టుకోవాలి. మెడికల్ బిల్లులు, కారు రిపేర్లు సహా ఉద్యోగం కోల్పోయినప్పుడు ఎమర్జెన్సీ ఫండ్ ఆదుకుంటుంది. అత్యవసర సమయంలో క్రెడిట్ కార్డ్‌లు, బ్యాంకు రుణాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. అందుకే 3- 6 నెలల జీవన వ్యయానికి సరిపడా మొత్తాన్ని ఆదా చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలి.



గుడ్డిగా పెట్టుబడి పెట్టవద్దు..
భారీ లాభాలు పొందాలనే ఆశతో ఎలాంటి విషయాలు తెలుసుకోకుండానే గుడ్డిగా పెట్టుబడి పెట్టడం సరైన నిర్ణయం కాదు. దీనికి బదులుగా మీ లక్ష్యాలకు తగ్గట్లు సేఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్ మార్గాలను ఎంపిక చేసుకోవాలి. పదవీ విరమణ కోసం, ఇంటి కొనుగోలు కోసం, పిల్లల ఉన్నత చదువులు.. ఇలాంటి అవసరాలకు ప్రత్యేకంగా మనీ సేవ్ చేయాలనుకుంటే.. టైమ్ లైన్, రిస్క్ టాలరెన్స్‌కు సరిపోయే ఇన్వెస్ట్‌మెంట్‌లను సెలక్ట్ చేసుకోవచ్చు. ఎంత త్వరగా పదవీ విరమణ కోసం పొదుపు చేయడం ప్రారంభిస్తే.. మలి వయసులో ఆర్థికంగా అంతే బలంగా ఉంటారు. చిన్న వయస్సులో ఉన్నప్పటికీ, రిటైర్‌మెంట్ ప్లానింగ్ అస్సలు వాయిదా వేయకండి. ఈ విషయంలో మీరు వేసే ప్రతి చిన్న అడుగు దీర్ఘకాలంలో ఊహించని ఫలితాలను అందిస్తుంది.

# ఫారెన్ టూర్ వెళ్తున్నారా?

విహార యాత్రలకు వెళ్తున్నారా? ఏ దేశం వెళ్లాలి, ఎన్ని రోజులు ఉండాలి అనే అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారా? మరి విదేశాల్లో ఏదైనా అనుకోని కష్టం వస్తే ఆదుకునే ట్రావెల్ ఇన్సూరెన్స్ తీసుకోవడం మర్చిపోవద్దు. ప్రస్తుత రోజుల్లో విదేశీ టూర్లు వెళ్తున్న వారి సంఖ్య పెరిగింది. ఒక్కో సీజన్‌లో ఒక్కో దేశం వెళ్లి సరదాగా గడిపి వచ్చేందుకు ఇష్టపడుతున్నారు. అనుకున్నదే తడవుగా విమానం ఎక్కేస్తున్నారు. అయితే, విదేశాలకు వెళ్లినప్పుడు కొన్నిసార్లు మెడికల్ ఎమర్జెనీ ఎదురుకావచ్చు. కొన్నిసార్లు తమ విలువైన వస్తువులు పోగొట్టుకోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ఆదుకుని, ఆర్థిక నష్టాన్ని ట్రావెల్ ఇన్సూరెన్స్ భర్తీ చేస్తుంది. డిసెంబరు- జనవరి నెలల్లో ఈ ఇన్సూరెన్స్ అవసరం అధికంగా ఉంటుందని పలు నివేదికలు చెబుతున్నాయి. అంతే కాదు కొన్ని దేశాలకు వెళ్లాలంటే ప్రయాణ బీమా తప్పనిసరి కూడా. మరి అలాంటి ముఖ్యమైన ట్రావెల్ ఇన్సూరెన్స్ మర్చిపోవద్దు. మన దేశం నుంచి ప్రతి ఏటా వేలాదిమంది స్టూడెంట్స్, పర్యటకులు, వ్యాపారవేత్తలు విదేశాలకు వెళ్తుంటారు. వారి అవసరాలకు తగ్గట్టుగా ట్రావెల్ ఇన్సూరెన్స్ పాలసీలు అందుబాటులో ఉంటాయి. ఆరోగ్య అత్యవసర పరిస్థితి ఎప్పుడైనా రావచ్చు. అందుకు రక్షణ కల్పించే పాలసీ తీసుకోవాలి. అన్ని రకాల చికిత్సలకూ ఇది వర్తించాలి. సాధారణంగా ప్రయాణ బీమా తక్కువ ప్రీమియానికే లభిస్తాయి. ఒకేసారి కుటుంబం మొత్తానికి తీసుకోవచ్చు. ఒకే పాలసీతో ఎన్నో ప్రయాణాలకు ఉపయోగపడే విధంగానూ ఉంటాయి. ఇలాంటి పాలసీలు ముఖ్యంగా వ్యాపారవేత్తలకు సరిపోతాయని చెప్పవచ్చు. ఒకటికి మించి దేశాలకు ప్రయాణించే వారు ఆయా దేశాలన్నింటిలోనూ వర్తించేలా ఒకే పాలసీని తీసుకోవచ్చు. ఆర్థిక భద్రత.. ప్రయాణాల్లో చాలామందికి ఎదురయ్యే అనుభవం.. సరైన సమయానికి సామగ్రి అందకపోవడం.



ఇలాంటి సమయాల్లో ప్రయాణ బీమా వారికి నష్ట పరిహారం అందిస్తుంది. పర్యటకులూ తమ సామగ్రి అందకపోతే.. బీమా కంపెనీ ఇచ్చే పరిహారంతో కొత్త వాటిని కొనుగోలు చేయొచ్చు. విదేశీ ప్రయాణాలే కాకుండా, దేశీయంగా పర్యటించేటప్పుడూ ఈ బీమా పాలసీని కొనుగోలు చేయొచ్చు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంల ద్వారా ఇన్సూరెన్స్ పాలసీలను సులభంగా కొనుగోలు చేయొచ్చు. ఇన్సూరెన్స్ కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీకు కావాల్సిన విధంగా పాలసీని ఎంపిక చేసుకోవచ్చు. ప్రయాణ వ్యవధి, ఎంత మొత్తానికి బీమా కావాలి, ప్రయాణం రద్దు, ఆరోగ్య అవసరాల్లాంటివన్నీ పాలసీలో ఉండేలా చూసుకోవాలి. ఇన్సూరెన్స్ కంపెనీలు ఆయా దేశాల్లోని కొన్ని ఆసుపత్రులతో ఒప్పందం చేసుకొని ఉంటాయి. ఆ జాబితాను ఒకసారి చెక్ చేయాలి. ప్రయాణ బీమా తీసుకునేటప్పుడు మీ పర్యటన రోజులన్నింటికీ వర్తించేలా చూసుకోవాలి. ప్రయాణం ప్రారంభమై ఇంటికి తిరిగి వచ్చేదాకా పాలసీ కొనసాగేలా ఉండాలి. మినహాయి ంపులు, పరిమితులు ముందే తెలుసుకోవాలి. ముందస్తు వ్యాధుల చికిత్సకు వర్తిస్తుందా లేదా చూసుకోండి. కొన్ని ప్రాంతాలకు వెళ్లినప్పుడు ప్రత్యేక అవసరాలు ఉండొచ్చు. వాటికీ పాలసీ వర్తించేలా చూసుకోవాలి. ఏ క్షణమైనా మీకు సేవలను అందించేలా సహాయ కేంద్రాలు పనిచేస్తాయా? మీరు వెళ్లే ప్రాంతాల్లో ఎన్ని ఆసుపత్రులతో ఒప్పందాలున్నాయి అనే విషయాన్ని ముందే తెలుసుకోవడం మంచిది.


# సూర్యుడికి అతి సమీపంగా పార్కర్ ప్రోబ్..

## చరిత్ర సృష్టించనున్న నాసా స్పేస్‌క్రాఫ్ట్

పార్కర్ సోలార్ ప్రోబ్ చరిత్ర సృష్టించనున్నది. సూర్యుడిలోని కరోనా భాగానికి అత్యంత చేరువగా ఇవాళ ఆ స్పేస్‌క్రాఫ్ట్ వెళ్లనున్నది. డిసెంబర్ 27వ తేదీన మళ్లీ ఆ ప్రోబ్ నుంచి సిగ్నల్ వచ్చే అవకాశం ఉన్నది.

న్యూఢిల్లీ: నాసా ప్రయోగించిన పార్కర్ సోలార్ ప్రోబ్ స్పేస్‌క్రాఫ్ట్ ఇప్పుడు చరిత్ర సృష్టించనున్నది. ఆ స్పేస్‌క్రాఫ్ట్ సూర్యుడికి అత్యంత సమీపంగా వెళ్లనున్నది. అతిభయంకరమైన వాతావరణం, రేడియేషన్‌ను తట్టుకుని ఆ వ్యోమనౌక .. సూర్యడి సమీపానికి వెళు తున్నది. డిసెంబర్ 24వ తేదీన సూర్యుడి బహ్యావలయమైన కరోనాకు సమీపంగా పార్కర్ ప్రోబ్ వెళ్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే భగభగ మండే భానుడికి సమీపంగా ఉన్న కారణంగా.. ఆ స్పేస్‌క్రాఫ్ట్ నుంచి కొన్ని రోజుల పాటు సిగ్నల్స్ అందవని తెలిసింది. ఒకవేళ సూర్యడి అగ్నితాపాన్ని తట్టుకుంటే, ఆ స్పేస్‌క్రాఫ్ట్ డిసెంబర్ 27వ తేదీన మళ్లీ సిగ్నల్స్ పంపిస్తుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. కరోనా లేయర్‌కు సమీపానికి వెళ్లడం వల్ల సూర్యుడు ఎలా పనిచేస్తాడన్న అధ్యయనాన్ని మరింత లోతుగా విశ్లేషించే అవకాశాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. శతాబ్ధాలుగా సూర్యుడి గురించి ప్రజలు స్టడీ చేశారని, కానీ అతి సమీపం నుంచి ఆ వాతావరణాన్ని ఎవరూ అనుభవించలేదని నాసా శాస్త్రవేత్త డాక్టర్ నికోలా ఫాక్స్ తెలిపారు.

6 లక్షల 92 వేల కిలోమీటర్ల వేగంతో పార్కర్ ప్రోబ్ ప్రయాణిస్తోంది. సూర్యుడి కరోనాకు సమీపంగా వెళ్తున్న సమయంలో.. పార్కర్ ప్రోబ్ మెషిన్ సుమారు 982 డిగ్రీల సెల్సియస్ వేడిని తట్టుకోవాల్సి ఉంటుంది. 2018లో పార్కర్‌ను తొలిసారి ప్రయోగించారు. ఇప్పటికే ఆ స్పేస్‌క్రాఫ్ట్ 21 సార్లు సూర్యుడిని చుట్టేసింది. సుమారు 4.5 ఇంచుల కార్బన్ కంపోజిట్ షీల్డ్ ఉన్న పార్కర్ స్పేస్‌క్రాఫ్ట్.. చాలా వేగంగా కరోనాను తాకి మళ్లీ బయటి వాతావరణంలోకి రానున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కరోనా చాలా వేడిగా ఉంటుందన్న విషయం తెలిసిందే. కానీ ఎందుకు అక్కడ వాతావరణం అలా ఉందో తెలుసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఖగోళశాస్త్రవేత్త డాక్టర్ జెన్నిఫర్ మిల్లార్డ్ తెలిపారు. సూర్యుడి కేంద్రానికి 6.1 మిలియన్ల కిలోమీటర్ల దూరం నుంచి పార్కర్ ప్రయాణించనున్నది.



# గే జంటకు వందేళ్ల జైలుశిక్ష..



గే జంటకు వందేళ్ల శిక్ష వేసింది అమెరికా కోర్టు. దత్తత తీసుకున్న పిల్లల్ని రేప్ చేసినట్లు ఆ జంటపై ఆరోపణలు ఉన్నాయి. ఆ పిల్లలతో చైల్డ్ పోర్న్ వీడియోలు తీసినట్లు కూడా కోర్టులో తేలింది. స్వలింగ సంపర్కుల జంటకు అమెరికా కోర్టు వందేళ్ల జైలుశిక్ష వేసింది. పేరోల్ కూడా తీసుకునే ఛాన్స్ ఇవ్వలేదు. దత్తత తీసుకున్న కుమారులను .. లైంగికంగా వేధించిన కేసులో వాల్టన్ కౌంటీ జిల్లా అటార్నీ ఈ శిక్షను విధించారు. 34 ఏళ్ల విలియమ్, 36 ఏళ్ల జాచరి జులాక్ అనే ఇద్దరికీ ఈ శిక్ష పడింది. ఈ ఇద్దరూ 12, 10 ఏళ్లు ఉన్న ఇద్దరు సోదరుల్ని దత్తత తీసుకున్నారు. అట్లాంటా శివారుల్లో ఉండే ఆ గే జంట.. హ్యాపీ ఫ్యామిలీ పేరుతో పిల్లల్ని పెంచేం దుకు అంగీకరించారు. కానీ ఆ పిల్లలకు నరకం చూపించినట్లు జిల్లా అటార్నీ రాండీ మెక్‌గిన్లే తెలిపారు. దత్తత పిల్లల్ని రేప్ చేసినట్లు అటార్నీ తన తీర్పులో వెల్లడించారు. జాచరి బ్యాంకి ంగ్ సెక్టార్‌లో పనిచేస్తున్నాడు. ఇక విలియమ్ ఓ ప్రభుత్వ ఉద్యోగి. వాళ్ల జీవితాల్లో బాగానే సెటిల్ అయ్యారు. కానీ రెగ్యులర్‌గా దత్తత పిల్లలను శృంగారంలోకి దింపేవారట. ఇంకా వారితో జరిగే సెక్స్‌ను వీడియోలు తీసేవారు. ఆ తీసిన చిత్రాలను తమ స్నేహితులతో ఆ జంట షేర్ చేసుకునేదని కోర్టులో తేలింది. పోలీసులకు దొరికిన సాక్ష్యాల ఆధారంగా దీన్ని కన్ఫర్మ్ చేశారు. విలియమ్, జాచరిలను 2022లో అరెస్టు చేశారు. పిల్లల్ని లైంగికంగా వేధిస్తున్న ఫోటోలను ఆ జంట ఓ స్నేహితుడికి స్నాప్‌చాట్ చేసినట్లు తెలిసింది. పెడోఫైల్ సెక్స్ రింగులో ఆ పిల్లల్ని దించినట్లు గుర్తించారు. చైల్డ్ పోర్న్‌ను డౌన్‌లోడ్ చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసిన తర్వాత .. ఆ గేంట అఘాయిత్యాలకు బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. తమ దత్తత పిల్లలతో పోర్న్ వీడియోలు చేసేవారని ఆ గే జంటపై ఫిర్యాదు నమోదు అయ్యింది.

# అమెరికా మాజీ అధ్యక్షుడికి అస్వస్థత..



అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను వాషింగ్టన్‌లోని మెడ్‌స్టార్ జార్జ్‌టౌన్ యూనివర్సిటీ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. 78 ఏండ్ల క్లింటన్ తీవ్ర జ్వరంతో బాధతుండటంతో హాస్పిటల్‌లో చేర్పించినట్లు అయన వ్యక్తిగత సిబ్బంది తెలిపారు. వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను వాషింగ్టన్‌లోని మెడ్‌స్టార్ జార్జ్‌టౌన్ యూనివర్సిటీ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. 78 ఏండ్ల క్లింటన్ తీవ్ర జ్వరంతో బాధతుండటంతో హాస్పిటల్‌లో చేర్పించినట్లు అయన వ్యక్తిగత సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని, ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని వెల్లడించారు. క్రిస్మస్ నాటికి తిరిగి ఇంటికి చేరుకుంటానని బిల్ క్లింటన్ ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడిగా బిల్‌క్లింటన్ రెండు సార్లు సేవలందించారు. 1993-2001 వరకు అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ తర్వాత నుంచి తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు. 2004లో తీవ్ర ఛాతీ నొప్పి, శ్వాసకోస సమస్యలు రావడం వల్ల ఆయనకు నాలుగుసార్లు బైపాస్ సర్జరీ అయింది. 2005లో ఊపిరితిత్తులు దెబ్బతినడంతో దవాఖానలో చేరారు. 2021లో మూత్రనాళ ఇన్‌ఫెక్షన్‌కు ఆరు రోజుల పాటు కాలిఫోర్నియాలోని హాస్పిటల్‌లో చికిత్స తీసుకున్నారు. 2022లో కరోనా బారినపడిన ఆయన కొన్నిరోజులకు కోలుకున్నారు. ఇటీవల జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రట్ల తరఫున ప్రచారంలో చురుకుగా పాల్గొన్నారు.

1993-2001 వరకు అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ తర్వాత నుంచి తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు. 2004లో తీవ్ర ఛాతీ నొప్పి, శ్వాసకోస సమస్యలు రావడం వల్ల ఆయనకు నాలుగుసార్లు బైపాస్ సర్జరీ అయింది. 2005లో ఊపిరితిత్తులు దెబ్బతినడంతో దవాఖానలో చేరారు. 2021లో మూత్రనాళ ఇన్‌ఫెక్షన్‌కు ఆరు రోజుల పాటు కాలిఫోర్నియాలోని హాస్పిటల్‌లో చికిత్స తీసుకున్నారు. 2022లో కరోనా బారినపడిన ఆయన కొన్నిరోజులకు కోలుకున్నారు.

# హమాస్ నేత హనియాను చంపింది మేమే..

హనియాను అంతమొందించింది తామేనని ఇజ్రాయెల్ అంగీకరించింది. ఈ ఏడాది జూలై 31న అప్పటి హమాస్ పొలిటికల్ చీఫ్ హనియా ఇరాన్‌లో హత్యకు గురయ్యాడు.

వాషింగ్టన్: హమాస్ నేత ఇస్మాయిల్ హనియాను అంతమొందించింది తామేనని ఇజ్రాయెల్ అంగీకరించింది. ఈ ఏడాది జూలై 31న అప్పటి హమాస్ పొలిటికల్ చీఫ్ హనియా ఇరాన్‌లో హత్యకు గురయ్యాడు. టెహ్రాన్‌లోని ఆయన నివాసంపై జరిగిన వైమానిక దాడిలో ఆయన మరణించిన విషయం తెలిసిందే. తాజాగా ఆయనను చంపింది తామేనని ఇజ్రాయెల్ తొలిసారిగా ప్రకటించింది. ఈ మేరకు ఆ దేశ రక్షణ మంత్రి కాట్జ్ వెల్లడించారు. ఇటీవలి కాలంలో హౌతీ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై ఎక్కువగా క్షిపణులు ప్రయోగిస్తున్నారని, వారికి ఓ స్పష్టమైన సందేశం ఇవ్వాలనుకుంటున్నానంటూ హమాస్, హెజ్బొల్లాలను ఓడించామన్నారు. ఇరాన్ రక్షణ, ఉత్పత్తి వ్యవస్థలను నాశనం చేశామని, సిరియాలో బషర్ అల్ అసద్ పాలననను పడగొట్టామని తెలిపారు. హనియా, సిన్వర్, నస్రల్లాలను హతమార్చామని వెల్లడించారు. యెమెన్‌లోని హౌతీలకు కూడా గట్టి దెబ్బ తప్పదంటూ హెచ్చరించారు.

జూలై 31న ఇరాన్ కొత్త అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రమాణ స్వీకారానికి హాజరైన హనియా.. ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత దాడి జరిగింది. లెబనాన్ రాజధాని బీరుట్‌లో ఇరాన్ మద్దతు గల హెజ్బొల్లా టాప్ కమాండర్‌ను హతమార్చినట్టు ఇజ్రాయెల్ మంగళవారం సాయంత్రం ప్రకటించగా.. దానికి కొద్ది గంటల తర్వాతనే ఈ పరిణామం చోటుచేసుకుంది. దీంతో ప్లాన్ ప్రకారమే హనియేను ఇజ్రాయెల్ హత్యచేసిందని ఇరాన్ అప్పట్లోనే ఆరోపించింది. హనియా 1963లో గాజా సిటీకి సమీపంలోని ఒక శరణార్ధి శిబిరంలో జన్మించాడు. 1980లో హమాస్ గ్రూపులో చేరగా.. 1990లో తొలిసారిగా హనియా పేరు వెలుగులోకి వచ్చింది. హమాస్ వ్యవస్థాపకుడు అహ్మద్ యాసిన్‌కు అత్యంత సన్నిహితుడిగా మెలిగిన హనియా.. 2004లో ఇజ్రాయెల్ దాడుల్లో యాసిన్ మరణించిన తర్వాత గ్రూపులో కీలక వ్యక్తిగా ఎదిగాడు. 2006లో పాలస్తీనా స్టేట్ ప్రధానిగా ఎంపికై గాజా స్ట్రిప్‌ను పాలించాడు. 2017లో హమాస్ చీఫ్‌గా ఎన్నికైన హనియాను.. అమెరికా ప్రపంచ ఉగ్రవాదుల జాబితాలో చేర్చింది. 2019లో ఆయన గాజా స్ట్రిప్‌ను వీడిన ఆయన ఖతార్‌లో నివాసం ఏర్పర్చుకున్నారు.



# చైనా నుంచి 40 స్టీల్త్ ఫైటర్ విమానాలు కొనుగోలు చేయనున్న పాకిస్తాన్



చైనా సుమారు 40 విమానాలను అమ్మేందుకు సిద్ధంగా ఉన్నది. అయితే దీనిపై త్వరలో రెండు దేశాలు అగ్రిమెంట్ కుదుర్చుకోనున్నాయి. చైనా స్టీల్త్ యుద్ధ విమానాలను పాకిస్థాన్ కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయి. చైనాకు చెందిన జే-35ఏ అడ్వాన్స్‌డ్ మిలిటరీ విమానాలను.. కొనుగోలు చేయాలని పాకిస్తాన్ భావిస్తున్నది. సుమారు 40 విమానాలను ఆ దేశం ఖరీదు చేసే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ డీల్ కుదిరితే.. జే-35ఏ స్టీల్త్ ఫైటర్ విమానాలు .. తొలిసారి చైనా దాటి బయటి ప్రపంచంలో కనబడనున్నాయి. డ్రాగన్ దేశం కూడా తొలిసారి అత్యాధునిక మిలిటరీ విమానాలను మరో దేశానికి అమ్మేందుకు ఆసక్తి కనబరు స్తోంది. జే-35ఏ రెండవ ఫిఫ్త్ జనరేషన్ స్టీల్త్ ఫైటర్ విమానం. అమెరికా తర్వాత ప్రపంచంలో రెండవ ఫిఫ్త్ జనరేషన్ స్టీల్త్ విమానం ఉన్న మరో దేశంగా చైనా ఉన్నది. అమెరికాకు చెందిన ఎఫ్-16, ఫ్రాన్స్ మిరాజ్ యుద్ధ విమా నాలు ప్రస్తుతం పాకిస్థాన్ వద్ద ఉన్నాయి. అయితే కాలం చెల్లిన ఆ విమానాల స్థానంలో.. చైనా స్టీల్త్ విమానాలను తీసు కోవాలని పాకిస్థాన్ భావిస్తున్నది. కేవలం రెండేళ్లలోనే 40 స్టీల్త్ విమానాలనకు పాకిస్థాన్‌కు చైనా సరఫరా చేయనున్నట్లు ఓ మీడియా కథనం ద్వారా తెలిసింది. భారీసంఖ్యలో విమానా లను ఉత్పత్తి చేసేందుకు చైనా రక్షణశాఖ రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.

# ప్రేమ, సహనం, శాంతికి నిర్వచనం యేసు క్రీస్తు

క్రిస్మస్ వేడుకల్లో మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, (జనంసాక్షి) :**



ప్రేమ సహనం శాంతికి నిర్వచనం క్రీస్తు ప్రభువు అని, ఆయన చూపించిన మార్గంలో అందరు నడుస్తూ ప్రపంచం శాంతిమయం కావాలని, క్రీస్తు బోధనలు ప్రపంచశాంతికి దిక్సూచి అని, యేసు అనుగ్రహం అందరిపై ఉండాలని తెలంగాణ ఐటి పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. క్రైస్తవుల పర్వదినం క్రిస్టమస్ పండుగ సందర్భంగా బుధవారం మంథని మున్సిపల్ పరిధి శ్రీపాద కాలనీ గల సీయోను చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకలలో మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథులు గా పాల్గొన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు క్రైస్తవ మత పెద్దలు, సంఘ పెద్దలతో కేక్ కట్ చేసి, క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్టమస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబును క్రైస్తవ పెద్దలు, సంఘ పెద్దలు ఘనంగా శాలువాతో సన్మానించి సత్కరించారు. సీయోను చర్చి పునర్నిర్మాణం కోసం రూ. 35 లక్షలు మంజూరు చేయాలని సంఘ పెద్దలు కోరగా ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేపిస్తానని ఆయన హామీ ఇచ్చారు అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మానవవాళికి ప్రేమ, శాంతిమార్గం చూపిన మహనీయుడు యేసుక్రీస్తు అని ఆయన అన్నారు. అతడి అనుగ్రహం అందరిపైనా ఉండాలని తెలిపారు. జీసస్ బోధనలతో ప్రపంచ శాంతి మయం కావాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఏసుక్రీస్తు ప్రభువు సత్యాన్ని ఏనాడు విడనాడలేదని, తను నమ్మిన సిద్ధాంతం కోసం, తన భక్తుల కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప మహనీయుడని ఆయన కొనియాడారు. క్రీస్తు బోధనలు అందరూ అవగతం చేసుకొని, సన్మార్గంలో ముందుకెళ్లాలని ఆయన తెలిపారు. యేసు దైవత్వము సంబంధంచిన విద్యను క్రిస్టోలోజి అని పిలుస్తారని, చరిత్రకారులు మానవ చరిత్రను యేసు క్రీస్తు జీవించిన కాలాన్ని కొలమానంగా తీసుకుంటారు. క్రీస్తు జన్మించక ముందు కాలాన్ని క్రీస్తుపూర్వం అని, క్రీస్తు జన్మించిన తర్వాత కాలనీ క్రీస్తుశకం అని పేర్కొంటారని ఆయన వివరించారు. క్రీస్తు ప్రభువు సూచించినటువంటి సన్మార్గంలో నడుస్తూ ప్రతి ఒక్కరి హృదయాల్లో ప్రేమ నిండాలని అయనా తెలిపారు. ప్రేమ, కరుణ, క్షమాగుణాలను ఏసు తన జీవిత సందేశంగా మానవాళికి అందించారు. క్రీస్తు బోధించిన శాంతి, సహనం, ఔదార్యం సర్వదా ఆచరణీయం. ప్రతి మనిషి పరోపకార గుణం అలవరుచుకోకపోతే జీవితానికి అర్థం ఉండదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్పర్సన్ పెంద్రు రమా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్ కాచే శశిభూషణ్, గుండా పాపారావు, మంథని సత్యం, దైవజనుల శ్రీనివాస్, పాస్టర్లు వల్లూరి ప్రభాకర్ దూడ మహేష్ కలువల సామ్యూల్ సంఘ పెద్దలు అంకరి కుమార్ మంథని ప్రసాద్ అందే రమేష్ చింతకుంట్ల ప్రేమ్ కుమార్ దాసరి సదానందం రామగిరి కుమార్

ఈర్ల సదానందం అంకరి ప్రకాష్ తో పాటు తదితరు పాల్గొన్నారు

# గోదావరి జలాల ద్వారా ములుగు నియోజకవర్గం సస్యశ్యామలం





ములుగు పంపు హౌస్ నుండి గోదావరి జలాలు జంగాల పల్లి బంజరు చెరువుకు నీటిని విడుదల చేసిన మంత్రి దనసరి అనసూయ సీతక్క

**ములుగు ప్రతినిధి,డిసెంబర్ 25(జనంసాక్షి).**

ములుగు పంపు హౌస్ నుండి గోదావరి జలాలు జంగాలపల్లి బంజరు చెరువుకు నీటిని విడుదల చేసిన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్షం మూలన ములుగు నియోజక వర్గానికి చుక్క నీరు ఇవ్వకుండా సిద్దిపేట సిరిసిల్లకు నీళ్లను తరలించుకు పోయారని మంత్రి సీతక్క అన్నారు.రాబోయే రోజుల్లో ములుగు పంపు హౌస్ నుండి కొత్తగూడ, గంగారాం మండలాలకు గోదావరి జలాలు అందించి ఆ రైతాంగాన్ని ఆదుకుంటామని రెండు పంటలకు నీళ్లను అందిస్తామని త్వరలోనే పంపు హౌస్ నుండి కాశిం దేవిపేట మీదిగా కేనాయిల్ ద్వారా లక్నవరం కు నీళ్లను పంపింగ్ చేసుకోవడం జరుగుతుందని, రైతులను రాజులుగా చెయ్యడమే మా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వర్యులు సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, ములుగు జిల్లా గ్రంథాల య చైర్మన్ బాణోత్ రవి చందర్ తో పాటు అధికా రులు మరియు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే ఆత్మవిద్యను బోధించాలి





**కడ్తాల్(కైలాసపురి)డిసెంబర్ 25 (జనంసాక్షి):**

**చిన్న తనం నుంచే పిల్లలకు ధ్యానం,శాకాహారం గురించి బోధించాలి**

**పిల్లలకు ఏమీ కావాలో తల్లిదండ్రులు అర్థం చేసుకొని అందివ్వాలి**

**క్వాంటం లైఫ్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు డాక్టర్ న్యూటన్ కొండవీటి**

విద్యార్థి దశ నుంచే విద్యార్థుకు పాఠ్యాంశాలలో ఆత్మవిద్యను బోధించాలని క్వాంటం లైఫ్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు డాక్టర్ న్యూటన్ కొండవీటి అన్నారు.మహేశ్వర మహా పిరమిడ్ లో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహా యాగంలో 5 వరోజు డిసెంబర్ 25న తల్లిదండ్రులు,పిల్లల మధ్య సంబంధ బాంధవ్యాలు అనే అంశంపై చర్చించారు.ఈ సందర్భంగా డాక్టర్ న్యూటన్ కొండవీటి మాట్లాడుతూ చిన్న తనం నుంచే పిల్లలకు ధ్యానం,శాకాహారం గురించి బోధించాలని తెలిపారు.పిల్లలకు ఏమీ కావాలో తల్లిదండ్రులు అర్థం చేసుకొని అది వారికి అందివ్వాలని సూచించారు.అనంతరం ధ్యానులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పి వారి సందేహాలను నివృత్తి చేసారు.ఈ కార్యక్రమంలో మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్టీ శ్రీరామ్ గోపాల్,డ్యాక్టర్ న్యూటన్,బాలవికాశ్ మహేశ్వరీ, డాక్టర్ జీకే పాల్గొని సందేశాన్ని ఇచ్చారు.ఈ సందర్భంగా బాలవికాస్ మహేశ్వరీ మాట్లాడుతూ గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవని, దీని వలన కుటుంభ సభ్యులు మధ్య మంచి బంధాలు ఉండేవని తెలిపారు.ప్రస్తుతం బీజీ లైఫ్ లో తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపడం లేదని దీని వలన

సమస్యలు వస్తున్నాయని తెలియజేసారు.అనంతరం డాక్టర్ జీకే మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థుకు ఆత్మవిద్యను బోధించాల్సిన అవసరం ఇంతైనా ఉందని పేర్కొన్నారు.

# మహిళలను నమ్మించి మోసగించిన సర్కార్






**తక్షణమే ప్రతి మహిళకు రూ 2500 ఇవ్వాలి**

**మెదక్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

**మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 25 (జనం సాక్షి):**

కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళలను నమ్మించి మోసం చేసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. మహిళల పట్ల ప్రభుత్వానికి నిర్లక్ష్యం, వివక్ష ఎందుకని నిలదీశారు. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసే సోయి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. తక్షణమే మహిళలకు నెలకు రూ 2500 ఇవ్వడం, 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీలను పంపిణీ చేసే కార్యక్రమాలను మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు. క్రిస్మస్ సందర్భంగా బుధవారం నాడు ఎమ్మెల్సీ కవిత మెదక్ చర్చిని సందర్శించారు. అక్కడ ప్రార్థనలు చేశారు. అనంతరం మెదక్ లోని తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... కాంగ్రెస్ పాలనలో క్రిస్మస్ గిఫ్ట్, రంజాన్ తోఫా, బతుకమ్మ చీరల పంపిణీ ఎగిరిపోయాయని విమర్శించారు. రాష్ట్రంలో 40 శాతం నేరాలు పెరగడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. నేరాల రేటు పెరగడం ప్రభుత్వం మహిళల పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధును ఎగ్గొట్టిందని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. తక్షణమే రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కింద అర్హులను తగ్గించే ప్రయత్నం చేయవద్దని ప్రభుత్వానికి సూచించారు. "కేంద్ర ప్రభుత్వపు నిబంధలను అమలు చేస్తే 30 శాతం రైతులకు కూడా రైతు భరోసా రాదు. నిబంధనల పేరిట కారు ఉందనో, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారనో, మరైనా సాకు చెప్పి సాగు చేసే రైతులకు రైతు భరోసా ఎగ్గొడితే చూస్తూ ఊరుకోబోము అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 30 శాతం వరి ధాన్యాన్ని కూడా ప్రభుత్వం సేకరించలేదని ఎండగట్టారు. ధన్యానికి బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం... ఇప్పుడు కేవలం సన్న వడ్లకే పరిమితం చేసిందని, అది కూడా సరిగ్గా ఇవ్వడం లేదని విమర్శించారు. మాట మార్చడం తప్పా ప్రభుత్వంలో ఏం కనిపించడం లేదని, మొక్కజొన్నలు, కందులు, సోయాబీన్, పత్తి వంటి పంటలను మద్దతు ధరను పెంచుతామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. చక్కెర ఫ్యాక్టరీలను ఎప్పుడు తెరిపిస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు.మెదక్ కు నీళ్లు వచ్చే కాళేశ్వరం ప్యాకేజీ 19 పనులను ప్రభుత్వం నిలిపివేడయం దారుణమని అన్నారు. కేసీఆర్ పై కోపాన్ని మెదక్ ప్రజలపై తీర్చుకుంటే ఏమొస్తుందని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్యాకేజీ 19 పనులను కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరోవైపు, తెలంగాణకు తలమానికం మెదక్ చర్చి అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. బీఆర్ఎస్ కేసీఆర్ కు క్రైస్తవులకు పేగుబంధం ఉందని, తెలంగాణ కోసం ప్రార్థన చేయని చర్చి లేదని గుర్తు చేశారు. మత సహనానికి నిదర్శనం మెదక్ అని స్పష్టం చేశారు. మెదక్ జిల్లాను కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని చెప్పారు. కేసీఆర్ గోదావరి జలాలతో సింగూరును నింపారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు శేరి శుభాష్ రెడ్డి

, యాదవ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మెన్ లు మఠం భిక్షపతి, మేడే రాజీవ్ సాగర్, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు ఏం లావణ్య రెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ లు కృష్ణ రెడ్డి, మామిళ్ళ ఆంజనేయులు వంజరి. జయరాజ్ ఆర్కే.శ్రీనివాస్ భీమరి కిషోర్, మెదక్ మండల పార్టీ అధ్యక్షులు అంజ గౌడ్, పట్టణ పార్టీ కో కన్వీనర్లు లింగ రెడ్డి, కృష్ణ గౌడ్, జుబేర్ అహ్మద్, బిఆర్ఎస్ శ్రేణులు నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంద హెచ్చు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

రాష్ట్ర అధ్యక్షుడు ఊర ఐలుమల్లు

**పాలకుర్తి, డిసెంబర్ 25 (జనం సాక్షి)**



ఆర్థికంగా చితికిపోయిన మంద హెచ్చు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని మంద హెచ్ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఊర ఐలుమల్లు ప్రభుత్వాన్ని కోరారు, తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ గంగాదేవి మందహేచ్చు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాల్ లో బుధవారం నిర్వహిం చిన మందహెచ్చుల కళాకారుల మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఊర ఐలు మల్లు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ లో ఉన్న మంద హేచ్చు కళాకారులను ఆదుకోవాలని, కళాకారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అన్నారు, అదేవిధంగా కళాకారుల పింఛన్ ఇవ్వాలని, కళాకారులకు రుణాలు మంజూరు చేయాలని కోరారు, మంద హెచ్ కళాకారులను గుర్తించి అన్ని విధాల ఆదుకోవా లన్నారు, ఈ కార్యక్రమంలో దాదాపు 11 బృందాలు చెందిన 120 మంది కళాకారులు పాల్గొని తమ ఆటపాటలతో పలువురిని అలరింపజేశారు, అనంతరం పాలకుర్తి పట్టణ పెద్దగొల్ల సలేంద్ర సోమన్న చేతుల మీదుగా కళాకారులను సర్టిఫికెట్లు మేమేంటోలు, శాలువాలతో సన్మానించారు, ఈ కార్యక్రమంలో మందహేచ్చు కళాకారులు ఊర పెద్ద ఐలుమల్లు, ఊర సోమల్లు, కిన్నెర పరుశరాములు, ఊర సంపత్, ఊర మత్స్యగిరి, కడెం యాకూబ్ పాషా, కిన్నెర యాకయ్య, కడెం యాకన్న, ఊర యాకమల్లు, కడెం రామ్మూర్తి, ఊర కొండలు, కడెం రాములు, కడెం కుమార్, కిన్నెర యాకమల్లు, ఊర గట్టుమల్లు, కిన్నెర మహేందర్, ఊర పెద్ద మచ్చ గిరి కడెం వెంకట నర్సు,పాల్గొన్నారు.

# అజాతశత్రువు అటల్ బిహారీ వాజ్పేయి



బీజేపీ సీనియర్ నాయకులు పి.సుగుణాకర్ రావు

**కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 25 (జనంసాక్షి) :**

బుధవారం రోజు కరీంనగర్ లోని టవర్ సర్కిల్ వద్ద బిజెపి సీనియర్ నాయకులు జే.డి భగవాన్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, బిజెపి అగ్రనాయకులు, అజాతశత్రువు, భారతరత్న అటల్ బిహారీ వాజ్పేయి శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి బిజెపి సీనియర్ నాయకులు పి. సుగుణాకర్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా పి.సుగుణాకర్ రావు మాట్లాడుతూ, అటల్ బిహారి వాజ్పేయి గొప్ప రాజనీతిజ్ఞుడు, అజాతశత్రువు, అందరి ఆదర అభిమానాలు చూరగొన్న మహనీయుడనీ కొనియాడారు. రాజకీయాలలో ఎలా వ్యవహరించాలి, ప్రజా ప్రతినిధిగా ఎలా మాట్లాడాలి, ప్రతిపక్ష నాయకునిగా ఎలా ఉండాలి, ప్రధానమంత్రిగా ఎలా పరిపాలన కొనసాగించాలని అటల్ బిహారి వాజ్పేయి ని చూసి మనం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. వ్యక్తి కంటే పార్టీ గొప్పది, పార్టీ కంటే దేశం గొప్పది, దేశంలో ప్రజాస్వామిక విలువలను, రాజకీయాలలో నైతిక విలువలను స్థాపించడమే కాకుండా, సామాన్య ప్రజానీకానికి కూడా సామాజిక, ఆర్థిక లాభాలు జరగాలి వారు అభివృద్ధి చెందాలని, గాంధేయ దృక్పథంతో, గాంధేయ సోషలిజాన్ని ప్రతిపాదించిన మహనీయుడు అటల్ బిహారి వాజ్పేయి అన్నారు. ఈ సందర్భంగా అలాంటి మహనీయుని జన్మదినం జరుపుకోవాలని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని

ముందుకు పోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఒక్క సీటు తక్కువ పడ్డ ఎలాంటి ఎంపీలను కొనుగోలు చేయకుండా తన ప్రధానమంత్రి పదవిని త్యాగం చేసిన గొప్ప మహనీయుడు అన్నారు. రాజకీయాలు అంటే ఒకరినొకరు దూషించుకోవడం, ఉన్నాయి లేనట్టుగా లేనియి ఉన్నట్టుగా కల్లబొల్లి కబుర్లు చెప్పుకోవడం ప్రస్తుత రాజకీయాలలో చూస్తున్నామని కానీ అటల్ బిహారీ వాజ్పేయి దేశ హితం కొరకు పాటుపడిన వ్యక్తి అని అన్నారు. ప్రధానమంత్రి పీవీ నరసింహారావు సమయంలో పాకిస్తాన్ సమస్య విషయంలో దూతగా వెళ్లి ఆ సమస్యను పరిష్కరించిన వ్యక్తి అటల్ బిహారి వాజ్పేయి అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తాళ్లపల్లి హరికుమార్ గౌడ్, గంప జగన్, మిరియాల్కర్ ఆనంద్, బేతి మహేందర్ రెడ్డి, తాడూరి బ్రహ్మం, నగునూరి లక్ష్మణ్, గుడిపాటి జితేందర్ రెడ్డి, కూరగాయల తిరుపతి, కామారపు నరహరి, పబ్బ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# మల్హార్ మండల ప్రజలకు శుభవార్త చెప్పిన మంత్రి

రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీదర్ బాబు

**మల్హర్, డిసెంబర్ 25(జనంసాక్షి)**



భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం లోని కిషన్ రావు పల్లి నుంచి భూపాలపల్లి కేంద్రం వరకు రోడ్డు నిర్మాణం

2025 నూతన సంవత్సరంలో అటవీ మార్గంలో తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లుగా రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీదర్ బాబు తెలిపారు.బుధవారం మండలంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొని మల్లారంలోని శ్రీవెంకటేశ్వర ఇండస్ట్రీట్,పెద్దతూ%శీ%డ్ల ఎరువుల,పురుగు మందుల దుకాణాన్ని ప్రారబించి మాట్లాడారు కిషన్ రావుపల్లి అడవి ప్రాంతం మీదుగా 8 కిలోమీటర్ల ఫారెస్ట్ లో అటవీశాఖ అనుమతులు వచ్చాయని కొత్త సంవత్సరంలో రోడ్డు నిర్మాణం పనులు ప్రారభం చేయునట్లుగా తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడం మండల ప్రజలకు జిల్లా కేంద్రానికి వెళ్ళడానికి దూరబారం తగ్గడమే కాక పెద్దపల్లి,భూపాలపల్లి జిల్లాలకు రవాణా సౌకర్యాలు మెరుగు పడతాయన్నారు.ఈ కార్యక్రమంలో ట్రేడ్ రాష్ట్ర చైర్మన్ ప్రకాష్ రెడ్డి,పిఏసిఎస్ చైర్మన్ ఇప్ప మొ%శీ%డయ్య,

మాజి ఎంపిపి మలహల్ రావు,మండల కాగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బడితేల రాజయ్య,భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సిసెల్ అధ్యక్షుడు దండు రమేష్,యూత్ అధ్యక్షుడు గద్దం క్రా%శీ%తి,జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్ జంగిడి శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ వొన్న తిరుపతి రావు,కాంగ్రెస్ నాయకులు కేశారపు చెంద్రయ్య, కిషన్ నాయక్, రూపేస్ రావు,ఇందారపు చెంద్రయ్య,కుంట సదానందం ముదిరాజ్, ప్రభాకర్,సురేష్ రావు,శ్రీదర్,సతీష్ పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన ఆల్ఫోర్స్ అధినేత



**కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 25 (జనంసాక్షి) :**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని హైదరాబాద్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఉమ్మడి మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలుపుతూ సమూలమైన మార్పులు తీసుకువస్తున్న రేవంత్ రెడ్డి ని అభినందించారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ కల్పనకై తమ వంతు సహాయ సహకారాలను అన్ని వేళల్లో అందిస్తామని నరేందర్ రెడ్డి ఈ సందర్భంగా వారికి తెలిపారు.

## నాణ్యమైన పెట్రోల్, డీజిల్ ను వినియోగదారులకు అందించాలి



నూతన పెట్రోల్ బంకును ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర

**రేగొండ(గోరికొత్తపల్లి),డిసెంబర్ 25(జనం సాక్షి):**

మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకును బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. జగ్గయ్యపేట- సుల్తాన్ పూర్ గ్రామాల మధ్యలో రేగొండ మండలంలోని గూడపల్లి కి చెందిన నిర్వాహకులు ఎర్రబెల్లి భాస్కర్ రావు, సూదాటి నవీన్ రావు లు వారు ఏర్పాటు చేసిన శ్రీ వేంకటేశ్వర సర్వో ఫిల్లింగ్ స్టేషన్ (పెట్రోల్ పంపు) ను కుటుంబ సభ్యులతో ,బంధువుల తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రిబ్బన్ కట్ చేసి పెట్రోల్ పంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను వినియోగదారులకు అందించాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో సేల్స్ అధికారులు నరేష్, ఆకాష్, నూతన మండల నాయకులు సూదన బోయిన ఓం ప్రకాష్,ఓబీసీ మండలాధ్యక్షులు పొనుగోటి వీరబ్రహ్మం, మేకల బిక్షపతి,మాజీ సర్పంచులు ఏడునూతల విజేందర్ రెడ్డి, పాతపెల్లి సంతోష్, అమ్ముల రాజయ్య, అంబాల చందు గౌడ్, కట్ల మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు దుగ్యాల సునీత రాజేశ్వరరావు, ఎస్సారెస్పీ మాజీ చైర్మన్ నడిపెల్లి వెంకట్రావు, మడుపు అశోక్ రెడ్డి, గంగుల రమణారెడ్డి,నిమ్మల విజేందర్, కానుగుల తిరుపతి, పత్తి తిరుపతి, ఉపసర్పంచి ఒడ్డాల రాజు, లెంకలపల్లి రవి,ఒడ్డాల తిరుపతి, అమ్ముల సదానందం, పల్లెవేనా కుమార్, బోయిని తిరుపతి, పాల్గొన్నారు.

## అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదం

30న జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయండి

**హైదరాబాద్, డిసెంబర్ 25 (జనం సాక్షి)**

కేంద్ర హౌంశాఖా మంత్రి అమిత్‌షా రాజ్యసభలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అత్యుత్తమ పదివిలో ఉండి చట్టాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన అమిత్‌షా అన్ని వర్గాల ప్రజల కోసం రాజ్యాంగాన్ని రూపకల్పన చేసిన అంబేద్కర్‌ను కించపరిచే, అగౌరవ పరిచే వ్యాఖ్యలు చేయడం ఆయన హౌదాకు తగదు. ఇది దేశ ప్రజల మనోభావాలు దెబ్బతీయడమే. అమిత్‌షా వ్యాఖ్యలపై ఇప్పటికీ ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్పందించలేదు. అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ డిశంబర్ 30న జరిగే దేశవ్యాపిత పిలుపులో భాగంగా రాష్ట్రంలో అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని వామపక్ష శ్రేణులకు, ప్రజాస్వామ్యవాదులకు, ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాయి. ఈ వ్యాఖ్యలపట్ల రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు, ఎంఎల్‌ఏలు, రాష్ట్ర నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటి రెడ్డి

**కరీంనగర్, డిసెంబర్ 25 (జనంసాక్షి) :**



కరీంనగర్ పట్టణలోని సిఎస్ఐ వెస్లీ కేథడ్రల్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి. అనంతరం చిన్నారులతో , పాస్ట్రేట్ కమిటీ మెంబెర్స్ తో కలిసి కేక్ కట్ చేసారు. క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సిఎస్ఐ చర్చి పాస్ట్రేట్ చైర్మన్ రెవ.ఆర్ పాల్ కొమ్మాలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెక్రటరీ దేవదాస్, కోశాధికారి నెల్సన్, కమిటీ సభ్యులు కాల్వ వినయ్ కుమార్, రేఖా ఫ్రాన్సిస్, సాగర్, ప్రదీప్ కుమార్, బొబ్బిలి విక్టర్, కొరివి అరుణ్ కుమార్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెరిడీయన్ అంటే అంత మోజుఎందుకు...!

- అనుమతి లేకుండనే 6- అంతస్తుల కమర్షియల్ భవన నిర్మాణం
- డిప్యూటీ కమీషనర్ రజినీకాంత్ రెడ్డి చర్యలు తీసుకోరా?
- టౌన్ ప్లానింగ్... నిర్మాణదారుడు బాయ్ బాయ్ అంటా..!
- 10ఫీట్ల రోడ్డులో 6- అంతస్తుల భవనమా?
- సర్కిల్-17లో అక్రమ నిర్మాణాలు ఆపేదెవరు..?









**ఖైరతాబాద్, డిసెంబర్ 25 (జనం సాక్షి) :**

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులే నిర్మాణదారులకు దాసోహమైతే ఇంక ఆపేదెవరు? కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమనిర్మాణాలను నిర్మూలించేందుకు విజిలెన్స్, హైడ్రాను ఏర్పాటు చేసినా అక్రమ నిర్మాణదారులు ఇవేమి తమకు పట్టనట్టు భరితెగించి భారీ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యమా లేకా సిబ్బంది లంచగొండి తనమే నిర్మాణదారులకు కల్పవృక్షాలు అయ్యాయి.

జిహెచ్ఎంసి ఖైరతాబాద్ జోన్ సర్కిల్-17లో ఆకాశమే హద్దుగా అక్రమనిర్మాణాలు జరుగుతున్నాయి. సర్కిల్ పరిదిలో అమీర్ పేట్, పంజాగుట్ట, సనతనగర్, సోమాజీగూడ, చింతల్బస్తీ, ఖైరతాబాద్ లలో అక్రమనిర్మాణాలు జోరందుకున్నాయి. జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయానికి దగ్గరలోనే అక్రమనిర్మాణం యదేచ్ఛగా కొనసాగుతున్న సర్కిల్ అధికారి గాని, టౌన్ ప్లానింగ్ అధికారి గాని చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగరం నడిబొడ్డున పంజాగుట్ట ప్రధాన రహదారిలో ఉన్న మెరీడియన్ హోటల్ యజమాని తన భవనం వెనక ఉన్న ఖాళీస్థలంలో జిహెచ్ఎంసి నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా 10ఫీట్ల రోడ్డులో అక్రమంగా 6-అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నాడు. ఇట్టి భవనంపై ఆర్టిఐ సభ్యులు, కొంత మంది మీడియా వాళు పిర్యాదుచేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోడం గమనార్హం. గతంలో కూడా మెరీడియన్ భవనం అక్రమంగా నిర్మించారని పిర్యాదులు రావడంతో 2-అంతస్తులను నేలమట్టం చేశారు. అయినప్పటికీ అధికారుల సహకారంతో ఆభవనాన్ని పూర్తిచేశారు. సదరు యజమాని తిరిగి అనుమతి లేకుండా భవనాన్ని నిర్మిస్తున్నారు. మొక్కుబడిగా నోటీసులు ఇచ్చి టౌన్ ప్లానింగ్ అధికారులు తమపని అయినట్టు వ్యవహరిస్తున్నారు. గతంలో సర్కిల్-18 డిఎంసిగా చేసిన రజినికాంత్రెడ్డి ఎంతో నిక్కస్సుగా, కఠినంగా అక్రమనిర్మాణాలపై చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం మెరీడియన్ బిల్డింగ్ వెనుకాల కడుతున్న భవనంపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నాడో అర్థం కావడంలేదు. కొంత మంది మీడియా సిబ్బంది ఈ భవనంపై వివరణ అడుగగా చర్యలు తీసుకుంటానని చెప్తున్నారేగాని ఆవిధంగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ఖైరతాబాద్ ఆర్ టి ఎ కార్యాలయం ఎదురుగా సందులో ఓభవన యజమాని పాతభవనంలో భారీషెడ్డును ఏర్పాటు చేయడమే కాక సెట్బ్యాక్ స్థలంలో నిర్మాణాలను చేపట్టాడు. కనీసం జిహెచ్ఎంసిలో నిర్మాణంకోసం ధరఖాస్తు కూడా చేసుకోకుండా యదేచ్ఛగా నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు అక్రమనిర్మాణాలపై చర్యలు తీసుకునేలా దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

# కమ్మేస్తున్న మబ్బులు.. కదలని వడ్లు భయంతో రైతన్నలు

**కొనుగోలు సెంటర్ నిర్వాహకుల అధికారుల మధ్య సమన్వయ లోపం**



**కాటారం డిసెంబర్ 25 (జనంసాక్షి) :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాటారం మండలంలో ప్రాథమిక సహకార సంఘం నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రంలో ఇప్పటికీ దాదాపు 70% వడ్లు మిగిలి ఉన్నవి. గంగారం ధన్వాడ విలాసాగర్ దేవరాపల్లి లక్ష్మీపూర్ మరియు మిగతా గ్రామాల్లో వడ్లు కొనుగోలు నెమ్మదిగా జరగడం వలన ప్రతి కళ్ళల్లో వడ్లు మిగిలి ఉన్నవి. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా శుక్రవారం ఉదయం నుండి వర్షం పడుతూనే ఉంది కళ్ళములో రైతులు ఆరబోసిన వడ్లు కొందరు పరదాల కింద కొందరు నేర్పి ఉన్నవి. రైతులు వర్షాన్ని చూసి తట్టుకోలేక కుటుంబ సమేతంగా కుప్పలుగా దొబ్బుతూ ఉన్నారు. కాటారం మండల పరిధిలో చాలా గ్రామాల్లో ఇదే తంతు కొనసాగుతుంది. అధికారుల లోపం అని ప్రజలు రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రాథమిక సహకార సంఘం కొనుగోలు చేసే ప్రతి గ్రామంలోనూ ఇదేవిధంగా ఉందని తాలు తేమ పేరుతో కాలయాపన చేస్తున్నారని రైతులు చెప్తున్నారు. గతంలో కూడా రైతుల వద్ద కటింగ్ పేరుతో చాలా ఇబ్బందులకు గురి చేసినారు. ఈ సీజన్లో కూడా నెమ్మదిగా కల్లానికి లారీ చొప్పున పంపిస్తూ సమయాన్ని వృధా చేస్తున్నారు. నవంబర్ మొదటివారం నుండి కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేసిన ముందుకు సాగడం లేదు అధికారులు కాటార మండలంలో మంత్రి పర్యటన ఉందని తెలవగానే ప్రతి సెంటర్ తిరుగుతూ చెప్తా ఉంటారు . కానీ తర్వాత మరిచిపోయి సెంటర్ నడిపే వారిది హవా కొనసాగుతా ఉంది. రైతులు కూడా వేసంగి వ్యవసాయానికి నారుమడులపై తయారు చేయడం వలన సెంటర్లో తూర్పాల పట్టడం లేట్ చేయడం కారణం అధికారులు చెప్తున్నారు. కాటారం మండల ప్రజలకి ప్రతి పంటకు వడ్లు తడిసి మిల్లర్ల వద్ద కటింగపాలవుతున్నారు. ఒక లారీ ఒకంటికి ఆరు ఏడు క్వింటాళ్ల చొప్పున తడిసిన కర్మానికి వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివలన నిర్వాహకులు కూడా కటింగ్ పేరుతో మిల్లర్ల వద్ద కమిషన్ తీసుకున్నట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి . మండల పరిధిలో గంగారం సెంటర్ యందు 20 లారీలు దామరకుంటయందు 30 లారీలు రేగులగూడెం యందు 20 లారీల వరకు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఏది ఏమైనా జిల్లా అధికారులు స్పందించి వడ్ల కొనుగో లును పెంచే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

## ఏసు ప్రభువు బోధించిన బోధనలు భావితరాలకు అందించాలి





### క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క

**ములుగు ప్రతినిధి, డిసెంబర్ 25(జనంసాక్షి)**

ఓలి మిని స్ట్రీట్ చర్చిలో, లిటిల్ ఫ్లవర్ స్కూల్ లో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈ పవిత్రమైన పండుగ సందర్భంగా ఏసుక్రీస్తు బోధనలైన స్వార్థ రహిత జీవనం, ప్రేమా, దయ, ఎదుటి వారిని క్షమించే గుణం, తమకు ఉన్న జ్ఞానాన్ని పంచుకోవడం ఇవి ఏసు బోధనలు అని శాంతి సౌభ్రాతృత్వాన్ని పంచే క్రీస్తు బోధనలు యధాతధంగా ఎంత గొప్పగా ప్రచారంలోకి వస్తే ఈ ప్రపంచానికి అంత గొప్ప మేలు జరుగుతుంది అని మంత్రి వర్యులు సీతక్క అన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ కేక్ కట్ మంత్రి సీతక్క చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మైనార్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..



టీఎస్ మిస్స జిల్లా అధ్యక్షులు లాల్ మహమ్మద్

**ములుగు ప్రతినిధి, డిసెంబర్ 25(జనంసాక్షి)**

జిల్లా కేంద్రంలోని టీఎస్ మిస్స కార్యాలయం లో తెలంగాణ స్టేట్ మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ ములుగు జిల్లా నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా టీఎస్ మిస్స రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సర్వర్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి 9 మండలాలకు చెందిన ముస్లిం మైనార్టీ ఉద్యోగ, ఉపాధ్యాయులు వివిధ శాఖలలో పనిచేస్తున్నటువంటి మైనారిటీ సోదర, సోదరీమణులు వచ్చి వారి సమస్యలు వివరించి, భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించడం జరిగింది. అనంతరం నూతన కమిటీ ఎన్నిక 35 మందితో ఏర్పాటు చేయడం జరిగింది. నూతనంగా సయ్యద్ ఖాలీద్ హుస్సేన్ అధ్యక్షులు, సయ్యద్ ష ఫైసల్ హుస్సేన్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎండి రఫీక్ అడ్వైజర్, ఎండి లాల్ మహమ్మద్ జిల్లా అధ్యక్షులు, ఎండి మక్బూల్ పాషా జనరల్ సెక్రెటరీ, సయ్యద్ అసద్ మొయినుద్దీన్ అడిషనల్ జనరల్ సెక్రెటరీ, ఎండి తాజుద్దీన్ ట్రెజరర్, ఎండి నయీముద్దీన్ అసోసియేట్ ప్రెసిడెంట్, ఎండి నదీమ్ ఖాన్ వైస్ ప్రెసిడెంట్, సయ్యద్ హర్షద్ వైస్ ప్రెసిడెంట్, ఎండి యూసుఫ్ పాషా ఆర్గనైజింగ్ సెక్రెటరీ, ఆసరా సుల్తానా వైస్ ప్రెసిడెంట్, జీనత్ సుల్తానా సెక్రెటరీ, ఎండి అబ్దుల్ రహీం ఆర్గనైజేషన్ సెక్రెటరీలతోపాటు

మిగతా వారిని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా జిల్లా అధ్యక్షులు లాల్ మహమ్మద్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో తొమ్మిది మండలాల చెందిన ముస్లిం మైనార్టీ ఉద్యోగ, ఉపాధ్యాయులు వివిధ శాఖలలో పనిచేస్తున్నటువంటి అధికారులు పాల్గొన్నారు.

## చిన్న కాళేశ్వరం భూ నిర్వాసితులకు పరిహారం ఇప్పించండి

**కాటారం డిసెంబర్ 25( జనం సాక్షి)**

కాటారం మండల పరిధిలోని చిన్న కాళేశ్వరం పథకం ప్రారంభమై 2008 నుంచి భూ నిర్వాసితులు అధికారుల చుట్టు తిరుగుతున్న కనికరించడం లేదని ఆందోళన చెందుతున్నారు . ఎన్నో ఏళ్లుగా కాస్తు చేస్తూ పట్టా కలియున్నప్పటికీ పరిహారం ఇవ్వలేమంటూ అధికారులు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు స్థానిక ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకే ఇప్పటివరకు ఉన్నామని తర్వాత మంత్రిగారి హామీతో ఇప్పటివరకు ఉన్నామని వారు తెలిపారు. అన్ని మండలాలకు చెరువులు నింపుతామని హామీ ఇచ్చి సిద్దినేపల్లి గారేపల్లి నిర్వాస్తులు గత సంవత్సరం కాలం నుండి మంత్రిని కలిసిన కూడా పరిహారం ఇప్పించిన నాధుడు లేరని వారు బాధపడుతున్నారు 2008 సంవత్సరం అప్పటి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హాయంలో కాటారం డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సాగునీరు అందించుట కొరకు జల యజ్ఞంలో భాగంగా చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించడం జరిగింది. అట్టి ప్రాజెక్టును అప్పటి మంత్రిగా ఉన్న మంత్రి శ్రీధర్ బాబు శిలాఫలకాలు వేసి భూసేకర చేసి కేంద్రంలో రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ కేవలం మొదలైజేషన్ అడ్వాన్స్ వరకు ప్రాజెక్టు పరిమితం చేసి పూర్తిస్థాయిలో భూసేకరణ మరియు ఫారెస్ట్ సంబంధిత క్లియరెన్స్ అనుమతులను సెంట్రల్ లో కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పటికీ మంత్రిగా ఐదు సంవత్సరాల కాలంలో తీసుకు రాలేకపోయారని రైతులు ఆందోళ గా చెప్తున్నారు , 2024 ఎలక్షన్లో భాగంగా గెలిచిన వెంటనే ప్రాజెక్టును ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో పూర్తి చేయించి సంవత్సర కాలంలోపు ప్రతి చెరువును నింపే కార్యక్రమం పూర్తిస్థాయిలో చేస్తానని హామీ ఇచ్చారు . ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గారేపల్లి పంప్ హౌస్ రిజర్వాయర్ ఏర్పాటు చేసిన స్థలంలో ఉన్న భూములకు నిర్వాసితులకు ఇప్పటివరకు పరిహారం అందలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఇప్పటివరకు అధికారుల చుట్టూ తిరిగిన భూ నిర్వాసితులకు డబ్బులు ఇవ్వలేదని వారు తెలుపుతున్నారు ఫాస్ట్ ట్రాక్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన వారికి డబ్బులు ఇప్పించాలని కాటారం మండల రైతులు కోరుతున్నారు.

## "ఉత్తమ వైద్యుడికి సన్మానం"



**కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 25 (జనంసాక్షి) :**

ఉత్తమ వైద్యుడిగా ఫ్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు అందుకున్న శ్రీ సాయి లైఫ్ లైన్ హాస్పిటల్ చైర్మన్ , ప్రముఖ డాక్టర్ ప్రదీప్ కుమార్ ను కరీంనగర్ చెందిన పలు డివిజన్ల కార్పొరేటర్లు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ, హైదరాబాదులోని ప్రముఖ వైద్యశాలలో అందించే ఆపరేషన్లను అతి తక్కువ చార్జ్ చేస్తూ.. అత్యున్నతమైన వైద్య సేవలు అందిస్తున్నందుకు వారి సేవలను గుర్తించి ప్రముఖ లాప్రోస్కోప్ సర్జన్ చిట్టుమల్ల ప్రదీప్ కుమార్ ను ఫ్రైడ్ ఆఫ్ ద నేషన్ అవార్డు ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవవర్మ చేతుల మీదుగా అందుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 54 డివిజన్ కార్పొరేటర్ అతీఫ్ (అతిన), 47 డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ షర్ఫుద్దీన్, 32 డివిజన్ సయ్యద్ బర్కత్ అలీ, శ్రీ సాయి లైఫ్ లైన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ చిట్టిమల్ల ప్రశాంత్ కుమార్ , నాయకులు ఎమ్మె ఖలీద్ , సయ్యద్ సమీర్ ఉద్దీన్ ఉమేజార్ తదితరులు పాల్గొన్నారు.

# ‘టచ్’ చేస్తే లక్షలే..

- రాగూర్ తరహాలో వైద్యానికి లక్షల్లో ఫీజులు
- టచ్ ఆసుపత్రిలో రోగి మృతి
- అడ్మిట్ అయిన 45 నిమిషాలకే రోగి మృతి .
- 40 నిమిషాల వైద్యానికి 4.5 లక్షలు.
- అడ్వాన్స్ 1.5 లక్షల చెల్లింపు.
- మానవత్వం లేకుండా 3 లక్షలు చెల్లించి శవాన్ని తీసుకెళ్లాలని హుకూం
- రోగి బంధువులు రాత్రి నుండి డెడ్‌బాడీ కోసం పడిగాపులు




**మంచిర్యాల ప్రతినిధి, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ హాస్పిటల్ కు ట్రీట్‌మెంట్ కోసం వెళ్తే ఇంటికి ప్రాణాలతో తిరిగి వస్తారని నమ్మకం లేని పరిస్థితి లేదని ప్రచారం జరుగుతోంది. గత మూడు నెలల కాలంలో నలుగురు రోగులు చికిత్స పొందుతూ మృత్యువాతకు గురైనట్లు ఆరోపణలున్నాయి. టచ్ హాస్పిటల్ పేరు చెబితేనే ఠాగూర్ సినిమాలో ట్రీట్‌మెంట్ అనే ప్రచారం ఉంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని టచ్ హాస్పిటల్ కు మంగళవారం రోజు రాత్రి 7 గంటల సమయంలో కాగజ్ నగర్ చెందిన కొంగ శ్రీనివాస్ అనే వ్యక్తి ఛాతి లో నొప్పి రావడంతో టచ్ ఆస్పత్రికి వచ్చారు. హాస్పిటల్ సిబ్బంది శ్రీనివాస్‌ను పరీక్షించి ట్రీట్‌మెంట్ ప్రారంభించడానికి ముందే ఒక లక్ష యాభై వేల నుండి 2 లక్షల వరకు ఖర్చు అవుతాయని రోగి బంధువులతో చెప్పి ప్యాకేజీ మాట్లాడుకున్నారు.

రోగి బంధువులతో అడ్వాన్స్ కింద 1.5 లక్షల రూపాయలు కౌంటర్ లో కట్టించుకున్నారు. అనంతరం ట్రీట్ మెంట్ స్టార్ట్ చేశారు.కౌంటర్‌లో డబ్బులు చెల్లించిన అర్ధగంట తర్వాత ఆస్పత్రి సిబ్బంది వచ్చి రోగి బంధువులకు శ్రీనివాస్ చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. రోగి బంధువులు షాక్ కు గురై ఏమి చెయ్యాలో అర్థం కాని పరిస్థితి లో ఉంటే, మరో 3 లక్షలు కౌంటర్ లో చెల్లించి శవాన్ని తీసుకెళ్లాలని రోగి బంధువులకు తెలిపారు .40 నిమిషాలు వైద్యం చేసి చేస్తే 4.5 లక్షలు బిల్లు ఏమిటని అడిగినప్పటికి హాస్పిటల్ సిబ్బంది స్పందించకుండా అవి మాకు చెప్పకూడదు. మిగతా డబ్బులు చెల్లించే వరకు శవాన్ని ఇవ్వనని చెప్పడంతో రోగి బంధువులు శవం కోసం పడిగాపులు కాశారు.

ట్రీట్మెంట్ స్టార్ట్ చేసే ముందు లక్షన్నర నుంచి 2 లక్షలు అవుతాయని చెప్పి రోగి చనిపోయిన తర్వాత మళ్లీ 3 లక్షలు ఎలా అవుతాయని రోగి బంధువులు ఆస్పత్రి సిబ్బంది తో వాదనకు దిగారు. 40 నిమిషాల వైద్యం చేస్తే నాలుగు లక్షల ఎలా అవుతాయని రోగి బంధువులు అడిగినప్పటికీ ఆసుపత్రి సిబ్బంది బిల్ లు అంతే ఇవ్వాల్సిందే ఇవ్వనిది డెడ్ బాడీ ని ఇవ్వమని చెప్పడంతో డెడ్ బాడీ కోసం పడిగాపులు కాశారు. 1.5 లక్షలు నుండి 2లక్షల లోపు అని చెప్పి రోగి మృతి చెందిన తర్వాత తెల్లారేసరికి హాస్పిటల్ బిల్ 4.5 లక్షలు అయింది అని 1.5లక్షలు పోను మిగతా మూడు లక్షలు కట్టి బాడిని తీసుకెళ్ళమని చెప్పారని బంధువులు ఆవేదన వ్యక్తంచేశారు. చనిపోయిన వాడికి ట్రీట్‌మెంట్ ఎలా చేశారని రోగి బంధువులు హాస్పిటల్ సిబ్బంది తో వాదనకు దిగారు. ఎట్టకేలకు మీడియా,పోలీసులు రంగంలోకి దిగడంతో 3 లక్షల డిమాండ్ నుండి 30 వేలు తీసుకొని డెడ్ బాడీ ని పంపించారు .మూడు నెలల కాలంలో ముగ్గురు రోగులు ఈ ఆస్పత్రిలో ప్రాణాలు కోల్పోయారు .గతంలో కూడా రోగి కడుపు నొప్పి తో వస్తే నిర్లక్ష్యంగా ఆపరేషన్ చేయడంతో రోగి పరిస్థితి విషమించడంతో వారి నిర్లక్ష్యానికి మరో 4 ఆపరేషన్ లు చేసి ప్రాణాల మీదికి తెచ్చారు.మాతో కాదని ఆరోగ్యం పూర్తి క్షీణించిన తర్వాత హైదరాబాద్ కు పంపించి చేతులు దులుపుకొన్నారనే ఆరోపణలు ఉన్నాయి .అప్పటికే ఆరోగ్యం విషమించడంతో రోగి మృతి చెందింది . ఈ తరహాలోనే ముగ్గురు పేషేంట్లు మృతి చెందారనే ఆరోపణలు ఉన్నాయి . అందుకే ఆ ఆస్పత్రిలో అడ్మిట్ అంటేనే యమపురికి దారి అని ఆ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు.

# సీఎం సహాయనిధికి విద్యార్థుల విరాళాల సేకరణ

- అభినందించిన మంత్రి కొండా సురేఖ



**తుర్కయంజాల్, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** సీఎం సహాయనిధి పథకానికి విద్యార్థులు విరాళాలు సేకరించి ఇవ్వడం అభినందనీయమని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మాంచెస్టర్ గ్లోబల్ స్కూల్లో 8, 6వ తరగతి చదువుతున్న కూరపాటి సూర్య తేజ్ భట్, కూరపాటి ధరణి తేజ్ భట్ (అన్నా, చెల్లెలు)లను కొండా సురేఖ సన్మానించారు. సీఎం సహాయ నిధి కొరకు విరాళాలు సేకరిస్తున్న తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడ హెవెన్స్ కార్నర్ కి చెందిన చిన్నారులను అభినందించారు. సేకరించిన అనంతరం త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డికి చిన్నారులు అందజేస్తారని తెలిపారు. గతంలోనూ ఈ చిన్నారులు కేరళలో తుఫాన్లు సంభవించినప్పుడు విరాళాలు సేకరించి ఆ స్కూల్ యాజమాన్యానికి అందించడం జరిగిందని, ప్రతి పౌరుడూ సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని మంత్రి సురేఖ సూచించారు. పిల్లలు చేస్తున్న మంచి పనిని అభినందించి ఆశీర్వదించారు. విద్యార్థులను వెన్నంటి ప్రోత్సాహిస్తున్న తల్లిదండ్రులైన కూరపాటి నరసింహారాజు, గీతాస్రవంతిని మంత్రి సురేఖ అభినందించారు.




# ఆకట్టుకున్న ‘పుస్తక స్ఫూర్తి’

- గోరటి వెంకన్నకి బుక్ ఫెయిర్ సన్మానం

**హైదరాబాద్, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** హైదరాబాద్ బుక్ ఫెయిర్ వేదికగా జరుగుతున్న పుస్తక స్ఫూర్తి కార్యక్రమంలో గోరటి వెంకన్న పాల్గొన్నారు. కవయిత్రి శిలాలోలిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రచయితలు పాల్గొన్నారు. వాగ్గేయకారుడు గోరటి వెంకన్న మాట్లాడుతూ.. “పదో తరగతి దాకా పెద్దగా పుస్తకాలు చదవలేదు. విరాట్ నవల తనని బాగా ప్రభావితం చేసింది. ఆ పుస్తకం చదివితే మంది రచయితలు గుర్తొస్తారు. కృష్ణారెడ్డి చాలా అద్భుతంగా అనువాదం చేసారు. ఇది నా జీవితంలో చాలా సందర్భాల్లో ఉపయోగపడింది. గెలిచినప్పుడు , ఓడినప్పుడు ఇలా నన్ను నేను తరచిచూసుకునేలా చేసింది. నామిని, కేశవరెడ్డి చాలా ఇష్టం” అన్నారు.

శిలాలోలిత మాట్లాడుతూ.. “సాహిత్యం అనేది కనబడని నీరు లాంటిది” అన్నారు. పసాదమూర్తి మాట్లాడుతూ పార్వెట్టా పుస్తకం బాగా నచ్చింది అన్నారు. ఆడెపు లక్ష్మిపతి మాట్లాడుతూ ‘పెంకుటిల్లు బాగా నచ్చిన పుస్తకం. అది చాలా విషయాలను కొమ్మూరి వేణుగోపాలరావు. ఆ నవల నుంచి చాలా విషయాలను నేర్చుకున్నా. చెంఘీజ్ ఖాన్ చరిత్ర బాగా ప్రభావితం చేసాయి’ అని అన్నారు. సిఎ ప్రసాద్ మాట్లాడుతూ ‘టాల్‌స్టాయ్ కథలు, శరత్ నవలలు బాగా ప్రభావితం చేసాయి” అని అన్నారు. చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ.. “మాల్గుడి డేస్, రావి శాస్త్రి ఆరు సారాయి కథలు ఇంకా చాలా పుస్తకాలు ఇష్టం” అన్నారు. సునంద మాట్లాడుతూ, “ బాలమిత్ర, చందమామ కథల పుస్తకాలు చదువుతూ పెరిగాను. స్వీట్ హోమ్ నచ్చింది. నీలిమేఘాలు చదివాక నన్ను నేను తెలుసుకున్నాను” అన్నారు. రూప్ కుమార్ డబ్బికార్ కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు కవి యాకూబ్ గోరటి వెంకన్నని సత్కరించారు. ఈ కార్యక్రమంలో బుక్ ఫెయిర్ అధ్యక్ష కార్యదర్శులు యాకూబ్, ఆర్ వాసు ఉన్నారు.

# సేంద్రీయ సాగులో తెలంగాణ రైతులది చరిత్ర

- భారత ఉప రాష్ట్రపతి జాగదీప్ దన్కర్
- కౌడిపల్లి మండలం తునికి కెవికె సందర్శన






**మెదక్ జిల్లా బ్యూరో/ కౌడిపల్లి డిసెంబర్ 25 (జనంసాక్షి) :** సేంద్రీయ సాగులో తెలంగాణ రైతులు చరిత్ర సృష్టించారని భారత ఉప రాష్ట్రపతి జాగదీప్ దన్కర్ అన్నారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి లోని కృషి విజ్ఞాన కేంద్రానికి ఉపరాష్ట్రపతి జగదీప్ దన్కర్, ఆయన సతీమణి డాక్టర్ సుదేశ్ దన్కర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హెలికాప్టర్లో చేరుకున్న అనంతరం కెవికె యాజమాన్యంతో పాటు మంత్రి కొండ సురేఖ, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. మొదట కృషి విజ్ఞాన కేంద్రంలో మొక్క నాటిన ఉపరాష్ట్రపతి, అక్కడే ఏర్పాటు చేసిన సేంద్రియ ఎరువులకు సంబంధించిన స్టాల్స్ పరిశీలించారు. అనంతరం కెవికెలోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ప్రకృతి సేంద్రీయ వ్యవసాయ సాగుపై దాదాపు 800 మంది రైతులతో ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉపరాష్ట్రపతి. సేంద్రీయ వ్యవసాయ సాగు పద్ధతులపై ఉపరాష్ట్రపతి, గవర్నర్ పలువురు రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ ఈ గ్రామం చిన్నది కాదని, తనకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ గ్రామ రైతులు సేంద్రియ సాగులో తక్కువ సమయంలో ఎక్కువ అభివృద్ధి, మార్పు సాధించిందని కితాబు ఇచ్చారు. ఈ గ్రామ సేంద్రియ సాగు రైతులందరూ మూడు రోజుల పాటు ఢిల్లీలో తన స్వగృహానికి అతిధులుగా రావాలన్నారు. తనకు ఈ 655 మంది సేంద్రియ రైతులు, తునికి గ్రామ రైతులు ప్రత్యేక అతిధులని, వారిని మూడు రోజుల పాటు ఢిల్లీలో అతిధ్యం ఇస్తున్నానన్నారు. త్వరలో భారత్, జపాన్, జర్మనీ దేశాలను వెనక్కు నెట్టి ప్రపంచంలో మూడవ ఆర్థిక వ్యవస్థగా అవిర్భవించబోతుందన్నారు. 2001 సంవత్సరంలో అప్పటి ప్రధాని వాజ్‌పాయ్ నేతృత్వంలో కిసాన్ దివస్‌ను ప్రకటించారని, త్వరలో అత్యంత వైభవంగా రజతోత్సవం నిర్వహించుకోబోతున్నామని అన్నారు. దేశంలోని 730 పైచిలుకు కృషి విన కేంద్రాలు150 ఐకార్ సంస్థలు ఈ ఉత్సవాల్లో పాల్గొనాలన్నారు. భారత ఆర్థిక వ్యవస్థలో రైతుల భాగస్వామ్యం ఉంటేనే దేశం పురోభివృద్ధి చెందుతుం దన్నారు. ఇంధన, సహజ వనరులను అవసరం మేరకే వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ వ్యవస్థలో తమ గ్రామాల్లో పండించిన పండ్లు, కూరగాయలను యూనిట్‌గా ఏర్పాటు చేసుకుని అక్కడే విక్రయించు కోవాలని పిలుపునిచ్చారు. ఆ ప్రాంతంలోనే విక్రయించిన ట్లయితే.... ఆ ప్రాంత గ్రామీణ వ్యవస్థ అభివృద్ధి చెందుతుందన్నారు. కృషి విన కేంద్రాల్లో వేలాది సంఖ్యలో శాస్త్రవేత్తలు, తగిన ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ అనుకున్న రితీలో రైతులను నూతన పద్దతులను వినియోగించుకునే విధంగా చైతన్య పరచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో దాదాపు 10కోట్ల మంది రైతులు ఉన్నారని, ప్రభుత్వం కల్పించే సంక్షేమ ఫలాలు అందడం లేదని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు రైతులకు అందే విధంగా కెవికె వంటి సంస్థలు భాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యుత్ సబ్సిడీ లపై ఆధారపడకుండా సోలార్ విద్యుత్ వినియోగించుకునే విధంగా రైతులను చైతన్యపరచాలని సూచించారు. భారత దేశ రైతులు సాగులో ప్రపంచంలోనే శ్రేష్టమైన రైతులుగా ఎదిగేందుకు కేవికేలు, ఐకార్‌లు కృషి చేయాలన్నారు. గాంధీ జీ స్వాదేశి నినాధ స్ఫూర్తితో ఫోకల్ ఫర్ లోకల్‌ను ప్రధాని మోదీ పిలుపునిచ్చారన్నారు. 1989లో విదేశి మారకద్రవ్య నిధులతో పోల్చుకుంటే ప్రస్తుతం 700 రేట్లు పెరిగిందన్నారు. రైతులు ఆందోళనలో ఉన్నారు. వారితో చర్చించి వారి సమస్యలను పరిష్కారం చూపాలన్నారు. భూ, వాయు, అంతరిక్ష, ఆకాశ మార్గాల్లో భారత్ దూసుకెళ్తుందన్నారు. ప్రతి భారతీయుడు జాతీయ వాధం పై విశ్వాసంతో ఉండాలని ఉప రాష్ట్రపతి సూచిం చారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండ సురేఖ,ఎంపీ రఘునందన్ రావు, అదనపు కలెక్టర్ నాగేష్, మెదక్ జిల్లా పోలీస్ యంత్రాంగం, ఆయా శాఖల అధికారులతో పాటు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



**యాదాద్రి భువన గిరి, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** కామారెడ్డి డిక్లరేషన్ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రైతు బంధు అమలుపై స్పష్టమైన హామీని నిలబెట్టుకోవాలి. యాదాద్రికి రాగానే రైతు బంధు హామీ గుర్తుకువస్తుంది. గ్రామాల వారిగా కలెక్టర్ నుంచి పూర్తి స్థాయి నివేదిక తీసుకురావాలి. జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి. అప్పుడే ఎన్నికలకు వెళ్ళాలి. న్యాయ పరమైన చిక్కులకు ప్రభుత్వమే బాధ్యత వ్యవహరించాలి. రూపాయి ఖర్చు లేని హామీ రిజర్వేషన్ అమలు చేయాలి అని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్యంకొండ వద్ద రోప్ వే, సకల వసతులు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపాలి. టెంపుల్ సిటీలో 200 ఎకరాలు గటంలోనే కేటాయించాం. టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీ కింద రూ. 2 కోట్లు కేటాయించాం. సినీ పరిశ్రమ తరలిస్తే ఊరుకోం. సంధ్య థియేటర్‌లో జరిగిన ఘటనపై బాధితులకు న్యాయం చేయాలి. రేపు వచ్చేది మా ప్రభుత్వమే, అన్నివిధాలా ఆదుకుంటాం. రియల్ ఎస్టేట్ వ్యాపారం కేసీఆర్ హయాంలో పుంజుకుంది.. ఇప్పుడు కుదేలైంది అని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.

# హామీలు అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- మహిళలను నమ్మించి మోసం చేసిన రేవంత్‌రెడ్డి
- పండుగలకు కనీసం బట్టలు కూడా ఇవ్వలేని కాంగ్రెస్ : ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. రేవంత్ రెడ్డి సర్కార్ మహిళలను నమ్మించి మోసం చేసిందని కవిత ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో క్రిస్మస్ గిఫ్ట్, రంజాన్ తోఫా, బతుకమ్మ చీరల పంపిణీ ఎగిరిపోయాయని ఆమె ఎద్దెవా చేశారు. మెదక్ చర్చిని సందర్శించిన అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని సీఎం ప్రకటిస్తారని మహిళలకు ఆశించారు. కళ్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటన చేస్తారని ఊహించారు. కానీ ప్రభుత్వం ఎటువంటి ఆలోచన చేయడం లేదు. రాష్ట్రంలోని ఒక్కో ఆడబిడ్డకు ప్రభుత్వం రూ. 30 వేలు బాకీ పడింది. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీ ఇవ్వలేదు. తక్షణమే స్కూటీల పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టాలని కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 40 శాతం నేరాలు పెరిగాయి. నేరాల పెరుగుదల.. ప్రభుత్వం మహిళల పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసే సోయి ప్రభుత్వానికి లేదు. మహిళలు చూస్తూ ఊరుకోబోరు.. కచ్చితంగా ప్రశ్నిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధును ఎగ్గొట్టింది. తక్షణమే రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలి. రైతు భరోసా కింద అర్హులను తగ్గించే ప్రయత్నం చేయవద్దు. కేంద్ర ప్రభుత్వపు నిబంధలను అమలు చేస్తే 30 శాతం రైతులకు కూడా రైతు భరోసా రాదని కవిత పేర్కొన్నారు. మొక్కజొన్నలు, కందులు, సోయాబీన్, పత్తి వంటి పంటలను మద్దతు ధరను పెంచుతామని ఇచ్చిన హామీ ఏమైంది..? ఏడాది కాలంగా ఏ ఒక్క పంటకు మద్దతు ధర ఇవ్వడం లేదు. చక్కెర ఫ్యాక్టరీలను ఎప్పుడు ఓపెన్ చేస్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా రేషన్ కార్డులు ఇవ్వలేదు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సిందే. తక్షణమే రేషన్ కార్డులు మంజూరు చేయాలని కవిత డిమాండ్ చేశారు. తెలంగాణకు తలమానికం మెదక్ చర్చి. బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు క్రైస్తవులకు పేగుబంధం ఉంది. తెలంగాణ కోసం ప్రార్థన చేయని చర్చి లేదు. మత సహనానికి నిదర్శనం మెదక్. మెదక్ జిల్లాను కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారు. కేసీఆర్ గోదావరి జలాలతో సింగూరును నింపారు. మెదక్‌కు నీళ్లు వచ్చే కాళేశ్వరం ప్యాకేజీ 19 పనులను ప్రభుత్వం నిలిపివేదయం దారుణం. కేసీఆర్‌పై కోపాన్ని మెదక్ ప్రజలపై తీర్చుకుంటే ఏమొస్తుంది..? కాళేశ్వరం ప్యాకేజీ 19 పనులను కొనసాగించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.

# ప్రజాస్వామ్యంపై మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యంపై మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. అంబేడ్కర్ బతికినన్ని రోజులు ఆయన్ను కాంగ్రెస్ అవమానించిందని అన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేసిన అంబేడ్కర్‌ను కాంగ్రెస్ ఓడించిందని తెలిపారు. మంత్రిగా ఉన్న అంబేడ్కర్‌తో నెహ్రూ రాజీనామా చేయించారని పేర్కొన్నారు. 1954 నుంచి 88 వరకు నెహ్రూ, ఇందిరాగాంధీ సహా 21 మందికి కాంగ్రెస్ భారతరత్న ఇచ్చిందని.. కానీ అంబేడ్కర్‌ను ఎందుకు విస్మరించిందో సమాధానం చెప్పాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో అంబేడ్కర్ ఫొటో కూడా ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. అంబేడ్కర్ ఆశయాలను అమలు చేస్తున్న పార్టీ బీజేపీ అని కిషన్ రెడ్డి తెలిపారు. అబద్ధాలతో ముందుకు వెళ్తున్న పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. దేశ ప్రజల స్ఫూర్తి ప్రదాత వాజ్‌పేయీ అని.. భారత దేశ వైభవాన్ని, నైతిక విలువలకు ప్రపంచానికి చాటి చెప్పారని అన్నారు. ఆయన ఎప్పుడూ పదవులకు ఆశపడకుండా నిస్వార్థంగా పనిచేశారని చెప్పారు. ఒక్క ఓటుతో అధికారం కోల్పోయినా ప్రజా తీర్పు కోరి మళ్లీ అధికారంలోకి వచ్చారని గుర్తుచేశారు. మోదీ ప్రభుత్వం వాజ్‌పేయీ ఆశయాలను తూచా తప్పకుండా అమలు చేస్తుందని చెప్పారు. కుటుంబ రాజకీయాలకు కాంగ్రెస్ తీసుకొచ్చిందని మండిపడ్డారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ నిజస్వరూపాన్ని ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలకు కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# పార్లమెంట్ సమీపంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 25 (జనంసాక్షి) :** దేశ రాజధాని ఢిల్లీలోని పార్లమెంట్ భవనం సమీపంలో కలకలం రేగింది. ఓ వ్యక్తి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. లోకల్ పోలీసులు, రైల్వే పోలీసులు, స్థానికులు తక్షణమే స్పందించి మంటలను ఆర్పేశారు. అతడిని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఘటనకు పాల్పడిన వ్యక్తి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, బాగ్‌పట్ జిల్లాకు చెందిన జితేంద్రగా గుర్తించారు. పార్లమెంట్ సమీపం లోని రైల్వే భవన్ ఆవరణలో బుధవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే జితేంద్ర ఎందుకు అక్కడికి వచ్చి ఆత్మహత్యాయత్నం చేశాడనే వివరాలు తెలియాల్సి ఉంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370